Dwaraka

సంక్రాంతి శుభాకాంక్షలు

ఆంధ్రప్రభ

Estd. 1938

www.prabhanews.com

Journalism first!

సంపుటి:56 . సంచిక:275 . సోమవారం 15 జనవరి 2018 . హైదరాబాద్ ❋ పేజీలు:12+12 . వెల: 5.00 . Published from: Hyderabad | Vijayawada | Guntur | Rajahmundry | Visakhapatnam | Tirupati | Karimnagar | Kurnool | Suryapet | Anantapur | Nellore | Nizamabad

- ఉద్యోగులకు తీపి కబురు

గ్రాట్యుటీకీ TAX FREE నో ట్యాక్స్

- రూ. 20 లక్షల వరకు ఊరట!
- బడ్జెట్ భేటీలో బిల్లు ఆమోదం!

న్యూఢిల్లీ: కేంద్ర బడ్జెట్ వైపు ఆశగా ఎదురు చూస్తున్న ఉద్యోగులకు తాయిలాలు అందించే దిశగా జైట్లీ పద్దు సిద్ధమవుతోంది. మోడీ సర్కారు ఈ మేరకు దృష్టిసారించినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా ఉద్యోగుల గ్రాట్యుటీకి సంబంధించి సానుకూల నిర్ణయం వెలువడే అవకాశం ఉందని అధికార వర్గాల సమాచారం. రానున్న బడ్జెట్ సమావేశాల్లో 2017 గ్రాట్యుటీ చెల్లింపు సవరణ బిల్లును ఆమోదించేందుకు కసరత్తు జరుగుతోంది. ఈ సవరణలు ఓకే అయితే, ఉద్యోగులు పొందే గ్రాట్యుటీపై భారీ మొత్తంలో పన్ను మినహాయింపు లభిస్తుంది. ప్రస్తుత చట్టం ప్రకారం ఐదేళ్ల సర్వీసు అనంతరం ఉద్యోగం వదలివెళ్లడం, లేదా పదవీ విరమణ పొందే సమయంలో లభించే గ్రాట్యుటీలో రూ. 10 లక్షలకు మాత్రమే పన్ను మినహాయింపు ఉంది. తాజా చట్ట సవరణ ద్వారా ఈ మొత్తాన్ని రూ. 20 లక్షలకు విస్తరించనున్నారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా వ్యవస్థీకృత రంగంలోని ఉద్యోగులకు ఈ మేరకు పన్ను మినహాయింపు వర్తిస్తుంది. గతేడాది చివరలో ముగిసిన శీతాకాల సమావేశాల్లోనే (డిసెంబర్ 18న) ఈ బిల్లు పార్లమెంటు ముందుకు వచ్చింది. బడ్జెట్ సమావేశాల్లో ఇది ఆమోదితమైతే, మరోసారి గ్రాట్యుటీపై ఉచిత పన్ను మొత్తాన్ని నిర్ణయించాల్సిన ➩ 7వ పేజీలో...

గులాబీ పార్టీలో ఎన్నికల ఫీవర్

టికెట్... టికెట్

- టికెట్లు 112.. ఆశావహులు 1000కిపైనే
- క్షేత్రనాడిని సీఎంకు వివరించిన మంత్రి హరీశ్
- త్వరలో నియోజకవర్గాల వారీగా సమీక్షలు
- ఒంటరిగానే ఎన్నికల బరిలోకి దిగాలని నిర్ణయం

హైదరాబాద్, ఆంధ్రప్రభ: టిఆర్ఎస్ పార్టీలో ఎన్నికల ఫీవర్ ప్రారంభమైంది. ఎన్నికలు ఎపుడొచ్చినా.. సిద్దంగా ఉండాలంటూ పార్టీ సంకేతాలిచ్చిన నేపథ్యంలో నేతలు అందుకు తగిన కసరత్తులో మునిగి పోయారు. టికెట్‌లు ఆశిస్తున్న నేతలు తాము నమ్ముకున్న నేతల చుట్టూ.. అపుడే తిరగడం, ఒత్తిడి పెంచడం ప్రారంభించగా.. రాజకీయ వేగాన్ని చూసి గులాబీపార్టీ పెద్దలు తర్జనభర్జన పడుతున్నారు. వేడెక్కుతున్న రాజకీయపరిణామాల నేపథ్యంలో ముఖ్యమంత్రి కెసిఆర్ వ్యూహాత్మక కసరత్తు చేస్తున్నారు. బడ్జెట్ సమావేశాలు ➩ 7వ పేజీలో...

రైతుకు బాసటగా... పెట్టుబడి మద్దతు..!



తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పాటయ్యాక పాలనపై తన సరికొత్త పంథాను నిరూపించుకుంటున్న ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు రాజకీయ భవిష్యత్తుపై రెండేళ్ళ ముందుగానే దృష్టి కేంద్రీకరించారు. 2019 ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా కేసీఆర్ పావులు కదుపుతున్నారు. ఇప్పటికే ప్రారంభించిన... అమలు చేస్తున్న పథకాలు, కార్యక్రమాలపై విస్తృత ప్రచారం కల్పించాలని.. అందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించారు.



- బీడు భూములు మినహా అందరికీ వర్తింపు
- బేరర్ చెక్కుల ద్వారానే పంపిణీకి సిఫారసు
- వీఆర్వోలు, ఏఈవోలు, పంచాయతీ కార్యదర్శుల ద్వారా ఇంటింటికీ బట్వాడా
- నిధులపై కేంద్రాన్ని ఒప్పించాలని ముఖ్యమంత్రికి కేబినెట్ సబ్‌కమిటీ వినతి
- ఉపసంఘం నివేదికకు కేసీఆర్ ఆమోదం
- త్వరలో ఢిల్లీ వెళ్లేందుకు సీఎం సంసిద్ధం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : పెట్టుబడి మద్దతు పథకంపై ఎట్టకేలకు స్పష్టత వచ్చింది. వారం, పది రోజుల పాటు విస్తృతస్థాయి చర్చలు, సంప్రదింపులతో కసరత్తు చేసిన మంత్రివర్గ ఉపసంఘం శనివారం రాత్రి ముఖ్యమంత్రికి నివేదిక సమర్పించింది. ఈ పథకం అమలు విషయంలో తలెత్తిన అనేక సందేహాలను నివృత్తి చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. బీడు భూములు మినహాయించి వ్యవసాయ యోగ్యమైన భూములు కలిగి ఉన్న ప్రతి రైతు కుటుంబానికీ పెట్టుబడి రాయితీ పథకాన్ని వర్తింపజేయాలని మంత్రులు తేల్చి చెప్పారు. బేరర్ చెక్కుల రూపంలోనే ఈ మొత్తాన్ని పంపిణీ చేయాలని తీర్మానించారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి 5వేల ఎకరాల సాగు విస్తీర్ణానికి ఒకరి చొప్పున నియమించిన వ్యవసాయ విస్తరణాధికారులు (ఏఈవోలు), గ్రామ రెవెన్యూ అధికారుల (వీఆర్వోలు), పంచాయతీ కార్యదర్శుల ➩ 3వ పేజీలో...

పండుగ వేళ నోట్ల తిప్పలు 3లో

పంచవర్ష ప్రణాళిక

- విజయ సోపానాలపై లఘుచిత్ర రూపకల్పన
- ఒక్కో ప్రాధాన్యతా రంగానికి డాక్యుమెంటరీ
- ప్రతిష్టను పెంచుతున్న పథకాలకు ప్రథమప్రాధాన్యత
- ప్రతిష్టాత్మక కార్యక్రమాలు, కీలక నిర్ణయాలు హైలెట్
- త్వరలోనే కార్యాచరణ ప్రారంభించేందుకు మార్గదర్శకాలు
- జూన్‌లో లఘుచిత్రాల విడుదలకు చర్యలు
- అనంతరం ప్రజాక్షేత్రంలోకి సీఎం కేసీఆర్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఆధునిక రాజకీయాల్లో ఆయనది అందెవేసిన చెయ్యి అన్న పేరు తెచ్చుకున్న సీఎం కేసీఆర్ అన్ని వర్గాల ప్రజలతో మమేకమయ్యేందుకు సిద్ధమవుతున్నారు. కొత్త పథకాలు, సరికొత్త కార్యక్రమాలతో సుపరిపాలనకు బాటలు వేస్తూ ముందుకు సాగుతున్న ఆయన వచ్చే ఐదేళ్ళపై దృష్టిపెట్టారు. అందుకోసం వ్యూహాత్మక ప్రణాళిక సిద్ధం చేసుకున్నారు. ప్రజలే తన మార్గనిర్దేశకులుగా భావిస్తున్న ముఖ్యమంత్రి అన్నివేళలా వారిని కలుపుకుని పోయే రీతితో బృహత్తర కార్యాచరణ, దీర్ఘకాలిక లక్ష్యాలతో ముందుకు సాగుతున్నారు. స్థానిక, రాష్ట్ర, రాజకీయ, సామాజిక, ఆర్థిక పరిస్థితులకు అనుగుణమైన రీతిలో రోడ్‌మ్యాప్ రూపొందించుకున్నారు. ఇప్పటి వరకూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించి అమలు చేస్తున్న ముఖ్యమైన పథకాలపై డాక్యుమెంటరీలు సిద్ధం చేస్తున్నా రు. వాటిని కేవలం ప్రజల్లోకి వదిలి ఊరుకోకుం డా, వివిధ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొంది నవారే కాకుండా అన్ని వర్గాల ప్రజలు చూసేలా పకడ్బందీ చర్యలు తీసుకోవాలన్నది కేసీఆర్ ఆలోచన.

ప్రగతి భవన్‌ను వేదికగా చేసుకుని అన్ని వర్గాల ప్రజలను అక్కడికి రప్పించే ప్రయత్నాలు చేస్తున్నారు. అన్ని వర్గాల ప్రజల అభిప్రాయాలు తెలుసుకుని వారి అభిమతాలకు, ఆకాంక్షలకు తగిన విధంగా ➩ 7వ పేజీలో...

లౌకికవాదంలో హిందుత్వం!?

- ప్రధాన రాజకీయ పార్టీల్లో కొత్త ధోరణులు
- మారుతున్న ఓటుబ్యాంకు ప్రాధాన్యతలు
- కొత్త సెక్యులరిజంలోకి కాంగ్రెస్, తృణమూల్
- అదే బాటలోకి మరికొన్ని జాతీయ పార్టీలు!

న్యూఢిల్లీ: రాజకీయాల్లో 'సామాజిక' మార్పులు కొత్త ఒరవడికి తెరలేపుతున్నాయి. ఇప్పటిదాకా ఉన్న ఓటు బ్యాంకు రాజకీయాలు రూటు మారుతున్నాయి. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ తరహా సంస్కృతి ప్రాధాన్యత పెరిగింది. వెనుకబడిన తరగతులు, కులాలు, మైనార్టీలకు పెద్దపీట వేస్తున్న ప్రధాన రాజకీయ పార్టీలు సైతం అసహజ పరిణామాలను అయిష్టంగానే స్వాగతించాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి. వెరసి హిందుత్వంతో కూడిన నూతన లౌకికవాదం ఆవిష్కృతమవుతోంది. ఎన్నడూ గుడిమెట్లు తొక్కని కాంగ్రెస్ అధినేత రాహుల్ హిందూ ఆలయాల చుట్టూరా ప్రదక్షిణలు చేయడం, ముస్లింలను ఆయువు పట్టుగా భావించే పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ బ్రాహ్మణ సదస్సుకు మద్దతివ్వడం వంటి పరిణామాలే ఇందుకు సంకేతం. దేశంలోని చాలా రాష్ట్రాల్లో బీజేపీ అధికారంలో ఉంది. కొన్నిచోట్ల సొంతంగా, మరికొన్ని చోట్ల ప్రభుత్వంలో భాగస్వామిగా ఉంది. కాషాయ పార్టీ ఎదుగుదలకు హిందు ఓటు బ్యాంకే కారణమని ప్రతిపక్షాలు గుర్తించాయని, ఈ క్రమంలోనే తామూ హిందూ ఓటర్లకు చేరువ కావాలని నిర్ణయించినట్లు కనిపిస్తోంది. కాంగ్రెస్ నుంచి తృణమూల్ పార్టీల దాకా కొత్త వ్యూహంవైపు మొగ్గు చూపుతున్నాయని తెలుస్తోంది. కాంగ్రెస్, తృణమూల్ తీరుతో బీజేపీ ఓటు బ్యాంకుకు గండిపడుతుందా? లేదా? అన్నది ఆసక్తిగా మారింది. కాగా, సెక్యులర్ పార్టీలు హిందుత్వ బాటను ఆశ్రయించడం భారత రాజకీయాల్లో పెను మార్పుగా విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఇటీవల జరిగిన గుజరాత్ రాష్ట్ర ఎన్నికల్లో ➩ 7వ పేజీలో...



ముహూర్తం

శ్రీ హేవళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంతఋతువు, పుష్యమాసం, తిథి: బహుళ చతుర్దశి తె. 4.42 వరకు, అనంతరం అమావాస్య; నక్షత్రం: మూల సా. 4.42 వరకు, అనంతరం పూర్వాషాఢ; అమృతకాలం: ఉ. 9.40 నుండి 11.25 వరకు; వర్జ్యం: మ. 3.00 నుండి 4.42 వరకు, తదుపరి తె. 3.20 నుండి 5.06 వరకు; దుర్ముహూర్తం: మ. 12.24 నుండి 1.12 వరకు, తదుపరి మ. 2.48 నుండి 3.36 వరకు ; రాహుకాలం: ఉ. 7.30 నుండి 9.00 వరకు; యమగండం: ఉ. 10.30 నుండి 12.00 వరకు;

సీఎస్ ఎస్పీ సింగ్ పదవీకాలం పొడిగింపు!

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఈ నెలాఖరుతో ముగియనున్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్ పదవీకాలాన్ని మూడు నెలలపాటు పొడిగించాలని రాష్ట్ర ప్రభుత్వం పంపిన ప్రతిపాదనకు కేంద్ర ప్రభుతక్వం సానుకూలంగా స్పందించింది. అధికారికంగా ధృవీకరణ రావాల్సి ఉంది. ఇందుకు సంబంధించి వారం రోజుల క్రితమే కేంద్ర ప్రభుత్వానికి సీఎం కేసీఆర్ లేఖ రాశారు. కేంద్ర హోంమంత్రిత్వశాఖ ఉన్నతాధికారులతో ఈ అంశంపై ప్రత్యేకంగా మాట్లాడారు. ఈ నెలలోనే జరగనున్న ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలు, కొన్ని కీలకమైన బిల్లుల ఆమోదం తదితర కార్యక్రమాలు ఉన్నందున ఎస్పీ సింగ్ సేవలు మరో మూడు నెలలపాటు అవసరమన్న విషయాన్ని స్పష్టంచేశారు. పదవీకాలం ముగిసిన సీఎస్‌లకు మూడు నెలల చొప్పున కాలపరిమితిని పొడిగించే ఆనవాయితీ రాష్ట్రంలో ఇదివరకే ఉన్నందున ఎస్పీ సింగ్‌ను కొనసాగించేందుకు కేంద్రం సానుకూల సంకేతాలు ఇచ్చింది.

ఢిల్లీలో వైభవంగా సంక్రాంతి సంబరాలు

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: దేశ రాజధానిలో రెండో రోజు సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. ఆంధ్రప్రదేశ్ భవన్‌లో ఆదివారం జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అలరించాయి. తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే రీతిలో 2 గంటల నుంచే కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. చిన్నారులు, యువతులు, మహిళామణులకు ముగ్గుల పోటీలు, గొబ్బెమ్మలు, సంక్రాంతి లక్ష్మి, చిన్నారులకు భోగిపండ్లు, సంక్రాంతి పొంగలి తయారీ, గంగిరెద్దుల ప్రదర్శన, హరిదాసులు, పగటి వేషాలు, కోలాటం, జానపద గేయాలు, జానపద నృత్యాలు, డప్పుల విన్యాసం, తబలా వాయిద్యం, కూచిపూడి నృత్యం, భరతనాట్యం, కథక్, భాంగ్రా, బిహు నృత్యం, హాస్యవల్లరి వంటి ఎన్నో వినోద కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. తెలుగు ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీల్లో పిల్లలు-పెద్దలు పోటీలు పడి పాల్గొన్నారు. అనంతరం పొంగలి తయారు చేసి ఆహుతులకు పంచారు. రంగవల్లుల్లో గొబ్బెమ్మలను పెట్టి మహిళలంతా వాటి చుట్టూ తిరుగుతూ గంగిరెద్దులకు పూజలు చేశారు. ఢిల్లీ తెలుగు అకాడమీ తరఫున హాజరైన జూనియర్ ఉదయ శంకర్ ప్రదర్శించిన తబలా వాయిద్యం, మీనాక్షి తివారి పాఠక్ చేసిన కథక్ నృత్యం తెలుగు ప్రజలను ఎంతగానో అలరించాయి. విశాఖపట్నంనకు చెందిన కుమార్ బృందం నిర్వహించిన కూచిపూడి నాట్యం అదిలీలా ఫౌండేషన్‌కు చెందిన మేడం రీనా ప్రదర్శించిన భాంగ్రా నృత్యం, కృష్ణా జిల్లాకు చెందిన ఉదయ కుమార్ ఆలపించిన జానపద గేయాలు ఆకట్టుకున్నాయి. చివరగా 9 గంటల ప్రాంతంలో వేసిన భోగిమంటల్లో తెలుగు వారంతా ఉత్సాహంగా పాల్గొని గీతాలు ఆలపించారు. కనుమరుగైపోతున్న కళారూపాలక ు ఈ వేడుకల్లో అగ్ర స్థానం దక్కింది. తెలుగు రాష్ట్రాల నలుమూలల్లో ఉన్న డప్పు వాయిద్యగాళ్లు, జానపద కళాకారులు, పగటి వేషగాళ్లను ఏరికోరి తెచ్చి వారి కళను వందల, వేల మంది పరిచయం చేశారు ఆంధ్రప్రదేశ్ భవన్ అధికారులు. పల్లెటూళ్లలో కూడా కనిపించని ఈ కళలను మహానగరంలో కళాకారులు సగర్వంగా ప్రదర్శించారు.

పే...ద్ద ముగ్గు



పెద్దపల్లి జిల్లా గోదావరిఖని సింగరేణి స్టేడియంలో వేసిన సంక్రాంతి ముగ్గు వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌కి ఎక్కింది. 500 మహిళలు దీనిని మూడు గంటల్లో పూర్తిచేశారు. 800 చదరపు అడుగుల విస్తీర్ణంలో 1939 చుక్కలతో వేసిన ఈ సంక్రాంతి ముగ్గు ప్రపంచంలోనే అతిపెద్ద ముగ్గుగా నిలిచింది.

బోసిపోయిన నగరం

- సొంతూళ్లకు చేరిన పట్టణ జనం
- పల్లెల్లోనే సంక్రాంతి సంబరాల జోరు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : నగరం బోసిపోయింది. సంక్రాంతి సంబరాల కోసం పట్టణ వాసులంతా పల్లె బాట పట్టారు. హైదరాబద్‌లో జనం లేకపోవడంతో నిరంతరం రద్దీగా ఉంటే అనేక ప్రాంతాలు బోసి పోయి కనిపిస్తున్నాయి. వాహనాల రణగొణ ధ్వనులు వినిపించడం లేదు. వివిధ ప్రాంతాల నుండి వచ్చి నగరంలో స్థిరపడ్డవారే హైదరాబాద్‌లో అధికం. నగరంలో స్థిరపడ్డప్పటికీ ముఖ్యమైన పండుగలను సొంతూళ్లో జరుపుకోవడం ఆనవాయితీగా మారింది. యాంత్రిక జీవనం నుండి కొంత సేద తీరేందుకు, తమ వారిని కలుసుకొనేందుకు పండుగలు దోహదపడుతున్నాయి. తమ వారితో సొంతూళ్లో పండుగలు జరుపుకోవడంలో ఉన్న ఆనందమే వేరు అంటారు నగర వాసులు. తెలంగాణ జిల్లాల జనం అడపా దడపా సొంతూళ్లకు వెళుతుంటారు, కాని ఆంధ్రప్రదేశ్‌లోని దూర ప్రాంతాల నుండి వచ్చి వివిధ వృత్తుల్లో స్థిరపడ్డవారు మాత్రం పండుగలకే ఎక్కువగా వెళుతుంటారు. అందులో సంక్రాంతి పండుగకు వెళ్లకుంగా ఉండలేరు. సంక్రాంతి సంబరాలు ఆంధ్రప్రదేశ్‌లో ఎంతో ఆనందోత్సవాలతో జరుపుకుంటారు. దేశ విదేశాల్లో స్థిరపడిన వారు కూడా వీలు చూసుకొని సంక్రాంతికి సొంతూళ్లకు చేరుకుంటారు. పల్లె సీమల్లో కొంత సేదతీరుతుంటారు. సంక్రాంతి సందడితో తెలంగాణ, ఆంధ్రలోని పల్లెలన్నీ కోలాహలంగా దర్శనమిస్తున్నాయి. పండుగ సంబరాలు జోరందుకున్నాయి. పిండివంటలు, పతంగులను ఎగరవేయడం, కోడి పందేలతో జనమంతా సందడిగా గడుపుతున్నారు. బోసి పోయిన గ్రామాలకు కొత్త వెలుగులు వచ్చినంత సంబరం వ్యక్తమవుతుంది. ఇటీవలి కాలంలో గ్రామాల్లో నివాసం ఉంటున్న వారి సంఖ్య తగ్గిపోతుంది. ఉపాధి అవకాశాలు లేక అత్యధికులు పట్టణం బాట పడుతున్నారు. సమీపంలోని పట్టణాల్లో ఉపాధి పొందుతున్నారు. వ్యవసాయం, కుల వృత్తులపై ఆధారపడిన వర్గాలు మాత్రమే గ్రామాల్లో నివాసం ఉండే పరిస్థితి నెలకొంది.





పతంగి ఎగిరే.. నింగి మురిసే

- అంగరంగ వైభవంగా వేడుకలు
- నోరూరిస్తున్న స్వీట్లు
- వెల్లువెత్తుతున్న సందర్శకులు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: రంగురంగుల పతంగులు నింగికెగిసి.. ఆకాశాన్ని ముద్దాడుతున్నట్లుగా.. మురిసి పోయాయి. నోరూరించే వేయిరకాల స్వీట్ల ఘుమఘుమలు వావ్ అనిపిస్తున్నాయి. వెరసి ఈ రెండింటినీ చూసేందుకు వచ్చిన సందర్శకులు అటు కైట్స్.. ఇటు స్వీట్స్ చూసి సంభ్రమాశ్చర్యాలకు లోనవుతున్నారు. ఆ భారీతనం చూసి సంతోషం వ్యక్తం చేస్తున్నారు. తొలిసారి సికింద్రాబాద్ పెరేడ్‌గ్రౌండ్స్‌లో నిర్వహిస్తున్న కైట్స్ ఫెస్టివల్‌కు అంచనాలకు మించి సందర్శకులు తరలివస్తుండగా, టూరిజం శాఖాధికారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. విదేశీపర్యాటకులు, వీటిని చూసేందుకు కుటుంబసభ్యులతో, పిల్లలతో వచ్చిన జనులతో సికింద్రాబాద్ కోలాహలంగా మారింది. సోమవారంతో ఈ ఫెస్టివల్ ముగియనుండగా.. తొలిరోజు 50వేలు, ఆదివారం దాదాపు లక్ష మంది పెరేడ్‌గ్రౌండ్ ఫెస్టివల్స్‌ను తిలకించేందుకు వచ్చారని అధికారులు చెబుతున్నారు.

అద్భుతో.. అద్భుతస్యహ..

స్వీట్ ఫెస్టివల్‌లో ప్రదర్శిస్తున్న రుచులు చూసి.. సందర్శకులు అద్భుతో.. అద్భుతస్యహ అంటూ లొట్టలేస్తున్నారు. హైదరాబాద్ నగరంలోని ప్రముఖ స్వీట్ దుకాణాలతో పాటు 25రాష్ట్రాలు, 14దేశాలకు చెందిన స్వీట్లను ఈ ప్రదర్శనలో ఏర్పాటుచేశారు. వెరైటీ స్వీట్లను కొనుగోలు చేసేందుకు ప్రజలు ఉత్సాహం ప్రదర్శిస్తున్నారు. ఫెస్టివల్‌లో మొత్తం 720స్టాళ్ళను ఏర్పాటుచేయగా, 14విదేశీ స్టాల్స్ కూడా ఉన్నాయి. 78రకాల లడ్డూలు, 66రకాల హల్వాలు, 74రకాల పాయ సం, ఖీర్, 269 రకాల డ్రైస్వీట్స్, 60రకాల పాన కాలు, మరో 142 రకాల ద్రవ రూపంలో ఉన్న స్వీట్స్ ప్రదర్శనలో ఉంచారు. మొత్తం 1286మంది మహి ళలు స్వయంగా తమ ఇళ్ళల్లో చేసి విక్రయించేస్వీట్లతో ప్రదర్శనకు వచ్చారు. కర్ణాటక,



కేరళ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిశా, మహారాష్ట్ర, గుజరాత్, పశ్చిమబెంగాల్, గోవా, మధ్యప్రదేశ్, హర్యానా తదితర రాష్ట్రాలకు చెందిన స్వీట్లు ప్రదర్శనకు వచ్చాయి.

విదేశీ ఘుమఘుమలు..

విదేశీ రుచులు కూడా పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తున్నాయి. ఆఫ్ఘనిస్తాన్‌కు చెందిన ఖత్లామా, ఖజోర్, కోలాఖాజీ, బ్రెజిల్‌కు చెందిన చీజ్‌కేక్, పుడియం, కురల్ డి మిహో, బ్రిగాడిరియో, బొలోడిపుదా, పకోక్కా, స్పెయిన్‌కు చెందిన చుర్రోస్, పాన్ డి కలాత్రా, ఇథియోపియా కు చెందిన దాబోకోలా, టర్కీకి చెందిన సెకెకేర్, కల్బుర్బాస్క్ , దక్షిణ కొరియా నుండి మోజాక్వా, యాక్సిక్, గాన్జియోనా, సుజోన్‌గ్వా వంటి పలు వెరైటీలు ప్రదర్శించారు.

జర్మనీ, ఫ్రాన్స్ తదితర దేశాలకు చెందిన స్టాళ్ళు కూడా ఏర్పాటు చేశారు. విభిన్నరకాల స్వీట్ల రుచులు చూసేందుకు హైదరా బాద్‌తో పాటు జిల్లాల నుండి కూడా భారీగా తరలివస్తున్నారు. పర్యాటక శాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశంనేతృత్వంలో తొలిసారి నిర్వహించిన స్వీట్ ఫెస్టివల్ విజయవంతం కాగా, కైట్ ఫెస్టివల్‌కు ఈసారి మునుపెన్నడూలేనంత ఆదరణ కనబడుతోంది.



ఫైల్ ఫొటో

ప్రథమ పౌరులే కీలకం

- కొత్త పంచాయతీరాజ్ చట్టంలో గ్రామ సర్పంచులకు కీలక అధికారాలు, బాధ్యతలు
- రాష్ట్రాభివృద్ధిలో స్థానిక సంస్థల పాత్ర మరింత క్రియాశీలకం
- గ్రామస్థాయిలో అధికారులు, ఉద్యోగుల భాగస్వామ్యం, పర్యవేక్షణకు ప్రత్యేక వ్యవస్థ
- వైఫల్యాలకు గల కారణాలు, బాద్యులపై కఠిన చర్యలు
- పరిపాలనా విధానాలపై సర్పంచ్‌లకు శిక్షణ
- పకడ్బందీగా కొత్త పంచాయతీరాజ్ చట్టం ముసాయిదా
- మార్పులు, చేర్పులు, సవరణలపై మంత్రివర్గ ఉపసంఘం నివేదిక
- కీలక సవరణలకు సీఎం కేసీఆర్ ఆమోదం, డ్రాఫ్టు రూపకల్పనకు దిశానిర్దేశం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాజ్యాంగబద్ధంగా గ్రామానికి ప్రథమ పౌరుడు స్థానిక సర్పంచ్. అభివృద్ధి అంశాలపై కీలక నిర్ణయాల్లో ఆయనదే ప్రధాన భూమిక. వ్యవసాయ రంగ అభివృద్ధికి, కుల వృత్తుల ప్రోత్సాహకానికి అమలు చేస్తున్న కార్యక్రమాల్లో స్థానిక సంస్థలకు మరిన్ని అధికారాలు, బాధ్యతలు అప్పగించాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు సంబంధించి నిర్దిష్టమైన ప్రతిపాదనలతో చట్టాన్ని సవరించేందుకు ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు శ్రీకారం చుట్టారు. గ్రామీణాభివృద్ధి లక్ష్యాల సాధనలో స్థానిక సంస్థలు అత్యంత క్రియాశీలంగా పని చేసేవిధంగా, విధి నిర్వహణలో విఫలమైన వారిపై చర్యలు తీసుకోవడానికి అవకాశం కల్పించే విధంగా కొత్త పంచాయితీరాజ్ చట్టం ముసాయిదాకు రూపొందిస్తున్నారు. త్వరలో ప్రారంభమయ్యే అసెంబ్లీ సమావేశాల్లో ఈ బిల్లుపై చర్చించి ఆమోదం తెలుపనున్నారు.

ఇందుకు సంబంధించి ప్రభుత్వం నియమించిన మంత్రివర్గ ఉపసంఘం గడిచిన గడిచిన పక్షం రోజులుగా విస్తృతస్థాయి సమాలోచనలు జరిపి శనివారం రాత్రి ప్రభుత్వానికి నివేదికను సమర్పించింది. అన్ని కోణాల్లో ఆలోచించి చట్టంలో సవరణలకు సిఫారసులు చేశారు. ఇదే అంశంపై గత ఆరు నెలలుగా ముఖ్యమంత్రి దాదాపు డజను పర్యాయాలు ఉన్నతస్థాయి సమీక్షలు నిర్వహించారు. కొత్త పంచాయితీరాజ్ వ్యవస్థపై అవగాహన, అనుభవం కలిగిన అధికారులు, ప్రజా ప్రతినిధులు, సంస్థల ప్రతినిధుల సలహాలు, సూచనలు తీసుకుని కొత్త చట్టానికి రూపకల్పన చేయాల్సిందిగా సూచించారు. ఈ ఏడాదిలోనే కొత్త చట్టం బిల్లును ప్రవేశపెట్టి, అమల్లోకి తేవాలనేది ప్రభుత్వ ఉద్దేశమని స్పష్టం చేశారు. ఆ మేరకు జూపల్లి కృష్ణారావు నేతృత్వంలోని మంత్రివర్గ ఉపసంఘం కసరత్తు చేసి నివేదిక సిద్ధం చేసింది. కొత్త పంచాయితీరాజ్ చట్టం ఎలా ఉండాలి? ఎలాంటి విధులు స్థానిక సంస్థలకు అప్పగించాలి? ఎలాంటి బాధ్యతలు వారు నిర్వర్తించాలి? వాటికి నిధులు ఎలా సమకూర్చాలి? ప్రజలకు మరింత జవాబుదారీగా, మరింత క్రియాశీలకంగా తమ కార్యకలాపాలు నిర్వహించడానికి ఎలాంటి చర్యలు తీసుకోవాలనే అంశంపై తనకున్న క్షేత్రస్థాయి అనుభవాలను, అభిప్రాయాలను, భవిష్యత్తు ఆలోచన విధానాన్ని జోడించి ముసాయిదా రూపకల్పనకు మార్గదర్శకాలు ఇచ్చారు.

గ్రామ పంచాయతీలకు విశిష్ట బాధ్యతలు

గ్రామ పంచాయతీలకు రాజ్యాంగబద్ధంగా విశిష్ట బాధ్యతలు, అధికారాలు ఉన్నాయని నివేదిక ఇచ్చిన సందర్భంలో ఉపసంఘం సభ్యులతో సీఎం అన్నారు. ''ఏ గ్రామానికి ఆ గ్రామ సర్పంచ్, గ్రామ పంచాయితీ చిత్తశుద్ధితో పనిచేస్తేనే ప్రభుత్వ కార్యక్రమాలు ప్రజలకు చేరుతాయి. ఇప్పుడున్న విధానం కొనసాగితే ప్రయోజనం లేదు. ప్రస్తుతం గ్రామ పంచాయితీలు, స్థానిక సంస్థలు భయంకరమైన ప్రమాదంలో ఉన్నాయి. ఒకప్పుడు కమ్యూనిటీ డవలప్‌మెంట్ ఏజెన్సీలుగా ఉన్న పంచాయితీలు, స్థానిక సంస్థలు రానురాను రాజకీయపరమైపోయాయి. ఈ పరిస్థితిలో సమూలంగా మార్పు రావాలి. గ్రామ పంచాయితీలను మరింత శక్తివంతం చేయాలి. మరింత ప్రభావవంతం చేయాలి. ప్రతీ కార్యక్రమంలో గ్రామ పంచాయితీలను భాగస్వాములను చేయాలి. ఏ గ్రామానికి ఆ గ్రామం మారితేనే యావత్ తెలంగాణ మనం కలలు కంటున్నట్లు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుంది. కాబట్టి గ్రామ పంచాయితీలు ఎలాంటి విధులు నిర్వర్తించాలి? వారికున్న బాధ్యలేంటి అనే విషయంలో పూర్తిస్థాయి స్పష్టనిస్తూ కొత్త చట్టం తయారు కావాలి'' అని అన్నారు. సర్పంచ్‌ల మాదిరిగానే ఎంపీటీసీలు, జడ్పీటీసీలకు కూడా విధులు, బాధ్యతలపై స్పష్టత కొత్త చట్టం తీసుకురావాలని కేసీఆర్ అభిప్రాయపడ్డారు.

వచ్చే బడ్జెట్‌లో గ్రామ పంచాయతీలకు నేరుగా నిధులు

''కేవలం విధులు, బాధ్యతలు అప్పగించి దులుపుకుంటే గ్రామ పంచాయితీలు ఏ పనీ చేయలేవు. వాటికి కావాల్సిన నిధులు కూడా అందించాలి. వచ్చే బడ్జెట్‌లో నేరుగా గ్రామ పంచాయితీలకు జనాభా ఆధారంగా నిధులు కేటాయిస్తాం. ఒక్కో గ్రామ పంచాయితీకి రూ.10 లక్షల నుంచి రూ.25 లక్షల వరకు నిధులు సమకూరుస్తాం. కేంద్ర నిధులు, కార్పొరేట్ రెస్పాన్సిబిలిటీ కింద లభ్యమయ్యే డబ్బులు, ఫైనాన్స్ కమీషన్ ద్వారా వచ్చే నిధులు, జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా సమకూరే డబ్బులు అన్నీ జమచేసి గ్రామ పంచాయితీ అప్పగించాలి. గ్రామస్తుల్లో కూడా శ్రమదానం ద్వారా పనులు చేసుకునే ధోరణిని అలవాటు చేయాలి. గ్రామ పంచాయితీకి విధులు, బాధ్యతలతో పాటు కావాల్సిన నిధులు, ప్రజల భాగస్వామ్యం, నిరంతర పర్యవేక్షణ ఉంటే సమర్థవంతంగా పనిచేయాలి. అన్ని విధాలా సహకారం అందించినా సరే, నిధుల నిర్వహణలో వైఫల్యం చెందినచోట క్రమశిక్షణ చర్యలు తీసుకునే వెసులుబాటు ప్రభుత్వానికి ఉండాలి''. వీటన్నింటికీ అవకాశం కల్పించే విధంగా కొత్త పంచాయితీరాజ్ చట్టం తయారు కావాలని సీఎం చెప్పుకొచ్చారు.

గడువు లోపే గ్రామ పంచాయతీ ఎన్నికలు

''వచ్చే ఏడాది నిర్ణీత కాల పరిమితి ప్రకారం పంచాయితీలకు ఎన్నికలు జరుగుతాయి. ఎన్నికలు పూర్తవగానే సర్పంచ్‌లకు పూర్తిస్థాయిలో శిక్షణా కార్యక్రమం ఏర్పాటు చేయాలి. విధులు, అధికారాలు, బాధ్యతలు, నిధులపై స్పష్టత ఇవ్వాలి. ఎవరి గ్రామ అభివృద్ధి ప్రణాళికలను వారు తయారు చేసుకునే విధంగా తర్ఫీదు ఇవ్వాలి. ఆ గ్రామానికున్న అవసరమేంటి? భవిష్యత్తులో వారికి ఇంకా ఏది అవసరమవుతుంది తదితర విషయాలను బేరీజు వేసుకుని అభివృద్ధి ప్రణాళిక రూపొందించుకోవాలి. దానికి అనుగుణంగా కార్యాచరణ ఉండాలి. ఈ దృక్పథంతో సర్పంచ్‌లు పనిచేసేలా వారికి తగిన శిక్షణ ఇవ్వాలి. సర్పంచ్‌లుగా ఎన్నికైన వారిలో చాలామందికి సహజంగా మంచిపేరు తెచ్చుకోవాలనే తపన ఉంటుంది. అందుకే వారు మంచి పనులు చేసే అవకాశం కల్పించే విధంగా ప్రభుత్వ విధానం ఉండాలి''. ఎవరో ఏదో అంటారని కాకుండా, ఎవరికి వారు స్వీయ క్రమశిక్షణతో ప్రజలతో అనుసంధానమై పనిచేసే అద్భుత ఫలితాలు వస్తాయని సీఎం కేసీఆర్ అభిప్రాయపడ్డారు.

ఏపీని దేశంలో అగ్రగామిగా తీర్చిదిద్దుతా

- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- కుటుంబ సభ్యులతో శ్రీవారి దర్శనం

తిరుమల , ప్రభ న్యూస్: నూతన రాజధాని అమరావతి నిర్మాణం, పోలవరం ప్రాజెక్టు, నదుల అనుసంధానం పూర్తి చేస్తామని, యువతకు ఉపాధి, ప్రజలకు మెరుగైన సదుపాయాలు కల్పించి ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అగ్రగామిగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. రాష్ట్రాన్ని అభివృద్ధిపథంలో నడిపించేందుకు తన కు శక్తినివ్వాలని శ్రీవారిని ప్రార్థించినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి తన కుటుంబ సభ్యులతో కలసి ఆదివారం ఉదయం తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయం వెలుపల ముఖ్యమంత్రి విలేకరులతో మాట్లాడుతూ సంక్రాంతి, భోగి పండగ నాడు కుటుంబ సభ్యులతో కలిసి తమ ఇలవేల్పు అయిన శ్రీవారిని దర్శించుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న భక్తులు శ్రీవారిని దర్శించుకోవడం ఆనవాయితీ అని, అత్యంత శక్తివంతమైన దేవుడు శ్రీ వేంకటేశ్వరస్వామివారని పేర్కొన్నారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ప్రజలకు ఆనందం, సుఖ సంతోషాలు, మెరుగైన జీవన ప్రమాణాలు ప్రసాధించాలని కోరుకున్నట్లు చెప్పారు. అనంతరం భక్తులందరికి సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. ముందుగా వైకుంఠం క్యూ కాంప్లెక్సు ద్వారా కుటుంబ సభ్యులతో కలసి ముఖ్యమంత్రి ఆలయంలోకి ప్రవేశించారు. మహాద్వారం వద్దకు చేరుకోగానే పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్‌స్వామి, టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, జేఈఉలు శ్రీనివాసరాజు, పోలా భాస్కర్, ఇతర అర్చకులు కలసి సంప్రదాయ బద్ధంగా ఇస్తికఫాల్ స్వాగతం పలికారు. ధ్వజస్తంభం వద్ద నమస్క రించిన అనంతరం ఆలయంలో స్వామివారిని దర్శించు కున్నారు. ఆలయ ప్రదక్షిణగా వచ్చి విమాన వేంకటేశ్వరస్వామి, సబేర, భాష్యకార్ల సన్నిధి, యోగనరసింహస్వామివారిని దర్శించుకుని హుండీ లో కానుకలు సమర్పించారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. ఈ సందర్భంగా టీటీడీ ఈవో అనిల్‌కుమార్‌సింఘాల్, జేఈవో శ్రీనివాసరాజు, పోలా భాస్కర్ లు కలసి ముఖ్యమంత్రికి, వారి కుటుంబ సభ్యులకు శ్రీవారి తీర్థ ప్రసాదాలు, చిత్రపటం, టీటీడీ డైరీలను అందిం చారు. దర్శనం అనంతరం నేరుగా తిరుమలలోని శ్రీ పద్మావతి అతిథి గృహానికి చేరుకున్నారు. క్యాటరింగ్ అధికారులు ఏర్పాటు చేసిన అల్పాహారం స్వీకరించి తిరుపతికి బయలుదేరి వెళ్ళారు.



ముడుచుకునే పైకప్పును ముఖ్యమంత్రికి చూపిన ఈవో

శ్రీవారి ఆలయంలో ధ్వజస్తంభం నుంచి పడికావలి వరకు ఏర్పాటు చేసిన ముడుచుకునే పైకప్పును ముఖ్య మంత్రికి ఈవో అనిల్‌కుమార్‌సింఘాల్ చూపించారు. ఎండ కు, వర్షానికి భక్తులు ఇబ్బందులు పడకుండా ఈ మేరకు ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. అదేవిధంగా భక్తులకు అందిస్తున్న సౌకర్యాలు, చేపట్టనున్న అభివృద్ధి కార్యక్రమాలను ముఖ్య మంత్రికి వివరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి నారా లోకేష్, హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ, జిల్లా కలెక్టర్ ప్రద్యుమ్న, డీఐజీ ప్రభాకర్‌రావు, అర్బన్ ఎస్పీ అభిషేక్ మహంతి, శ్రీవారి ఆలయ డిప్యూటీ ఈవో కోదండరామారావు, వీఎస్‌ఓ రవీంద్రారెడ్డి ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయం వెలుపలకు వచ్చిన ప్రముఖ సినీ నటుడు, ఎమ్మెల్యే బాలకృష్ణను చూసి అభిమానులు, భక్తులు జై జయసింహా అని పెద్దగా నినాదాలు చేశారు. స్పందించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తిరుమలలో గోవింద నామాలు తప్ప ఇతరవేవి వినపించకూడదని వారికి సూచించారు.

30 అడుగుల మేర హిమపాతం



• రద్దైన విమాన, రైల్వే సర్వీసులు

సాదాసీదాగా చలికాలంలో కురిసే మంచు (హిమపాతం)కు మన శరీరాలు ఒక్కసారిగా గడ్డకట్టుకుపోయేంత ప్రమాదం కలుగుతుంది. అలాంటిది ఏకంగా ఆ నగరంలో ఏకంగా 30 అడుగుల ఎత్తుకు పేరుకుపోయింది హిమ(మంచు)పాతం. ఇది ఫ్రెంచ్ దేశంలోని పశ్చిమ ప్రాంతంలోని ఎలెవెంచ్ నగరంలో చోటుచేసుకుంది. గత నాలుగు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న మంచు రోజురోజుకు పెరిగి 30 అడుగుల మేర పేరుకుపోయింది. ఇంత మంచు కురవడం చరిత్రలో మొదటిసారి. రోడ్లపై 30 అడుగుల మేర పేరుకుపోయిన మంచును తొలగించేందుకు బుల్డోజర్లు రంగంలోకి దింపారు. ఎలెవెంచ్ నగరంలో ప్రధాన రహదారులు పూర్తిగా కనుమరుగయ్యాయి. దీంతో ప్రధాన రహదారులు మూసుకుపోయాయి. గత 36 గంటలుగా శ్రమిస్తున్నా పర్వతాల్లా పేరుకుపోయిన మంచును తొలగించడం సాధ్యం కావడంలేదు. దీంతో కనీసం ఒక్కోవాహనం ప్రయాణించేలా దారులను ఏర్పాటు చేస్తున్నారు అధికారులు. ఈ మంచు ప్రమాదంలో ఓ బ్రిటీష్ కు చెందిన 39 సంవత్సరాల యువకుడు చిక్కుకున్నట్టు పోలీసు అధికారి ఆల్బర్ట్ విల్లే తెలిపారు. హిమపాతం వల్ల ప్రజా రవాణా వ్యవస్థ స్తంభించిపోయింది. పశ్చిమంనుంచి స్విట్జర్లాండ్ వెల్లే రహదారి రద్దయింది. రైల్వేసర్వీసులతోపాలు, దాదాపు వెయ్యి విమానసర్వీసులను పూర్తిగా నిలిపివేశారు. దీంతో ఎయిర్‌పోర్టుకే విమానాలు పరిమితమయ్యాయి. అధికంగా మంచు ఉన్న పరిసర గ్రామాల్లోని ప్రజలను అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలించారు. అంతేగాకుండా ఎలెవెంచ్ నగరంతోపాటు గ్రామాల్లో ప్రమాదహెచ్చరికలు జారీ చేశారు.

కాలుష్య యుద్ధంలో బీజింగ్ విజయం

బీజింగ్: కాలుష్య నియంత్రణకు చైనా తీసుకున్న చర్యలు రాజధాని బీజింగ్ లో మంచి ఫలితాలనిచ్చినప్పటికీ.. ఇతర ప్రాంతాల్లో మాత్రం విఫలమయ్యాయి. గతేడాది చైనా రాజధానిలోని కాలుష్యం ప్రజలను ఊపిరి కూడా పీల్చుకోనివ్వలేదు. దాంతో ప్రభుత్వం కాలుష్య నియంత్రణ చర్యలను ముమ్మరం చేసింది. ఏడాది కాలంలో రాజధానిలో గతంలోని పరిస్థితులు కనుమరుగయ్యాయి. బీజింగ్ లో ప్రస్తుతం ప్రమాదకరమైన పొగమంచు కురిసే పరిస్థితులు లేవు. ఈనెల గ్రీన్ పీస్ ఈస్ట్ ఏసియా నిర్వహించిన పరీక్షల్లో బీజింగ్ పొగమంచు ప్రమాదం నుంచి బయటపడిందని ప్రకటించింది. గాలిలో పొగమంచు శాతం గణనీయంగా తగ్గిపోయి వాతావరణంలో కాలుష్యం చాలావరకు తగ్గిందని ప్రకటించింది.అయితే రాజధాని చుట్టుపక్కల ప్రాంతాలు, దేశంలోని ఇతర ప్రాంతాల్లో మాత్రం కాలుష్యానికిమూల్యం చెల్లించుకుంటూనే ఉన్నాయి. గాలి కాలుష్యంపై యుద్ధంప్రకటించిన చైనా కొన్నేళ్లుగా చర్యలను ముమ్మరం చేసింది. ఇందుకోసం ఎక్కువ కాలుష్యాన్నివెదజల్లే ఫ్యాక్టరీలను మూసివేయించింది. వేలాది కంపెనీల మూసివేతతో లక్షలాది మంది ఉపాధి కోల్పోగా వారికి ప్రత్యామ్నాయమార్గాలను కూడా చూపించింది. 2014లో కాలుష్యాన్ని గుర్తుచేస్తూ బీజింగ్ మేయర్ ఇది తమకు జీవన్మరణ సమస్యకు అభివర్ణించారు. కాలుష్యాన్ని పీఎం 2.5 కు తగ్గించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ప్రకటించారు. అయితే వారి టార్గెట్ 2016 నాటికి కొంతవరకు ఫలించినా ఇంకా పొగమంచు ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తూనే ఉంది. దీంతో మాస్కులు లేకుండా జనం భయటకు వచ్చేందుకు జంకేవారు. ప్రభుత్వం చర్యల వల్లే 2014లో ప్రతీ 100 మైక్రోగ్రామ్ పర్ క్యూబిక మీటర్ కు 88.2 శాతం క్యూబిక్ మీటర్ గా ఉన్న కాలుష్యం 2017 నాటికి 57.3 శాతానికి పడిపోయింది.



పండగ పూట పైసల తిప్పలు

• ఖాళీ డబ్బాలుగా ఏటీఎంలు • బ్యాంకులకు వరుస సెలవులు • అక్కడక్కడా పనిచేసినా అన్నీ పెద్దనోట్లే • రూ.500 మించిన వస్తువులు కొంటేనే రూ.2వేల నోటుకు చిల్లర • డెబిట్, క్రెడిట్ కార్డులతో షాపింగ్ చేస్తే 2 శాతం చార్జీ.. • గ్రామాల్లో పరిస్థితి మరీ దారుణం • బ్యాంకు ఖాతాల్లో డబ్బులున్నా అవసరాలు తీర్చుకోలేని దుస్థితి • ప్రయాణాల్లో చిల్లర లేక తంటాలు, తగాదాలు



హైదరాబాద్, ఆంధ్రప్రభ : పండగ పూట తెలుగు రాష్ట్రాల ప్రజలు కొత్త చిక్కులను ఎదుర్కొంటున్నారు. నగరాలు, పట్టణ ప్రాంతాల్లో ఏటీఎం యంత్రాలన్నీ ఖాళీ డబ్బాలుగా మారాయి. ఇక గ్రామీణ ప్రాంతాల్లోనైతే పరిస్థితి మరీ దారుణంగా కనిపిస్తోంది. గత వారం రోజులుగా ఏటీఎంలన్నీ మూతపడ్డాయి. బ్యాంకులకు వరుసగా సెలవులు రావడంతో ఖాతాల్లో డబ్బులున్నా కనీస అవసరాలు తీర్చుకోలేని దుస్థితి నెలకొంది. పట్టణ ప్రాంతాల్లో గత్యంతరం లేక డెబిట్, క్రెడిట్ కార్డులతో షాపింగ్ మాళ్ళకు క్యూ కట్టాల్సి వస్తోంది. కారణం ఏమిటో తెలియదు కానీ, 90శాతం ఏటీఎంలు మూత పడ్డాయి. అక్కడక్కడ బ్యాంకులకు అనుబంధంగా ఉన్న ఏటీఎంలలో డబ్బులు ఉన్నప్పటికీ రెండువేల నోట్లే ఎక్కువగా బయటకు వస్తున్నాయి. దేశంలో డీమాని టైజేషన్ ప్రక్రియ పూర్తయి సుమారు రెండున్నరేళ్ళ కాలం గడిచినా నేటికీ పెద్దనోటు సమస్య నుంచి ప్రజలు పూర్తిగా బయటపడలేదు. రెండు వేల రూపాయల నోటుకు చిల్లర దొరకక వీధుల వెంబడి తిరుగుతున్న ఘటనలు రోజూ వేల సంఖ్యలో దర్శనమిస్తున్నాయి.

పెద్దనోట్ల రద్దు తర్వాత మార్కెట్లో వంద నోట్లు దాదాపు యాభైశాతం కనిపించకుండా పోయాయి. అందుకు కారణం ఏమైనప్పటికీ పేద, మధ్య తరగతి వర్గాలు తీవ్ర అవస్థల పాలవుతున్నారు. చిరు వ్యాపా రులకు గిరాకీ పూర్తిగా దెబ్బతిని పూట గడవని పరిస్థితులు నెలకొంటున్నాయి. కిరాణా కొట్లు, రైతు బజార్లు, మెడికల్ షాపులు, హోటళ్ళు, మాంసం దుకాణాలు ఒక్కటేమిటి ఎక్కడ చూసినా చిల్లర సమస్యలతో సతమతమవుతూనే ఉన్నారు. ఈ సమస్యను అదునుగా చేసుకుంటున్న కొందరు వ్యాపారులు రూ.500 విలువైన వస్తువులు కొంటేనే రూ.2వేల నోటుకు చిల్లర ఇస్తామంటున్నారు. కనీసం రెండు వందలు ఖర్చు చేస్తే తప్ప రూ.500 నోటు మార్కెట్లో చెల్లుబాటు కావడంలేదు. అదికాడా అక్కడక్కడ అరుదుగా జరుగుతున్న సంఘటనలు మాత్రమే. ఉభయ రాష్ట్రాల్లో నగదు సమ కూర్చు కోవ డం,

పట్టణాలు, నగరాల్లో అయితే పర్వాలేదు కానీ, గ్రామీణ ప్రాంతాల్లో నగదు రహిత సేవలు ఇంకా పరిచయమే కాలేదు. అవంటే ఏమిటో కూడా తొంభై శాతం ప్రజలకు తెలియదు. ఒకప్పుడు ఎలాంటి నోట్లకైనా చిల్లర ఇచ్చే బ్యాంకుల్లో ఆర్బీఐ నిబంధనలు కఠినతరం చేయడం తో చేతులెత్తేస్తున్నారు. ఖాతాదారులకు తప్ప అవసరమైన నోట్లు ఇవ్వడం లేదు. అదికూడా ఇచ్చిన ప్రతి నోటుకు లెక్క చెప్పాల్సి

నగదు రహిత సేవలు అసాధ్యం

వస్తుందని చిన్ననోట్లు తక్కువగా, పెద్దనోట్లు ఎక్కు వగా ఇస్తున్నారు. ఉదాహరణకు బ్యాంకులో రూ.10 వేలు విత్‌డ్రా చేస్తే, నాలుగు రూ.2వేల నోట్లు, మూడు రూ. 500 నోట్లు, కొసరుగా ఐదు వంద నోట్లు ఇస్తున్నారు. దాదాపు అన్ని జాతీయ, గ్రామీణ, వాణిజ్య బ్యాంకుల్లోనూ ఉద్యో గులు ఇదే సాంప్రదాయాన్ని పాటిస్తు న్నారు. ఇక ప్రైవేటు బ్యాంకుల్లో బడా వ్యాపారులకు తప్ప చిల్లర దొరకని పరిస్థితి నెలకొంది.

నగదు లేక ఏజెన్సీలు అయోమయం

ఏ ఏటీఎం సెంటర్‌కు వెళ్ళినా రెండు వేల నోట్లు తప్ప మిగతా నోట్లేవీ కనిపించడం లేదు. అదేమని అడిగితే ఆ వ్యవహారమంతా ఆర్బీఐ అనుమతి పొందిన ఏజెన్సీలు చూస్తాయని అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో పేద కుటుంబాల ఆర్థిక ప్రయోజనాలు పూర్తిగా దెబ్బతింటున్నాయి. ముఖ్యంగా పెట్టుబడి కోసం అప్పులు తెచ్చుకున్న రైతులు ఏ వస్తువు కొనాలన్నా చిల్లర సమస్యతోనే సతమతమవుతున్నారు. చిల్లర కొరతతో గిరాకీలు పూర్తిగా దెబ్బతిని చిరు వ్యాపారులకు పూట గడవడం కష్టతరంగా మారుతోంది. ఆటో డ్రైవర్లు, క్యాబ్‌లు, ఆర్టీసీ బస్సుల్లోనూ చిల్లర సమస్యలతో ప్రతిరోజూ గందరగోళ పరిస్థితులు తలెత్తుతున్నాయి. కొన్ని సందర్భాల్లో పరిస్థితులు ఘర్షణలు, గొడవలకు దారితీస్తున్నాయి.

పెద్ద నోట్ల మార్పిడి సమస్య తీవ్రత నానాటికీ పెరుగుతోంది. పెద్ద వ్యాపారాలు, షాపింగ్ మాల్స్‌లలో నగదు రహిత సేవలు అందుబాటులో ఉండడంతో పై స్థాయిలో సమస్యలు నామమాత్రంగానే కనిపిస్తున్నాయి.

రైతన్నలకు నిత్యం తప్పని తిప్పలు

ఈ ఏడాది కాలం కలిసొచ్చి పంట దిగుబడులు కాస్త ఆశాజనకంగానే నేటికీ పీడిస్తున్న చిల్లర సమస్య నుంచి తేరుకోలేకపోతున్నామని రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం కల్పించుకుని పంటల సాగుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తే తప్ప పరిస్థితులు కుదుట పడే అవకాశాలు లేవంటున్నారు. రాజధాని నగరం హైదరాబాద్ చుట్టూ ఉన్న రంగారెడ్డి, మేడ్చల్, మెదక్, వికారాబాద్ జిల్లాల్లో ఎక్కువ మంది రైతులు కూరగాయ పంటలను సాగుచేస్తారు. పెద్దనోట్ల రద్దు అనంతరం చిల్లర దొరకక వ్యాపారాల్లో అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. అదే సమయంలో ధరలు సగానికి పడిపోతున్నాయి.దీంతో రవాణా ఛార్జీలు కూడా మిగలడం లేదని ఈ జిల్లాలకు చెందిన రైతులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. మేడ్చల్ జిల్లాలో పెద్దఎత్తున విస్తరించి ఉన్న ద్రాక్షతోటల యజమానులు కూడా సమస్యల వలయంలో చిక్కుకున్నారు.

లబోదిబోమంటున్న చిరు వ్యాపారులు

రైతుల పరిస్థితి ఇలా ఉంటే వ్యవసాయోత్ప త్తులను, కూరగాయలను అమ్ముకునే చిరు వ్యాపారులు కూడా ఇంతకు మించిన సమస్యలను ఎదుర్కొంటు న్నారు. చిల్లర లేక, వ్యాపారాలు లేక పొట్ట గడవడం గగనమైపోయిందని లబోదిబోమంటున్నారు. వ్యవసాయ అనుబంధంగా ఉన్న అన్ని రంగాల్లోనూ ఇదే పరిస్థితి వెంటాడుతోంది. పాడి రైతులు, కోళ్ళ పరిశ్రమ రైతులు కూడా నగదు కొరతతో ఇబ్బందులకు గురవుతున్నారు.

కష్టపడి పండించిన ఉత్పత్తులను అమ్ముకునే ప్రక్రియలోనూ రైతులు ఆందోళన చెందాల్సి వస్తోంది. వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో విక్రయించే ఉత్పత్తుల మొత్తాన్ని ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాల మేరకు రైతుల బ్యాంకు ఖాతాల్లోనే జమ చేయాల్సి ఉంటుంది. దీంతో సమయానికి డబ్బులు చేతికందక, అందినా చిల్లర దొరకక సమస్యలు తప్పడం లేదు.

విదేశీ పర్యటనకు మంత్రి కేటీఆర్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాష్ట్ర ఐటీ, పురపాలకశాఖ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు ఆదివారం ఉదయం విదేశీపర్యటనకు బయలుదేరి వెళ్ళారు. పెట్టుబడుల సమీకరణ, ప్రపంచ ఆర్థికవేదిక సదస్సులో పాల్గొనే పర్యటన నిమిత్తం ఆయన వెళ్ళారు. ఈ సందర్భంగా దక్షిణకొరియా, జపాన్, స్విట్జర్లాండ్ దేశాలకు చెందిన పలువురు పారిశ్రామికసంస్థలతో భేటీ కానున్నారు. ఈనెల 28న తిరిగి రాష్ట్రానికి రానున్నారు.

బీసీ ఉప ప్రణాళికా? అభివృద్ధి నిధా?

• ఆర్థిక శాఖ అధికారుల తర్జన భర్జన

హైదరాబాద్ ,ఆంధ్రప్రభ: ఎస్సీ,ఎస్టీల తరహాలో వెనుకబడినవర్గాలకు ఉప ప్రణాళిక ఏర్పాటు ,బీసీ అభివృద్ధి నిధి ఏర్పాటు రెండింటిలో ఏది ఆమోద యోగ్యమైతే దాన్ని ఏర్పాటు చేసే విషయమై ఆర్థిక శాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. జనాభాలో 51.08 శాతానికి పైగా ఉన్న బీసీలకు కూడా ఎస్సీ,ఎస్టీల మాదిరిగానే ఉప ప్రణాళిక ఏర్పాటు చేయాలని గడచిన కొన్నేళ్లుగా వెనుకబడిన వర్గాలకు చెందిన పలు సంఘాలు ఆందోళనలు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ వర్గాలకు చెందిన ఎమ్మెల్యేలు, నాయకులు ముఖ్యమంత్రి కె చంద్రశేఖరరావును కలిసిన సందర్భంగా సబ్ ప్లాన్ ఏర్పాటుపై వినతిపత్రాలు సమర్పిస్తూ వచ్చారు.ఈ నేపథ్యంలో సబ్ ప్లాన్ ఏర్పాటు సాధ్యాసాధ్యాలపై కసరత్తు చేయాలని సీఎం ఆదేశించిన దరిమిలా 2018 -19 వార్షిక బడ్జెట్ ప్రతిపాదనలు రూపొందిస్తున్న దరిమిలా సబ్‌ప్లాన్ విషయం కూడా ఆర్థిక శాఖాధికారులు పరిశీలిస్తున్నారు. ఇటీవల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్ నేతృత్వంలో జరిగిన ఉన్నత స్థాయి అధికారుల సమావేశంలో కూడా ఇదే విషయం చర్చకు వచ్చింది. జనాభా పరంగా చూస్తే బీసీలు 50 శాతానికి పైగా ఉన్నారు. సబ్ ప్లాన్ నిబంధనల ప్రకారం చూస్తే బడ్జెట్‌లో సగానికి పైగా నిధులు ఈ వర్గాలకే కేటాయించాల్సి వస్తుంది. ఇప్పటికే ఎస్సీ,ఎస్టీలకు ప్రత్యేక అభివృద్ధి నిధి పేర ప్రభుత్వం నిధులు కేటాయిస్తోంది. 2001 జనాభా లెక్కల ప్రకారం ఎస్సీ జనాబా 15.9, ఎస్టీ జనాభా 6.2 శాతం ఉండగా, ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర సర్వేలో ఎస్సీ జనాభా 17.50 శాతం, ఎస్టీ జనాభా 9.91 శాతం, బీసీ జనాభా 51.08 శాతం ఉంది. రాజ్యాంగంలో పొందుపర్చిన విధంగా ఎస్సీ,ఎస్టీ డెవలప్‌మెంట్ ఫండ్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ వర్గాలకు కేంద్ర నిధులు కూడా పుష్కలంగా వచ్చే అవకాశం ఉన్నందున నిధి ఏర్పాటు సులభతరమైంది. బీసీ వర్గాల విషయానికి వస్తే కేంద్ర నిధులు అంతంత మాత్రమే రావడంతో పాటు రాష్ట్ర ప్రభుత్వమే పూర్తిగా కేటాయించాల్సిన అవసరం ఉన్నందున ఏ విధంగా సబ్ ప్లాన్ లేదా అభివృద్ధి నిధిని ఏర్పాటు చేయాలనే విషయమై ఆర్థిక, బీసీ సంక్షేమ శాఖల అధికారులు తర్జన భర్జన చెందుతున్నారు.

2017 -18 వార్షిక బడ్జెట్ రూ.1,49, 646కోట్లు కాగా. బీసీలకు రూ.5,070. 36కోట్లను ప్రభుత్వం ప్రతిపాదించింది. జనాభాలో అత్యధిక శాతం ఉన్న ఈ వర్గాలకు ఈ బడ్జెట్‌లో కూడా పెద్దపీట వేసేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది. నిధి రూపంలో కేటాయిస్తే ప్రస్తుత అంచనాల ప్రకారం అన్ని పద్దులను కలిపి ఒకే నిధిగా ప్రభుత్వం ప్రకటించే అవకాశం లేకపోలేదని అధికారులు చెబుతున్నారు. వచ్చే బడ్జెట్ రూ. 1,72,000 కోట్లు ఉంటుందని అంచనా వేస్తున్న నేపథ్యంలో బీసీలకు ప్రగతి పద్దులో దాదాపు రూ. 25 వేల కోట్లు కేటాయించే అవకాశం ఉందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

రైతుకు బాసటగా పెట్టుబడి మద్దతు..!

(మొదటిపేజీ తరువాయి)

ద్వారా ఇంటింటికీ తిరిగి నిర్దేశిత మొత్తానికి చెక్కులను పంపిణీ చేయా లని ప్రభుత్వానికి సూచించారు. ఈ పథకం అమలుకు ఏకకాలంలో ఐదున్నర వేల కోట్ల రూపాయలు అమసరమవుతున్నందున కేంద్ర ఆర్థిక మంత్రితో చర్చించి నిధుల సమకూర్పుపై ఒప్పించాలని నివేదికలో పేర్కొన్నారు.

ఈ అంశాలన్నింటినీ పరిశీలించిన సీఎం కేసీఆర్ ఉపసంఘం చేసిన ప్రతిపాదనలన్నింటీ ఆమోదిస్తూ ఆదివారం సంతకం చేశారు. వారంలోగా పెట్టుబడి మద్ధతు పథకం అమలుకు మార్గదర్శకాలు వెలువడనున్నాయి. నిధుల సమకూర్పుకు సంబంధించి కేంద్ర ఆర్థిక మంత్రి, ఆర్బీఐ గవర్నర్‌లను కలిసేందుకు ముఖ్యమంత్రి నేతృత్వంలో మంత్రివర్గ ఉపసంఘం సభ్యులు త్వరలోనే ఢిల్లీ వెళ్ళాలని నిర్ణయించారు. పెట్టుబడి మద్దతు పథకంలో మెజారిటీ రైతుల అభిప్రాయం మేరకే తుది నిర్ణయం తీసుకున్నట్లు మంత్రివర్గ ఉపసంఘం అభిప్రాయపడింది. ప్రతిష్టాత్మకమైన ఈ పథకం అమల్లో ఎదురవుతున్న చిక్కులు, సాంకేతికపరమైన అంశాలు, పరిష్కార మార్గాలపై వివిధ శాఖల ముఖ్య కార్యదర్శులు, రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ అధికారులతో సమాలోచనలు జరిపిన మంత్రులు అన్ని అంశాలను సీఎంకు సమర్పించిన నివేదికలో పొందుపరిచారు.

నగదు పంపిణీకి నిబంధనలు అడ్డు

మొదట్లో రైతుల వెసులుబాటును దృష్టిలో పెట్టుకుని నగదు రూపంలోనే పెట్టుబడి మొత్తాన్ని పంపిణీ చేయాలని నిర్ణయించినప్పటికీ అది సాధ్యం కాదని ఉపసంఘం తేల్చింది. ఆధార్‌కార్డుల అనుసంధానంతో కూడిన బయోమెట్రిక్ విధానంలో నగదు పంపిణీకి ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలనుకున్నప్పటికీ విస్తృతస్థాయి సంప్రదింపులతో చెక్కులే మేలని నిర్ణయించారు. గత ఏడాది కేంద్ర ఆర్థిక శాఖ జారీ చేసిన మార్గదర్శకాలు అడ్డొస్తున్నాయి. అలాగే ఆన్‌లైన్ విధానం ద్వారా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోకి నేరుగా నగదు బదిలీ చేయడం ద్వారా కూడా అవకతవకలు లేకుండా పథకాన్ని అమలు చేయవచ్చునని అనుకున్నప్పటికీ, ఆ మొత్తం పాత బకాయిల కింద జమ అవుతుందని బ్యాంకర్ల కమిటీ స్పష్టం చేసింది. ఈ ఏడాది కొత్తగా ఏర్పాటు చేసిన గ్రామ రైతు సమన్వయ సమితిల ద్వారా అబ్ధిదారులకు చెక్కుల పంపిణీ చేసినా లక్ష్యం చేరుకోవచ్చునని సబ్‌కమిటీ యోచించినప్పటికీ రాజకీయ దుమారం తప్పదని గుర్తించింది. ఈ మూడు పద్ధతుల్లో చిక్కులు ఎదురవుతున్నందున ప్రత్యామ్నాయంగా బేరర్ చెక్కులు పంపిణీ చేయాలని మంత్రులు నిర్ణయించారు.

నిధుల వంతు కేంద్రం చెంతకు...

తెలంగాణ ప్రభుత్వం తలపెట్టిన 'పెట్టుబడి మద్ధతు పథకం' అమల్లో తలెత్తిన చిక్కుముడి రాష్ట్రం పరిధి దాటిపోయింది. ప్రతిపాదిత మొత్తాన్ని రైతులకు నగదు రూపంలో చెల్లించేందుకు ఆర్థిక నిబంధనలు అడ్డొస్తున్నం దున కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపాలని మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయించింది. అదే సమయంలో సుమారు రూ.5.5వేల కోట్లకు పైగా ఏకకాలంలో కరెన్సీ అవసరమవుతోంది. ఇందుకు సంబంధించి కూడా ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ, ఆర్బీఐ గవర్నర్ ఉజ్జిత్ పటేల్‌లను కలిసి నిధుల సర్దుబాటును కోరనున్నారు. ఈ పథకం లక్ష్యాలు, ఫలితాలపై నివేదిక సమర్పించనున్నారు. రాష్ట్రంలో మొత్తం 71.75 లక్షల రైతు ఖాతాలకు సంబంధించిన ఈ అంశంపై లోతుగా అధ్యయనం చేశారు. 1.42 కోట్ల ఎకరాల వ్యవసాయ భూమికి రూ.4వేల చొప్పున చెల్లిస్తారు.

ఆదర్శవంతంగా పథకం అమలు

వ్యవసాయమే ప్రధాన జీవనాధారంగా ఉన్న రాష్ట్రాలను ఆలోచింపజేసే విధంగా తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం రాష్ట్ర ప్రజల్లో చెరగని ముద్ర వేసుకుంటోంది. సంక్షోభంలో చిక్కుకున్న వ్యవసాయ రంగాన్ని గట్టెక్కించేందుకు ఇటీవల సీఎం కేసీఆర్ ప్రకటించిన ఎకరాకు రూ.8వేల "పెట్టుబడి" పథకం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమవుతోంది. ఇలాంటి పరిస్థితులనే ఎదుర్కొంటున్న పొరుగు రాష్ట్రాలు ఈ చారిత్రాత్మక పథకంపై దృష్టి కేంద్రీకరించాయి. త్వరలో అధ్యయనానికి తెలంగాణాలో పర్యటిం చేందుకు సిద్ధమవుతున్నాయి. సాంకేతికంగా, వ్యాపార పరంగా అభివృద్ధిలో అగ్రస్థానంలో ఉన్న గుజరాత్ రాష్ట్రం సైతం ఇక్కడ ప్రకటించిన పెట్టుబడి పథకంపై అధికార వర్గాలతో వాకబు చేసింది. అలాగే ఉత్తర్‌ప్రదేశ్, కర్నాటక, మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన వ్యవసాయశాఖ ఉన్నతాధి కారులు ఇప్పటికేపెట్టుబడి పథకం లక్ష్యాలపై సమాచారం తెప్పించుకున్నట్లు తెలుస్తోంది. తెలంగాణాలో ఉన్న వ్యవసాయ పరిస్థితులు, రైతుల ఆర్థిక స్థితి గతులు, అమలవుతున్న సంక్షేమ పథకాలు, వాటి ద్వారా సాధిస్తున్న ఫలి తాలు, రైతుల్లో



ఉన్న అభిప్రాయాలపై కేంద్ర ప్రభుత్వం కూడా దృష్టి సారిం చింది. ఇటీవల రాష్ట్రానికి వచ్చిన కేంద్ర వ్యవసాయ మంత్రిత్వశాఖ అదనపు కార్యదర్శి ద్వారా ఇక్కడి పరిస్థితులపై నివేదిక తెప్పించుకున్నట్లు సమాచారం.

కార్యరూపంలోకి కేసీఆర్ ఆలోచన

ఉమ్మడి రాష్ట్రంలో అనేక ఒడిదుడుకులు, నిరాదరణ, కష్టనష్టాల మధ్య కొనసాగిన వ్యవసాయ రంగాన్ని తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఆవిర్భవించాక గట్టెక్కించేందుకు కేసీఆర్ చేస్తున్న ప్రయత్నాలు ఒక్కొక్కటి వెలుగులోకి వస్తున్నాయి. తెలంగాణ సాధన ఉద్యమ నేపథ్యంలో ఆయన మదిలో ఉన్న ఆలోచనలు పరిస్థితులకు అనుగుణంగా అమలుకు నోచుకుంటున్నాయి. వ్యవ సాయం ఇక గిట్టుబాటు కాదేమోనన్న భయాందోళన పెరుగుతున్న అన్న దాత ల్లో భవిష్యత్తుపై భరోసా కల్పిస్తూ తెలంగాణ ప్రభుత్వం తాజాగా తీసు కున్న నిర్ణయంపట్ల రాజకీయాలకు అతీతంగా హర్షధ్వానాలు వ్యక్తమవు తున్నాయి.

రాజకీయాలకు అతీతంగా చేయూత

ఈ వ్యూహాత్మక, చారిత్రాత్మక నిర్ణయంతో కేసీఆర్ రాజకీయాలకు అతీతంగా, కులాలు, మతాలు, వర్గాలకు అతీతంగా అన్నదాతల్లో చెరగని ముద్రవేసుకున్నారు. ఈ సాహసోపేతమైన నిర్ణయంపట్ల రాష్ట్ర వ్యాప్తంగా రైతులు, రైతు సంఘాల నుంచి హర్షం వ్యక్తమవుతోంది. కేసీఆర్ తీసుకున్న నిర్ణయం అన్నదాతకు ప్రాణం పోసిందన్న ప్రశంసల వర్షం కురుస్తోంది. ఉచిత ఎరువుల పంపిణీ నిర్ణయం జాతీయ స్థాయిలో చర్చనీయాంశ మవుతోంది. రకరకాల విపత్తులు, ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా సంక్షోభంలోంచి బయట పడలేకపోతున్న వ్యవసాయ రంగాన్ని పూర్తిస్థాయిలో గట్టెక్కించాలన్న లక్ష్యంతో సీఎం కేసీఆర్ మరిన్ని రాయితీలు, ప్రోత్సహకాలు కల్పించాలన్న దిశగా ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది. ఏ నిర్ణయం తీసుకున్నా ప్రత్యేక తెలంగాణలో మొట్టమొదటిగా ఏర్పడిన ప్రభుత్వానికి కీర్తి ప్రతిష్టలు తెచ్చిపెట్టాలన్న వ్యూహంతోనే ఆయన ముందుకు సాగుతున్నారు. రానున్న రోజుల్లో చిన్న, సన్నకారు రైతు కుటుంబాలకు వ్యవసాయాన్ని పండగ చేసేందుకు మరిన్ని సరికొత్త పథకాలను ప్రవేశపెట్టేందుకు కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసుకుంటున్నారు. ఉచిత విద్యుత్, ఉచిత ఎరువులతో పాటు భవిష్యత్‌లో విత్తనాలు కూడా ఇస్తే రైతులకు ఆర్థికంగా ఎంతో వెసులుబాటు కల్పించినట్లవుతుందని కేసీఆర్ తన ఆలోచనను కొంతమంది మంత్రివర్గ సహచరులతో పంచుకున్నారు.

తొలిసారిగా రైతుకు వృత్తిపై భరోసా

దేశంలోనే తొలిసారిగా తెలంగాణ ప్రభుత్వం రైతులకు నమ్ముకున్న వృత్తిపై భరోసా కల్పిస్తోంది. వివిధ రకాల సామాజిక మాధ్యమాలు, ఫేస్‌బుక్, ట్విట్టర్, వాట్సప్‌లలో సీఎం నిర్ణయాన్ని కొనియాడుతూ లక్షలాదిగా సందేశాలు పంపిస్తున్నారు. అధికారిక లెక్కల ప్రకారం చిన్న, మధ్యతరహా, భారీ నీటి ప్రాజెక్టులు, బోరుబావుల కింద ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా కోటి ఎకరాలకుపైగా వ్యవసాయ భూమిలో పంటలు సాగవుతున్నాయి. సుమారు 40 లక్షల ఎకరాలు వ్యవసాయ యోగ్యమైనప్పటికీ ప్రతికూల పరిస్థితుల కారణంగా ప్రతియేటా బీడు భూములుగానే మిగులుతున్నాయి. వ్యవసాయ రంగంలో ఆధారపడి జీవిస్తున్న కోటి 20 లక్షల కుటుంబాల్లో సుమారు 40 లక్షల మంది చిన్న, సన్నకారు రైతులే ఉన్నారు. ఇప్పటి వరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్త భాగస్వామ్యంతో ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు తదితర సాగుకు అవసరమైన ముడి సరుకును సబ్సిడీపై అందిస్తున్నా, బ్యాంకుల ద్వారా వడ్డీలేని రుణాలను పంపిణీ చేస్తున్నా గడిచిన మూడేళ్ళ పరిస్థితిని పరిశీలిస్తే వ్యవసాయ రంగంలో ఆశించిన ఫలితాలు ఏమాత్రం సాధ్యం కావడంలేదు.

పెట్టుబడి సమకూర్పుతో ఆర్థిక స్వావలంబన

గత కొన్నేళ్ళుగా ఎన్ని రకాల పథకాలు అమలు చేసినా ఈ రంగంపై ఆధార పడిన కుటుంబాల్లో ఆర్థిక స్వావలంబనను తీసుకురాలేకపోయాయి. ఈ విషయాన్ని గుర్తించిన కేసీఆర్ సర్కార్ ఏటా సుమారు 26 లక్షల మెట్రిక్ టన్నుల వివిధ రకాల ఎరువులను ఉచితంగా పంపిణీ చేయాలని నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయంతో ప్రభుత్వ ఖజానాపై ప్రతియేటా 4 నుంచి 5వేల కోట్ల రూపాయల భారం పడుతున్నప్పటికీ అంతకు మించిన ప్రయోజనం పొందే అవకాశాలు ఉన్నందున అన్నదాతలకు చేయూతనిస్తున్నారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో సరాసరిగా ప్రతి ఎకరాకు అయ్యే పెట్టుబడి వ్యయంలో రూ.3వేల నుంచి రూ.4వేల వరకు ఎరువుల ఖర్చే అవుతోంది. తాజాగా ప్రభుత్వం చేసిన ప్రకటన మేరకు ఒక్కో రైతు కుటుంబానికి ఈ మొత్తం మిగులుతుంది. రెండు పంటలకు కలిపి ప్రతి ఎకరాలకు రూ.8వేల చొప్పున లబ్ధి చేకూరుతుంది. ఈ నిర్ణయం బడుగు రైతులకు చేసే మేలు చరిత్రలో నిలిచిపోనుంది.

వ్యవసాయ భూములకు ప్రత్యేక రికార్డులు

• అమల్లోకి తెలంగాణ వ్యవసాయ రికార్డు మేనేజ్‌మెంట్ విధానం • 'ధరణి'లో అధునాతన సాంకేతికత • త్వరలో నిషేధిత భూముల జాబితా

ఆంధ్రప్రభ, హైదరాబాద్: భూ రికార్డుల ఆన్‌లైన్ వెబ్‌సైట్ సమగ్ర వివరాలతో సంపూర్ణస్థాయిలో సిద్ధమవుతోంది. అధునాతన బ్లాక్ చెయిన్ సాంకేతిక విధానంలో ల్యాండ్ రికార్డుల వెబ్‌సైట్ ధరణికి ప్రభుత్వం శ్రీకారం చుడుతోంది. ఇప్పటివరకు ఉన్న విధానాన్ని పూర్తిగా మార్చివేస్తూ ఇకపై వ్యవసాయ భూములకు ప్రత్యేకంగా తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ రికార్డు మేనేజ్‌మెంట్ సిస్టం(టీఎస్ఏఆర్ఎంఎస్)ను రూపొందించాలని సర్కార్ యోచిస్తోంది. అయితే ప్రభుత్వం వద్ద ఇప్పుడున్న మొత్తం భూముల వివరాలను ఈ వెబ్‌సైట్‌లో పొందుపర్చి బ్యాంకులు, రెవెన్యూ శాఖ, ఇతర సంస్థలకు లాగిన్ సౌకర్యం కల్గిస్తారు. ధరణి వెబ్‌సైట్‌లో మొత్తం వివరాలను ఎప్పటికప్పుడు చూసుకునే వీలు కల్గనుంది. తద్వారా రుణాలు, తనఖా, పంట సాయం, ఇన్‌పుట్ సబ్సిడీ, పంట నష్టం, ఇన్స్యూరెన్స్, విత్తనాల పంపిణీ, ఉచిత విద్యుత్, ఇతర అంశాలనూ ప్రభుత్వంనేరుగా తెలుసుకుని పర్యవేక్షించేందుకు వీలు కల్గుతుంది. ప్రభుత్వం 100 రోజులపాటు నిర్వహించిన భూ రికార్డుల పరిశీలనతో 1,12,077 చదరపు కిలోమీటర్ల రాష్ట్ర భూభాగానికి చెందిన వివరాలు ఖాతాల వారీగా ప్రభుత్వం సేకరించింది. 2.80 కోట్ల ఎకరాల భూభాగంలో 1.42కోట్ల ఎకరాల వివాదరహిత వ్యవసాయ భూమి ఉందని గుర్తించగా, 17.89లక్షల ఎకరాల భూమి వివిధ న్యాయపరమైన వివాదాల్లో ఉన్నట్లుగా తేల్చారు. మరో 11.95లక్షల ఎకరాల భూమి రైతుల వద్ద పడావుగా ఉండి సేద్యా నికి దూరంగా ఉందని గుర్తించారు. 84.00లక్షల ఎకాల చెరువులు, కుంటలు, కాలువలు, రైల్వేలైన్, సబ్‌స్టేషన్లు, విద్యా సంస్థలు, ఆస్పత్రులు, ఇతర ప్రభుత్వ ఆస్తుల కింది భూములు, కోర్టు కేసుల్లోని అటవీ భూములు ఉన్నాయి. దాదాపు 97 వేల ఎకరాల అసైన్డ్‌భూముల్లో మూడో వ్యక్తులు కబ్జాల్లో ఉన్నట్లుగా తేలింది. దీంతో మొత్తం వివరాలతో పటిష్ట రికార్డు రూపకల్పన దిశగా ప్రభుత్వం పావులు కదుపుతోంది. ఇకమీదట ఎలాంటి అక్రమ రిజిస్ట్రేషన్లు లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రభుత్వం భావిస్తున్నది. ఈ దిశలోనే నిషేదిత భూముల జాబితాను సిద్ధం చేసేందుకు అధికారులు ప్రభుత్వానికి నివేదిక అందించారు. 24 లక్షల ఎకరాల నగరాలు, పట్టణాలు, గ్రామాల్లోని నివాస ప్రాంతాలు, వివాదాలు లేని అటవీభూములు, అసైన్డ్ సర్కారీ భూముల జాబితా(సెక్షన్ 22ఎ)ను రూపకల్పన చేసి గెజిట్ నోటిఫికేషన్ జారీ దిశగా ప్రయత్నాలను ప్రారంభించింది. అసైన్డ్ భూముల జాబితాను ప్రత్యేకంగా క్షేత్రస్థాయిలో పరిశీలించి ఆక్రమిత భూములను తిరిగి స్వాధీనం చేసుకునేలా చట్టాలకు పదును పెడుతోంది. గతంలో అప్పటి ప్రభుత్వాలు అమలు చేసిన రెవెన్యూ సదస్సులు, జమాబందీల తరహాలో కీలక ఆదేశాలను సమీక్షిస్తోంది. 1971లో పట్టాదారు పాస్ పుస్తకాలు, టైటిల్ డీడ్‌లను అమలులోకి తెచ్చిన తర్వాత జరిగిన అక్రమాలను గుర్తించేపనిలో పడింది. తాజాగా అన్ని రకాల ప్రభుత్వ భూములను నిషేదిత భూముల జాబితాలో చేర్చేందుకు కసరత్తు జరుగుతోంది.


టైటిల్ దిశగా కసరత్తు...

భూ యజమానులకు ఇప్పటివరకు ఆస్థులు, భూములపై యాజమాన్య హక్కు(టైటిల్) లభించే పరిస్థితి లేదు. కేవలం పట్టా కాగితాలు అవి ఎవరివనే చిరునామాను చూపే కాగితాలుగానే మారిపోయాయి. ఈ నేపథ్యంలో కొత్తగా రూపొందిస్తున్న రెవెన్యూ చట్టంలో యాజమాన్య హక్కు పత్రాలు ఇచ్చే దిశగా చర్చ జరుగుతోంది.

ఆంధ్రప్రభ సారస్వత వేదిక

సాహితీవర్షం

నోబెల్ కవుల కవితా దృక్పధాలు



లాగెర్ క్విస్ట్(1951) | రామోహన్ హిమనేజ్ (1956) | బోరిస్ పాస్టెర్నక్(1958) | సాల్వటొరి క్వాసిమోడో (1958) | సింజున్ పర్స్(1960) | జ్యోర్గోస్ సెఫెరిస్ (1963) | నెల్లీ సాచ్స్(1966) | పాబ్లో నెరూడా(1971)

(గతవారం తరువాయి భాగం)

కవిత్వ సారాంశం ఏకత్వంగా భావించే స్పెయిన్ వాసి హువాన్ రామోన్ హిమనేజ్ (1956లో నోబెల్) ప్రాపంచిక సౌందర్యం కవిత్వంలోమొదటి భాగం అలంకారికము, ప్రేమ, కలలు, శృంగార భావాలకు చెందినవయితే, రెండవభాగం నగ్నం(సత్యం) కవిత్వం అన్న భావనలో కొనసాగింది. వీరిని నిపుణుడైన గురువుగా, వీరు కవులకి కవిగా భావిస్తారు. గొప్పకవి ఎక్కువమందిని చేరేవాడే కానక్కర్లేదు. ఎక్కువమందిని తన కవిత్వంలో చేర్చుకోగలుగుతే చాలనుకునేవారు.

రష్యా గొప్ప సంప్రదాయ కావ్యపద్ధతిలో, ముఖ్యంగా సమకాలీన గేయ కవిత్వాన్ని సాధించిన కవి బోరిస్ పాస్టెర్నక్ (1958లోనోబెల్) రష్యాని ప్రేమించారు. స్టాలిన్ అకృత్యాల్ని సైతం క్షమించడానికి సిద్ధపడ్డారు. తాత్కాలికమైన చీకటిలో వెలుగుకోసం ఒళ్లంతా కళ్లు చేసుకుని చూసారు.

రసవాద సంబంధమైన కవిత్వ ధోరణితో రాసే కవులకు నాయకుడుగా పరిగణించబడే అనుభవాల సమాహారం ఇటాలియన్ కవి సాల్వటొరి క్వాసిమోడో (1959లో నోబెల్) కవిత్వం, విశ్వజనీనం, దాని శైలి, రూపానికి సంబంధించి చాలా ప్రధానమైన అంశం. భాష యొక్క ఘనీభవించిన శక్తి అది. విశ్వజనీనమంటే వారి సమయాల్లో ఒక మనిషి మరో మనిషికి తోడ్పడటం. మానవ అమానవీయ దక్పధాలతో ఏర్పడ్డ ఆధునిక ప్రపంచంలో, అప్పటి సమయాన్ని స్థలాల్ని గుర్తుచేస్తూ, ధైర్యాన్ని స్థైర్యాన్ని ఇవ్వటమే వీరి కవిత్వ ముఖ్య ఉద్దేశ్యం. నమ్మిన వ్యక్తిగత అంతర్గత అనుభూతిని కవిత్వం ఆవిష్కరిస్తుందని, తన సమయంలో పొందిన భిన్న అనుభవాల సమాహారమే కవి అని వీరి అభిప్రాయం.

కవిత్వమంటే ఒక సంపూర్ణ జీవితమనుకునే సింజున్ పర్స్ (1960లో నోబెల్) వెస్టిండీస్‌లో జన్మించిన ఫ్రాన్స్ దేశస్థుడు. కవిత్వ ఆలోచనలు వైజ్ఞానిక ఆలోచనలు ఒకలాంటివేనని అతని అభిప్రాయం. మానవాళికి శాస్త్రజ్ఞుని పని ఎంత అవసరమో కవిత్వం కూడా అంతేనని అతని నమ్మకం. కవిత్వంలో ఆకాశానికి ఎగిరే, ఆహ్వానించదగ్గ కల్పన, నేటి కాల్పనిక తీరుని అతని కవిత్వం ప్రతిబింబిస్తుంది.

రసవాది గ్రీకు కవి జ్యోర్గోస్ సెఫెరిస్ (1963లో నోబెల్). ఉద్యోగాన్నీ వదులుకోలేక పడ్డ యాతన, ఏకాంతం, మరణం, దేశాంతరవాసం ఎక్కువ వీరి కవిత్వంలో కనబడుతుంది. గ్రీకుసాహిత్యం, ప్రాచీన చరిత్ర గత అనుభవాలు, వర్తమానానికి, భ విష్యత్తుకు ఎలా ఉపయోగపడతాయన్న ఆలోచనలతో పద్యం చాలా పొదుపుగా సాగేది. కవిత్వంలో తెలిసో తెలియకో రాసిన అబద్ధాలు, ఇప్పుడు కాకపోయినా ఎప్పుడో ఒకప్పుడు బయటపడతాయని అతను బలంగా నమ్మేవారు. అందుకని జాగ్రత్త వహించమని తోటి కవులను హెచ్చరించేవారు.

రూపకాలే తన శబ్దాలుగా భావించే జర్మనీ యూదు కవయిత్రి, నెల్లీ సాచ్స్ (1966లో నోబెల్) చెప్పలేని విషయాల్ని, ఈ రాత్రుల రాత్రిలో సహించే స్థితిలో ఉంచాలని, వణుకు , బాధ దాగున్న పవిత్ర చీకటిని, కొంతయినా పరిచయం చేయాలని, అది వీలైనంత లోకోత్తరంగా చెప్పాలని ప్రతినిత్యం కృషిచేసానని ఒప్పుకున్నారు. సమస్త యూదు ప్రజల విషాదం పట్ల భావోద్వేగ తీవ్రతతో, లయాత్మకంగా బాధాకరమైన అందాన్ని, పౌరాణిక నాటకీకరణలతో, మార్మికతని ప్రతిబింబించి ప్రపంచ పదచిత్రాలతో, హింసల శిబిరాల్లోని అరాచకత్వాన్ని విస్మరించకుండా, ప్రతిహింసకీ అతీతంగా మానవుని నీచంగా చేసిన నిజమైన దుఃఖాన్ని మాత్రమే వీరి రచనల్లో చూడొచ్చు.

కవిత్వంలో
కొత్త కోణాలు చూపించిన
స్వీడన్‌కి చెందిన పార్ ఫాబియన్ లాగెర్ క్విస్ట్ (1951లో నోబెల్), బైబిల్ లోని ప్రతీకలతో మంచీ చెడూ ప్రస్తావన తెచ్చినా, చర్చి సిద్ధాంతాల జోలికిపోకుండా, జీవిత పరమార్థాన్ని, మానవ లక్ష్యాన్ని, తాత్విక ఇతివృత్తాలతో చెప్పారు. రచయితలు 'సరళమైన అభిప్రాయాలు, సంక్లిష్టం కాని జీవితపు అనంత శక్తుల్ని ఎదుర్కొనే భావాలు, లసుఖదుఃఖాలు, ప్రేమద్వేషం, స్వప్రయోజనాలకు అతీతంగా విశ్వజనీన ఆలోచనలు, వారి రచనల్లో ఉండాలని కోరుకునేవారు.

వైవిధ్యమే ప్రధాన ఆకర్షణగా మారిన కవి చిలీ దేశస్థుడు పాబ్లో నెరూడా (1971లో నోబెల్). ఒక ద్వీపం కలల్ని, గతిని, తన బలీయమైన కవిత్వ శక్తితో ప్రేరేపించిన కవి, ప్రపంచ రహస్యాల్ని రూపకాలంకారాలతో తప్ప, తర్కంతోగాని, హేతువాదంతో గానీ విప్పలేం అని నమ్ముతాడు. కవిత్వం రాసే సూత్రాలేవో పుస్తకాల్లో నాకెప్పుడూ దొరకలేదు. అలా అని యువకవులకు, అచ్చులో, ఏదో సలహానో, పద్ధతినో, ఒక శైలినో, తనకేదో తెలిసిన జ్ఞానపు బొట్టుగా విడవదల్చుకోలేదు. రాత, ముద్రణ లేక ముందు నుండి ఈ భూమ్మీద కవిత్వముంది. అంచాత మనకు తెలిసి కవిత్వాన్ని రొట్టెలా అందరితో పంచుకోవాలి. చదువుకున్నవారితోను, కర్షకులతోను, అపరిమేయం, అసాధారణం, ఆశ్చర్యకరమైన, జనసమ్మర్ధమందరితోను, విచారంలో నేను బాలుడ్ని, దక్షిణ చిలీ బీదల విషాదాన్ని, ఏడ్చే వర్షాన్ని అని చెప్పుకున్న అద్భుతమైన కవి.

అనుభవాల నేపథ్యమే ప్రేరణ. జీవితమే స్వీడన్ వాసి హేరీ మార్టిన్సన్ (1974లో నోబెల్) సాహిత్యాన్ని శాసించింది. కష్టాల్లో గడిచిన బాల్యం, తనని, ప్రపంచాన్ని శోధించటానికి పనికొచ్చింది. ప్రకృతి వారికి ఎంత దగ్గరో, అంత దగ్గరగా ప్రపంచానికి చూపించేట్టు చేయగలిగింది. అప్పటి సంఘటలన పట్ల స్పందనతో బాటు, అతని గత జీవిత అనుభవాలు, అతని కవిత్వాన్ని నడిపించాయి. తాత్వికత, రాజకీయాలు, విజ్ఞానం అన్నీ అతని కవితల్లో కనిపిస్తాయి.

గొప్ప కళాత్మక సున్నితత్వం, ఏ భ్రమలూ లేని జీవిత దృక్పథంతో, మానవీయ మూల్యాల్ని వ్యాఖ్యానించిన ఇటలీకి చెందిన ప్రఖ్యాత కవి యూజెనియొ మొంటాలె (1975లో నోబెల్). ఈయన కవిత్వం అప్పటి 20వ శతాబ్ద యూరపు, మరీ ముఖ్యంగా ఇటలీ సంస్కృతిని ప్రతిబింబించే అద్దం. అప్పటి రాజకీయ సామాజిక స్థితుల్ని తేటతెల్లం చేసేవి. వారిదైన శైలిలో ఆధునిక చరిత్ర సంధిగ్ధత, తాత్వికత, జవాబులు దొరకని జీవనరహస్యాలు, జీవితం పట్ల వ్యాఖ్యానం, సుఖదుఃఖాల సమాహారం వీరి కవిత్వం. నేను పదాల్లోని సంగీతానికి స్వేచ్ఛనిచ్చి యదార్థానికి వినియోగించుకున్నాను. అతిశయించే వర్ణనలోనైనా ఆవశ్యకమైన వాటినే తీసుకున్నాను అని వారే చెప్పుకున్నారు. అందరికీ అర్థం కావాలన్న ఏకైక ఉద్దేశంతోనే ఏ కవీ కవిత్వం రాయడని నమ్మేవారు. పదాల శక్తికి కతీతంగా ఏదో వ్యక్తపరిచేదో వీరికి కవిత్వం. కవితో పాఠకుడి సమిష్టి అనుభవం వీరికి కవిత్వం. నిరాశావాదం వీరి కవిత్వంలో అడుగడుగునా కనిపిస్తుంది. మనం వేగంగా పరిగెడుతున్నాం. కానీ అంతగా ముందుకు సాగడం లేదు. చూస్తున్నాం ఆలోచించడం లేదు. చింతనతో కూడిన సమయం నుండి పారిపోతున్నాం. అయినా మనం అనుభవిస్తున్నది మనం సమయమే. అది ప్రస్తుతం అన్న ఆలోచనా సరళి వీరిది.

తన కవిత్వం కాంతికోసం భ్రాంతి అని అభివర్ణించుకున్న స్పెయిన్‌కి చెందిన విసెంటి అలెక్జాండ్రే (1977లో నోబెల్). ఇప్పటి సమాజానికి అనుగుణంగా, స్పానిష్ కవిత్వం సాంప్రదాయాలకు ప్రాతినిధ్యం వహిస్తూ పునరుద్ధరిస్తూ, విశ్వంలో మానవ పరిస్థితుల్ని వెలిగించే దిశగా ఉన్న సృజనాత్మక కవిత్వం వీరిది. గంటలకొద్దీ ఏకాంతవాసం, గంటలకొద్దీ సృజన, గంటల కొద్దీ ధ్యానం. నేనెప్పుడూ కోల్పోని దృష్టిని, తతిమా మానవకోటితో ఐక్యాన్ని,ఈ ఏకాంత ధ్యానమే నాకు కావల్సినంత ఎరుకనిచ్చాయని అదే తన కవిత్వమైనదని చెప్పుకున్నారు.

విషయాశక్తి, బుద్ధికుశలత నిర్మలమైన దృష్టితో, స్వేచ్ఛ,సృజనకోసం ఆధునిక మానవుని పోరాటాన్ని గ్రీసు వాసి ఓడోసియస్ ఎలైటిస్ (1979లో నోబెల్). కవిత్వం చిత్రిస్తుంది. అది కేవలం వ్యక్తిగతమైనది కాక, గ్రీకు ప్రజల సంప్రదాయాన్ని కూడా నివేదిస్తుంది. పురాతన గ్రీకు కవిత్వం నుండి కొంత ఎరువు తెచ్చుకున్నా, అప్పటి గ్రీకు దేశీయానికి కట్టుబడి కవిత్వం రాసారు. అంతా ఊహమీదే ఆధారపడి ఉంటుంది. సూర్యుడు, కాంతి, స్వచ్ఛత, వీరి కవితల్లో ఎక్కువ కనిపిస్తాయని కొందరు ఎలైటిస్‌ని సూర్యుని తాగే కవి అని, పగలు నిద్రపోయి రాత్రులు రాస్తూ గడుపుతారని గుడ్లగూబగా కూడా మిత్రులు పిలిచేవారు.

నాటకీయమై బలవంతపెట్టి, రెచ్చగొట్టే అనేక స్వరాల రచన పోలాండ్‌కి చెందిన చెస్వావ్ మిలలోష్ (1980లో నోబెల్)ది. కేవలం విలేఖరిలా మారకుండా ఉండడం, ఇరవయ్యో శతాబ్దంలో కవిత్వ విద్యార్థులకు ఒక పరీక్ష. భ్రమకు లోనుకాకుండా ఈ ప్రపంచాన్ని ఎలా ఉందో అలా చూడగలిగే వస్తువుని తీసుకోగలిగే నేర్పుని తెచ్చుకోగలగాలని భావించారు. 20వ శతాబ్దంలో భూమి సహజ అద్భుతాలకు, వెర్రి ఆవేశాల చరిత్రకు నా కవితలు సజీవ సాక్షులు అని మిలోష్ చెప్పుకున్నారు. వీరికి జ్ఞాపకాలన్నీ గాయాలే. దేశాన్ని ప్రజల్ని రక్షించలేనిది కవిత్వమా? మంచికోసం సేవచేసే మిత్రుడే కవిత్వం. తర్కించే స్వరం కంటే ఉద్వేగ స్వరం మిన్న. ఉద్వేగ హీనులు చరిత్రని మార్చలేరని బలంగా నమ్మారు.

సత్యం కోసం చేసే సంభాషణగా తన కవిత్వాన్ని చెప్పుకున్న చెకోస్లవేకియా కవి యారోస్లావ్ సైఫర్ట్(1984లో నోబెల్) పట్టుదల బహుముఖ ప్రజ్ఞాశాలి అయిన మనిషి కోసం, తాజాదనం, విషయాసక్తి, విలువైన నూతనదృష్టితో రాసిన కవిత్వం వీరిది. వ్యవహారిక భాషలో సహజ చిత్రణలో వీరి కవిత్వం తక్కువగా ఉంది. రచయిత నిశ్శబ్దంగా ఉన్నాడని అనుకోవడం అబద్ధమని సైఫర్ట్ నమ్మకం. చంపడం, వధించడం కంటే అందమైన పదాల కోసం వెతకడం మేలు అని భావించేవారు.

విశాల సాంస్కృతిక దృష్టికోణంతో కవిత్వ విశేషార్థాలతో అభినయ ఉనికికి రూపం ఏర్పర్చిన ఆఫ్రికా కవి వోలె శోయింకా (1986లో నోబెల్). వీరి సంవేదన, జీవకారుణ్యావాదం, మానవీయ హక్కుల పట్ల నిబద్ధత, భావప్రకటన స్వేచ్ఛలనే కాదు, వీరు జీవితాన్ని, పాటుపడుతున్న విలువలని కూడా వీరి కవిత్వం తెలియజేస్తుంది. ప్రతికవీ తన స్వీయభాషా కవుల కంటే ఇతర భాషల కవులకు ఏదోవిధంగా రుణపడే ఉంటాడు. ఇతర భాషల కవిత్వాల మూలంగా స్వీయ భాషా కవిత్వం సమృద్ధి చెందుతుందే తప్ప చెడిపోదు. ఒక కవి తన ప్రజలతో మాటాడుతున్నప్పుడు ఇతర భాషా కవుల ప్రభావంతో కూడా మాట్లాడతాడు. అదే సమయంలో అతను ఇతర భాషల యువకవులతో మాట్లాడతాడు. ఆ కవులు ఆ దృష్టికోణాన్ని అక్కడి ప్రజలకు అందించే ప్రయత్నం చేస్తాడు. తమ ప్రభావం కొంత, తమ కవితలనే పునఃసృష్టిస్తున్న అనువాదాల ప్రభావం మరికొంత, కవులు కాని పాఠకుల మూలంగా ఇంకొంత, అలా ఇరు భాషా ప్రజల మధ్య అవగాహన పెంచేందుకు కవి దోహదపడుతుంటాడు. అయితే ఇలా ప్రభావితులైన ప్రజలు అల్ప సంఖ్యాకులే అయినా, అది ప్రజల మధ్య అవగాహన దృష్ట్యా, కవిత్వం మనుగడ దృష్ట్యా కూడా ఆవశ్యకం అని కూడా ఎలియట్ నమ్మారు. సుదూర తీరాల నుండి విభిన్న భాషల నుండి వచ్చినా, అవన్నీ మన వెనకే కాదు. మనలోన కూడా ఉండి మనలో ప్రేమని పంచుతాయి. అప్పటి సంఘర్షణలకు సమయానికి ప్రతినిధి కవి. కవి తన రక్తంతోను చీకటితోనూ వాటిని నింపాలని ఎదురుచూసే ఖాళీ పేజీలకు సైతం కవి ధన్యవాదాలు చెప్పుకోవాల్సిందే అని నెరూడా అభిప్రాయమే అందరి అభిప్రాయం కూడా.

- ముకుంద రామారావు
9908347273

తెలుగు వెలుగు జిలుగుల పండుగ



పండుగ...పండుగ...
తెలుగిళ్ళ లోగిళ్ళు,తళతళ మెరిసే పండుగ
పెద్దలు నచ్చే పండుగ, పిన్నలు మెచ్చే పండుగ
పెద్దల్ని కొలిచే పండుగ, సుద్దుల్ని పంచే పండుగ
భూమాత ఈస్ట్‌మన్ కలల్లో...
తళుకులీనే పండుగ.
గోమాత పొదువు ముందు పాలతో...
పొంగొ పొర్లే పండుగ.
ఇబ్బడి ముబ్బడిగా పంట కళ్ళాల...
రాశులు నిండే పండుగ.
పిల్లా, పెద్దా, గొడ్డు, గోదా...
నవ్వగలిగే పండుగ.
తుళ్ళి తుళ్ళి ఎగరగలిగే పండ..
భగ భగ మంటు, భుగ భుగ ఎగిసే...
భోగి మంటల పండుగ.
ఆకలి పేగులకి అమృత మిచ్చే
'కక్క ముక్కల' కనుమ పండ...
పశువుల పండగ, శిశువులపండుగ.
అల్లుళ్ళ అలకల పండుగ.
మరదళ్ళ సొగసుల పండుగ.
పైసలు లేని మావల గుండెల...
గుండె గుభేళ్ళ పండుగ!!
గొబెమ్మల పండుగ, డు డు బసవన్నల పండుగ.
హరిదాసు తత్త్వాలు తారాడే పండుగ.
రంగవల్లు ముంగిట్ల తారాడే పండుగ.
రయ్‌మని ఎగిరే కోడిపుంజుల పండుగ.
మీసాలు మెలేసే, పందెం రాయుళ్ళ...
"పొగరు" బోత్తనాల పండుగ!
బుడబుక్కల బూచోళ్ళ, గడి బిజి వేషాల పండుగ!!
అందాల పండుగ, ఆనందాల పండుగ.
సంతసాల పండుగ, సంరంభాల పండుగ!
పిల్లా పెద్ద, రాజూ , పేదా...
అందరు ఒకటయ్యే పండుగ!!
భోగి, కనుమలు తోడుగ రాగ...
ముక్కనుమ కూడ వేడుక కాగా...
గాదెలు, బోదెలు, గేదెలు...
నిడుగ, మెండుగ, దండిగ నిడే
ఉత్సాహాల, ఉల్లాసాల, సల్లాపాల పండుగ!!
దశదిశల, నలుదెసల
కాంతిని నింపే, క్రాంతిని నిలిపే...
తెలుగుల పండుగ, వెలుగుల పండుగ
తెలుగు వెలుగుల జిలుగుల పండుగ
సమ్యక్ క్రాంతి పండుగ...
సంక్రాంతి పండుగ..

- రమాప్రసాద్ ఆదిభట్ల
సెల్ : 9348006669

సంక్రాంతి ఆగిపోయింది!

సంక్రాంతి..క్రాంతి
పాతపడిన పడికట్లు
వెలిసిపోయిన వరిగట్లు
అటకెక్కిన ఆత్మీయతలు
చెదిరిన సమాజాలు
చిరిగిన సంబంధాలు!
సంక్రాంతి ఆగిపోయింది
సుదూరంలో దాగిపోయింది
దశాబ్దాల దూరాన ఉండిపోయింది
కాలం చాలా దూరం వెళ్లిపోయింది
మనం ఎప్పుడో దాటేశాం..మరిచేశాం
దూరతీరాల ఆవలికి వెళ్లిపోయాం
హరిదాసుల సుద్దులు ఎక్కడ?
గొబ్బెమ్మల సువాసనలెక్కడ?
రంగుల రంగవల్లులేవి?
అక్కడో..ఇక్కడో..ఎక్కడో
ఒకటీ అరా కనిపిస్తే చాలా
పండగంటే ఊరుమ్మడి ఆస్తి కాదా?
అయినా..టెంపరి ప్రశ్న ఉండనే ఉంది
హరిదాసులు..గొబ్బెమ్మలు
కనిపించడం లేదా?
నెట్లో క్షణంలో కళ్ల ముందర
చాలాచాలా దగ్గరగా!
ఆధునిక యుగంలో



అత్యాధునిక సంక్రాంతి!
అవి చూసి మురిసిపోవడమే
అదే సంక్రాంతి అని సంబరపడటమే
కాని ఆ ముగ్గుల్లో మనసుంటుందా?
ఆ గొబ్బెమ్మల సొగసు ఆస్వాదిస్తామా?
పల్లెల్లో పాతికేళ్ల నాటి సంక్రాంతి లేదు
సంక్రాంతిలో క్రాంతిని చూసే తరం లేదు
కొత్త తరాలన్నీ కొత్త బాటలు పడుతున్నాయ్
డాలర్ల క్రాంతిలో కొత్త వెలుగులు
వెతుకుతున్నాయ్
పల్లెపట్టులు బోసిపోతున్నాయ్
ఇళ్లన్నీ వయస్సు మీరి ఉసూరంటున్నాయ్
అక్కడో ఇక్కడో..ఒకటీ అరా ఇళ్లల్లో శబ్దాలు
తలుపులు గాలికి కొట్టుకుంటున్న శబ్దాలు
ఆ శబ్దాలను ఆపే శక్తిలేని గుండెల రెపరెపలు
జీవచ్ఛవాల పేగు బంధాల మౌన రోదనలు
చిన్నప్పటి సంక్రాంతి గుర్తొచ్చి కలుక్కుమనే
ముసలి మనసుల మూగ రోదనలు
ఏటికేడాది సంక్రాంతి వస్తుందంటేనే బాధ
గుండెకు గుండుసూది గుచ్చినట్టు
పండగ రాకుంటేనే మంచిదన్నట్టు
అందుకే సంక్రాంతి ఆగిపోయింది
కాని మనం మాత్రం పట్టుకుని వేలాడుతున్నాం
పట్నాల నుంచి పల్లెలకు పరుగులు పెడుతున్నాం
టోల్ గేట్ల దగ్గర కార్ల బారులు చూస్తున్నాం
రైల్వే స్టేషన్లలో రద్దీలతో డస్సిపోతున్నాం
ఇవన్నీ చూస్తూ సంక్రాంతిగా మురిసిపోతున్నాం
డబ్బుల్లేని ఏటీఎంలు తిరిగి తిరిగి అలసినా
సంక్రాంతి కదా అని సరిపెట్టుకుంటున్నాం
ఆస్వాదించలేకున్నా ఆనందిస్తున్నాం
జాతీయ రహదారుల్లో రద్దీలకు అర్థమేమిటి?
ఆ పరుగుల్లో ఏ గాలులు వీస్తున్నాయ్
ఆ ఉరుకుల్లో ఏం అభిరుచులున్నాయ్
ఈ ప్రశ్నలకు జవాబులొస్తే చాలు
సంక్రాంతి సంగతి తెల్సిపోతుంది
ఆ జవాబులు మనకు తెలీనివి కావు
మనందరికీ తెల్సిన రహస్యాలే
పల్లె లోగిళ్ల చీకట్లు తరిమేస్తామా?
ఆ చీకట్ల మాటున పండగ దాచేస్తామా?
తరాలు మారిన సంక్రాంతి కథ ఇది!
తలరాతలు మారిన పల్లె పండగల వ్యధ ఇది!

-వయ్యస్సారెస్
సెల్ : 9000013367

కవిత ధ్వనిపూర్వకంగా ఉండాలి

కవిత్వమంటే అక్షర హింస కాదు.. అక్షర తాండవం. కవిత్వంలో చెప్పేదేదైనా బలంగా చెప్పాలి. అలా చెప్పడానికి parallelism పద్ధతినే నేటికీ చాలా మంది కవులు అనుసరిస్తున్నారు. అది సరైన పద్ధతి కాదు. ముఖ్యంగా యువకవులు పదాలను పదేపదే ఉపయోగిస్తూ కవితా నిర్మాణం చేస్తున్నారు. దీన్నే poetic devices లో పేరలెలిజం(parallelism) అంటారు. అంటే repetition అని అర్థం. చాలా కవితా సంస్కృతుల్లో ఇది central part గా ఉంది.

I was glad; so very very glad
----
half a league,half a league
half a league, o ward...

ఇది చాలా మంది కవుల్లో ఇప్పటికీ తరచుగా కనిపిస్తుంది. కాని ఇది వేదిక మీద చదివే కవితలకు వర్తిస్తుంది. కవిసమ్మేళనాలలో ఇలాంటి repetition పదాల పాదాల కవితలు తరచూ వినిపిస్తుంటాయి. కాని వచన కవితల dicrion అది కాదు. అందుకే 1958లోనే కందుర్తి ఆధునికి కాలానికి పద్య నిర్మాణం తగినది కాదని వచన కవిత్వమే సరిమైనదని చెబుతూ,ఫ్రీవర్స్ ఫ్రంట్ స్థాపించాడు. ఆధునిక వచన కవితా లక్షణాలను చాలా మంది పెద్దకవులు, పరిశోధకులు ఎప్పటి కప్పుడు చెబుతూనే ఉన్నారు. ముఖ్యంగా..

1.శ్రీశ్రీ అన్నట్లు ఛందో బందోబస్తులన్నీ వచనవిత తెంచింది.
2. సామాజిక చైతన్యం రగిలించే కవితా వస్తునిర్మాణం వచన కవితకు ప్రత్యేకం.
3. చమత్కారమైన అధిక్షేపణ వచన కవుల సొత్తు.
4. కాలం మారిన దశలో పాత కవి సంప్రదాయాలను, అలంకారాలను వచన కవిత తిరస్కరించింది.
5. వచన కవితలో గేయ కవితలాగా మాత్రా ఛందస్సుకూడా నిబద్ధం కాదు.

అందుకే ఆధునిక తెలుగు వచన కవిత్వంలో అనేక పాశ్చాత్య కవితా నిర్మాణాలను మన వాళ్ళు అనుకరిస్తూ రూపనిర్మాణంలో అనేక కొత్త ప్రయోగాలు చేశారు. వాటిలో ముఖ్యంగా మినీ కవితలు, రుబాయిలు, హైకూలు, నానీలు, నానోలు.. రెక్కలు.. ఇలా ...అనేక కవితా నిర్మాణాలు చేపట్టి లెక్కలేనన్ని కవితా సంపుటాలు వెలువరించారు. అయితే ఇవన్నీ ప్రయోగాలే... వచన కవిత్వమే ప్రధాన కవితా ప్రక్రియ. కాని యువకులు తొలి దశలో,.. పెద్ద పెద్ద కవితలు రాయడానికి ప్రయత్నించే ముందు వీటి గురించి తెలుసుకోవడం ఎంతో అవసరం. పెద్ద పెద్ద కవులు కూడా కవిత్వంలో గాఢ తాత్వికతను, భావుకతను, వ్యంగ్యాన్ని, ధ్వనిని, చమ త్కారాన్ని, గొప్ప ఇమేజరీని... తటిల్లతల్లాంటి చిన్న కవితల్లో మెరిపించడానికి... ఆయా విభిన్న కవితా నిర్మాణాలను చేపట్టి కొంత వరకు సఫలమయ్యారు. వాటి గురించి తెలుసుకుందాం..

మీనీకవిత : వచన కవిలు రాసిన ప్రతి ఒక్కరూ ఎప్పుడో ఒకప్పుడు మినీ కవితలు రాసిన వారే.. ఇందులో ..ముఖ్యంగా...

1. క్లుప్తత ఉండాలి.
2. కవిత ధ్వని పూర్వకంగా ఉండాలి.

కవిత్వం-డిక్షన్-20

3. వ్యర్థ అక్షరమనేది ఉండకూడదు.
4.శీర్షిక ప్రధానం. ఆకర్షణీయంగా ఉండాలి.
5. చమత్కారం కవితాత్మకంగా ఉండాలి.

అద్దేపల్లి, రావి రంగారావు తదితరులు వీటిని బాగా ప్రోత్సహించారు. 'మినీ కవిత ఆయుష్షు మెరుపంత, కానీ అది ప్రసరిస్తుంది కాలమంత' అంటారు. సి.నా.రే... రుబాయిల గురించి తెలుకుందాం...

రుబాయిలు : 1. రుబ్ అంటే 'రసం, సారం' అని అర్థాలున్నాయి.
2. రుబాయీ అంటే రసవంతమైనది.
3. రుబాయి అరిబ్బీ భాషా పదం. ' అరబా' (నాలుగు) మూలం.
4. రుబాయి నాలుగు పంక్తులున్న కవిత.
5. ఒకటి రెండు, నాలుగు పాదాలకు అంత్య ప్రాస నియతి ఉంటుంది.



6. ప్రతి పాదం ఒక సంపూర్ణ వాక్యం.
7. ఉమర్ ఖయ్యాం, మహమ్మద్ ఇగ్బాల్, అంజాద్ హైదరాబాది, మీర్ అనీస్, దభీర్ ఈ ప్రక్రియలో ముఖ్యులు.
8. తెలుగులో 1966లో దాశరథి తొలి రుబాయిలను రాశారు.

ఇప్పటికీ ఎండ్లూరి సుధాకర్ ఈ కవితా ప్రక్రియను బలమైన అభివ్యక్తితో కొనసాగిస్తున్నారు.ఆడవాళ్ళ చట్టాలను కాపాడాలి.
ఇరుగు పొరుగు వారికొరకు పోరాడాలి దెబ్బతినే దేశామాత దేహం చూసి దేవుడైన ఆమె వైపు నిలబడాలి.. అంటూ ... రుబాయిలకు ప్రాణంపోస్తున్నారు ఎండ్లూరి సుధాకర్.

నానీలు: ఇకదేశీయమైన కవితా ప్రక్రియగా ఆచార్య ఎన్.గోపి నానీల కవితా రూపాన్ని 1997లో సృష్టించారు.1. నానీలు అంటే 'నావీ- నీవీ- వెరసి... మనవి'అనే అవగాహనతో పుట్టాయి.
2. నానీలలో నాలుగు పాదాలుంటాయి.
3. వాటిలో 20-25 అక్షరాల నిడివి ఉండాలి.
4. ఒక లక్షణాన్ని చెప్పి, ఒక భావాంశాన్ని రమణీయంగా చెప్పే వీలుంటుంది.

డా.ఎన్. గోపి అద్భుతమైన నానీలు రాసి తన శిష్యులచేత పుంఖాను పుంఖంగా నానీల కవితా సంపుటాలు (వందల్లో) వెలువరింపజేశాడు.

రైలుపట్టాలు తాముకలవ్వగాని దూరాలను కలుపుతాయి ఇలా గోపిగారి నానీలను చూసి చాలా మంది ప్రేరణ పొందారు. వ్యంగ్యం, చమత్కారం, తాత్వికత, భావుకతల కలనేతగా ఎన్నో మంచి నానీలను సృష్టించారు. చూడ్డానికి చిన్న పిల్లల కవితల్లా కనిపించినా పెద్ద పెద్ద కవులే నానీలు రాయలేక వచన కవితలే రాశారు. చలపాక ప్రకాశ్ నానీలపై మంచి పరిశోధనా గ్రంథం వెలువరించారు.

రెక్కలు : ఎం.కె. సుగమ్ బాబు 2009లో ఈ కవితా ప్రక్రియను ప్రారంభించారు.
1. రెక్కలు కవితలో ఆరు పాదాలుంటాయి.
2. ఒక్కో పాదంలో ఒకటి లేదా రెండు పదాలు ఉండాలి.
3. నాలుగు పాదాల తర్వాత ఒక ఎడం..
4. ఈ ఎడం పాఠకుని ఊహకు పదును పెట్టేదిగా ఉండాలి.
5. దాని తర్వాత రెండు పాదాలు వస్తాయి.

పూలచెట్టుకైనా / ఎంత వేదన/ తొలిపువ్వు/ పూచేవేళ/ వేదనా జనితం/ సృజన.. అంటూ.. రెక్కల కవిత రెక్కలల్లారుస్తుంది. స్పష్టమైన లక్ష్యం, లక్షణం రెక్కల్ని ప్రతిభావంతం చేస్తాయి. ఈ కవితా రూపంలో సువూరు 60 కి పైగా కవితా సంపుటాలు ఉండవచ్చు.

నానోలు: 1. నానోలో నాలుగు పాదాలుంటాయి.
2. పాదానికి ఒక పదం లేదా చిన్న సమాసం మాత్రమే ఉండాలి.
3. నాలుగో పాదం చమత్కారంతో ముగియాలి.
4. ఈగ హనుమాన్ 2005 నుండి దీన్ని రాస్తున్నట్టు తెలుస్తోంది.

సబ్బని వెలువరించిన తెలంగాన నానోలు అందరినీ ఆకర్షించాయి....
స్వచ్ఛత, నిజాయితీ, చిత్తశుద్ధి, తెలంగాణ
అంటారు సబ్బని ఒక నానోలో... ఇలా కవితా రూపాలు ఎన్నో ఉన్నాయి. యువకవులు వాటిన ప్రాక్టీస్ చేయాలి. సాధన లేకుండా వివిధ కవితా సంపుటాలను రాస్తే ప్రయోజనం లేదు. కవిత్వమంటే ఒక అన్వేషణ, తనివితీరని వేదన, తరగని తపన, మనసుపడే యాతన, సంకోచాలు , మొహమాటాలు కవిత్వానికి తీరని హాని చేస్తాయి. కవిత్వం రాయడం అంత సులభం కాదు. అలా అని అది ఏదో బ్రహ్మవిద్య కాదు. హృదయవిద్య. అందుకే ' అబద్ధాలాడడమంత సులభం అవదు సుమా... కవిత అల్లడం' అన్నారు దాశరథి కృష్ణమాచార్యులు. ఈ విషయాలన్నీ గుర్తించి యువకువులు కవిత్వం రాయడం ఒక సీరియస్ యాక్టివిటీగా తీసుకుంటారని ఆశిస్తున్నాను..

- బిక్కి కృష్ణ
సెల్ : 8374439053

అటకెక్కిన భూ పంపిణి!?

● నిరుపేద దళితులకు మూడెకరాలు ● లబ్ధిదారుల కుటుంబాలు 14 లక్షలు
● ఇప్పటివరకు లబ్ధి పొందింది 2,236 కుటుంబాలు
● నిధుల కొరత, అధిక ధరలతోనే అసలు సమస్య



హైదరాబాద్, ఆంధ్రప్రభ : దళితుల భూ పంపిణీ పథకం ఆశించిన మేరకు ముందుకు సాగడం లేదు. లక్ష్యాలను చేరుకోవడంలో అనేక అవరోధాలను ఎదుర్కొంటుంది. భూ లబ్ధి ఆశాజనకంగా లేకపోవడం, ధరలు ఎక్కువగా ఉండటం. గుర్తించిన భూములను కొనుగోలు చేయడానికి సరిపడా నిధులు అందుబాటులో లేకపోవడం లాంటి కారణాల వల్ల పథకం ఆశించిన ఫలితాలను రాబట్టలేకపోతుంది.

ఈ ఏడాది కేవలం 20 జిల్లాల్లోనే నామమాత్రంగా భూ పంపిణీ జరిగింది. అత్యధిక జిల్లాలు ఈ పథకంపై పెద్దగా దృష్టి కేంద్రీకరించలేకపోతున్నాయి. భద్రాద్రి, జగిత్యాల, జనగామ, మహబూబ్‌నగర్, నిజామాబాద్, పెద్దపల్లి, రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాల అధికారులు భూ లభ్యత లేదని నివేదికలను ప్రభుత్వానికి పంపించడం గమనార్హం. ప్రభుత్వం నిర్ణయించిన ధరలు, బహిరంగ మార్కెట్‌లో భూముల ధరలకు పొంతన ఉండటం లేదని, అధిక ధరలకు భూములు కొనడం పరిమితమైన నిధుల కారణంగా సాధ్యం కావడం లేదని మరికొన్ని జిల్లాల కలెక్టర్లు పేర్కొన్నారు.

2017-18 ఆర్థిక సంవత్సరంలో పదివేల ఎకరాలు పంపిణీ చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇప్పటి వరకు 25 శాతం భూమిని కూడా పంపిణీ చేయలేకపోయింది. కనీసం ఐదు వేల ఎకరాలైన పంపిణీ చేయాలని ఎస్సీ కార్పొరేషన్ అధికారులు భావిస్తున్నారు. మార్చి మాసాంతంలోగా ఈమాత్రం లక్ష్యం చేరుకోవడం కష్టంగానే కనిపిస్తుంది. ఇప్పటికే వివిధ జిల్లాల్లో సేకరించిన 2071 ఎకరాల భూమి పంపిణీకి సిద్ధంగా ఉందని అధికారులు వెల్లడించారు. మార్చి మాసాంతం నాటికి మరో మూడు వేల ఎకరాలు సేకరించి లబ్ధిదారులకు పంపిణీ చేయడానికి కార్యాచరణ రూపొందించుకుంటున్నామని వివరించారు. అంతకు ముందు సంవత్సరం కూడా లక్ష్యాన్ని చేరుకోలేకపోయారు. తక్కువ ధరతో సేకరించిన భూములు సాగుకు అనువుగా లేకపోవడం, చౌడు నేలలు కావడంతో అబ్దిదారులు వాటిని తీసుకొనేందుకు ముందుకు రావడం లేదు.

ఏటేటా భూ పంపిణీ పథకం అమలు నీరుగారిపోతుంది. ప్రభుత్వం నుండి పెద్దగా ప్రోత్సాహకం లేకపోవడం, సరిపడా నిధులు మంజూరు చేయకపోవడం, ఉన్న నిధులతో మేలైన సారవంతమైన, సాగుకు అనువైన భూములు కొనుగోలు చేయడం సాధ్యం కాదనడం లాంటి అనేక కారణాల వల్ల పథకం నత్తనడకన సాగుతోంది. దళితులకు భూ పంపిణీ పథకం గతంలో కూడా అమలైంది. అందుబాటులో ఉన్న భూములను గుర్తించి అర్హులైన లబ్దిదారులకు భూములు పంపిణీ చేయడంతో పాటు వాటి అభివృద్ధికి ఆర్థిక తోడ్పాటు ఇవ్వడం జరిగింది. తెరాస ప్రభుత్వం ఈ పథకాన్ని మరింత బలోపేతం చేసి భూమి లేని నిరుపేద దళిత వ్యవసాయ ఆధారిత కుటుంబాలకు మూడెకరాల భూ పంపిణీ పథకాన్ని అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ప్రకటించింది. ఇప్పటికే ఎకరం, రెండెకరాలు ఉన్నవారికి కూడా మరో రెండెకరాలు, ఎకరం ఇవ్వాలని సంకల్పించింది.

తెలంగాణలో షెడ్యూల్డు కులాల జనాభా 63,60,158 (17.50 శాతం) వరకు ఉన్నారు. దళిత కుటుంబాల్లో అత్యధికులు భూ పంపిణీ పథకానికి అర్హులేనని జిల్లా కలెక్టర్లు అందచేసిన నివేదికలు పేర్కొంటున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ ఆధారిత కుటుంబాలుగా మొత్తం దళిత జనాభాలో 80 శాతం వరకు ఉంటారని ప్రభుత్వం గుర్తించి ఆ మేరకు చర్యలు తీసుకుంది. దాదాపు 14 లక్షల దళిత కుటుంబాలకు భూములు పంపిణీ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటి వరకు 2,236 కుటుంబాలకు మాత్రమే భూ పంపిణీ జరిగింది. ఈ కుటుంబాలకు భూములు ఇవ్వడంతో పాటు భూములను అభివృద్ధి చేసి వారి ఆర్థికాభివృద్ధికి దోహదపడాలని ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావు భావించడంతో పథకానికి రూపకల్పన జరిగింది. అంతటి ప్రాధాన్యత కలిగిన పథకం ఆచరణలో నీరుగారిపోతుంది.

నిధుల కొరత, భూ లభ్యత సమస్యలతో పథకం అమలును అటకెక్కించే ప్రయత్నం జరుగుతుంది. ఇప్పటికే అత్యధికులైన దళితులు ప్రభుత్వం నుండి భూములు పొందారని, తిరిగి మరోసారి భూమి కోసం దరఖాస్తు చేసుకుంటున్నారని క్షేత్ర స్థాయి అధికారులు ప్రభుత్వానికి నివేదికలను పంపిస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో ప్రభుత్వ, ప్రైవేటు భూములు లభ్యం కావడం లేదని అధికారులు పేర్కొంటున్నారు. భూ కొనుగోలుకు ప్రభుత్వం ఆశించిన మేరకు విడుదల చేయకపోవడం కూడా మరో కారణంగా అధికారులు వివరించారు.

సిటీ బస్సు చార్జీల హేతుబద్ధీకరణ

● ఆర్టీసీ ఎండీ జీవీ రమణారావు



హైదరాబాద్, ఆంధ్రప్రభ: సిటీబస్సుల్లో ఛార్జీలను హేతుబద్ధీకరించారు. ఈ మేరకు ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ జి.వి. రమణారావు అధికారిక ప్రకటన విడుదల చేశారు. హైదరాబాద్, వరంగల్ నగరాల్లో ఈ ఛార్జీల హేతుబద్ధీకరణ నేటి మొదటి సర్వీసు నుండి అమలులోకి వస్తుందని వెల్లడించారు. రూ. 1 నుండి రూ. 10 వరకు వివిధ విలువల్లో ఉన్న ప్రస్తుత సిటీబస్ ఛార్జీల వల్ల ప్రయాణికులకు చిల్లర తిరిగి ఇవ్వడం సమస్యగా మారుతుందని, కండక్టర్లు, ప్రయాణికుల దగ్గర చిల్లర లేకపోవడం కారణంగా సరైన ఛార్జీలు వసూలు చేయడంలో, చిల్లర ఇచ్చే విషయంలో వారిమధ్య నిత్యం వాదోపవాదాలు చోటు చేసుకుంటున్నాయని వివరించారు. ఈ సమస్యను నివారించడం కోసం ఛార్జీలను హేతుబద్ధీకరించడం జరుగుతుందని రమణారావు తెలిపారు. సిటీ బస్ ఛార్జీల హేతుబద్ధీకరణకు సంబంధించి విజయవాడ, విశాఖపట్నం నగరాల్లో చేసిన అధ్యయనంలో ఛార్జీలు రూ. 5, రూ. 5 గుణకాలకు సవరించడం జరిగిందన్నారు. అందువల్ల హైదరాబాద్, వరంగల్ నగరాల్లో ఛార్జీలు రూ. 5, రూ. 5 గుణకాలకు సవరించడం జరిగిందన్నారు. దీని వల్ల చిల్లర కష్టం తీరిపోయి కండక్టర్లు, ప్రయాణికుల మధ్య సత్సంబంధాలు నెలకొంటాయని అభిప్రాయపడ్డారు.

ఈ నెల 15 నుండి అన్ని సిటీ ఆర్డినరీ బస్సుల్లో తొలి రెండు స్టేజీల వరకు కనీస ఛార్జీ రూ. 5లుగా, 4 నుండి 10వ స్టేజీ వరకు రూ.10గా ఛార్జీ వసూలు చేస్తారు. ఇప్పటి వరకు తొలి రెండు స్టేజీలకు రూ. 7లు, రెండు నుండి 4వ స్టేజీ వరకు రూ. 8లు, నాలుగు నుండి 6వ స్టేజీ వరకు రూ. 9లు, 8వ స్టేజీ వరకు రూ. 10లు వసూలు చేశారు. మెట్రో ఎక్స్‌ప్రెస్‌లలో ఇక మీదట 6 స్టేజీల వరకు రూ. 10లు, 8 నుండి 14 స్టేజీల వరకు రూ. 15లు, 16 నుండి 24 స్టేజీల వరకు రూ. 20లు వసూలు చేస్తారు. ఇప్పటి వరకు తొలి రెండు స్టేజీలకు రూ. 8లు, 4వ స్టేజీ వరకు రూ. 10లు, ఆరవ స్టేజీ వరకు రూ. 12లు, 8వ స్టేజీ వరకు రూ. 13లు, 10వ స్టేజీకి రూ. 14లు, 12వ స్టేజీ వరకు రూ. 16లు, 14వ స్టేజీ వరకు రూ. 17లు వసూలు చేశారు. మెట్రో డీలక్స్ బస్సుల్లో ఇక మీదట తొలి 2 స్టేజీల వరకు రూ. 10లు, 3వ స్టేజీ నుండి 6 స్టేజీ వరకు రూ. 15లు, 7వ స్టేజీ నుండి 11వ స్టేజీ వరకు రూ. 20లు, 24వ స్టేజీ నుండి 30వ స్టేజీ వరకు రూ. 25 లు వసూలు చేస్తారు. ఆర్డినరీ బస్సుల్లో 40 కిలోమీటర్లు 20 స్టేజీల పరిధిలో ఇప్పటి వరకు వసూలు చేసిన రూ. 28లు ఛార్జీలను రూ. 30లకు పెంచారు. మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో కనీస ఛార్జీ రూ. 10లు కాగా 20 స్టేజీలు, 40 కిలోమీటర్ల దూరానికి రూ. రూ. 31ల నుండి రూ. 30లకు తగ్గించారు. అదే విధంగా మెట్రో డీలక్స్ బస్సుల్లో కనీస ఛార్జీ రూ. 9 నుండి రూ. 10లకు పెంచారు. 20 స్టేజీలు, 40 కిలో మీటర్ల దూరానికి రూ. 32 ల నుండి 30లకు కుదించారు.

పెండింగ్ కేసులు పరిష్కరించండి

● కింది కోర్టులకు హైకోర్టు సర్క్యులర్

హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాష్ట్రంలో దీర్ఘకాలంగా పెండింగ్‌లోఉన్న కేసులను పరిష్కరించాలని ఉమ్మడి హైకోర్టు నిర్ణయించింది.ఈ మేరకు హైకోర్టు రిజిస్ట్రార్ (జ్యుడీషియల్) కింది స్థాయి కోర్టులకు సర్క్యులర్ పంపారు. మార్చి 31 నాటికి ఐదేళ్లకు పైబడి పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సర్క్యులర్‌లో రిజిస్ట్రార్ సూచించారు.

జాతీయ కంప్యూటర్ సదస్సుకు న్యాయాధికారులు

ఈ నెల 20,21 తేదీలలో లక్నోలో జరగనున్న మొదటి జాతీయ కంప్యూటర్ కమిటీ సదస్సుకు ఇద్దరు న్యాయాధికారులను హైకోర్టు ఎంపిక చేసింది. విజయవాడలో 12వ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి టి వేణుగోపాలరావు, రంగారెడ్డి జిల్లా ఎల్బీనగర్ 3వ అదనపు మరియు సెషన్స్ జడ్జి డి హేమంత్‌కుమార్‌లు ఎంపికయ్యారు. లక్నోలోని జ్యుడీషియల్ ట్రైనింగ్ అండ్ రీసర్చ్ ఇన్స్‌టిట్యూట్ (జేటీఆర్ఐ) లో జరిగే జాతీయ సదస్సుకు హాజరవుతారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారమే లక్ష్యం

● తెలంగాణ ఎంప్లాయీస్ నేత గడ్డం బాలస్వామి

హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారమే తన లక్ష్యమని తెలంగాణ ఎంప్లాయిస్ అసోసియేషన్ (టీఈఏ) అసోసియేట్ ప్రెసిడెంట్ గడ్డం బాలస్వామి తెలిపారు. పోరాడి సాధించుకున్న తెలంగాణలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలపై దృష్టిసారిస్తామని, తనను అసోసియేట్ అధ్యక్షునిగా ఎన్నుకున్నందుకు ఆయన ఉద్యోగులకు ఆదివారం ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలియజేశారు. గడ్డం బాలస్వామి న్యాయశాఖ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శిగా కూడా ఉన్నారు.

స్పీకర్‌ను కలిసిన ఎర్రోళ్ల శ్రీనివాస్

హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాష్ట్ర శాసనసభ స్పీకర్ మధుసూధనాచారిని ఎస్సీ,ఎస్టీకమిషన్ చైర్మన్ ఎర్రోళ్ళ శ్రీనివాస్ ఆదివారం అసెంబ్లీలోని స్పీకర్ ఛాంబర్ కలిశారు. నూతనంగా చైర్మన్‌గా నియమితులైన నేపథ్యంలో స్పీకర్‌ను కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు.

మాదిగలపై టీఆర్ఎస్ కుట్ర

● ఎమ్మార్పీఎస్ నాయకుడు వనం నరసింహ



హైదరాబాద్, ఆంధ్రప్రభ : టీఆర్ఎస్ ప్రభుత్వం మాదిగలపైన కక్షపూరితంగా వ్యవహరిస్తోందని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు వనం నరసింహ అన్నారు. మంద కృష్ణమాదిగపై పీడీ యాక్టు కింద కేసులు పెట్టాలని కుట్ర చేస్తోందని ఆయన పేర్కొన్నారు. ఇదే విధానాన్ని కొనసాగిస్తే భవిష్యత్‌లో టీఆర్ఎస్ పార్టీ తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని ఆదివారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. టీఆర్ఎస్ నేతలు, ప్రజా ప్రతినిధులు గ్రామాల్లో తిరగలేరనే విషయం తెలుసుకోవాలన్నారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ కోసం 23 ఏళ్లుగా శాంతియుతంగా పోరాటం చేస్తున్న మంద కృష్ణ మాదిగతో వందలాది మంది ఎమ్మార్పీఎస్ శ్రేణులపై ప్రభుత్వం తప్పుడు కేసులు పెట్టి భయాందోళనకు గురి చేస్తున్నదని విమర్శించారు. మంద కృష్ణ మాదిగకు బెయిల్ రాకుండా ప్రభుత్వం అడ్డుకోవడాన్ని మాదిగ సమాజం గమనిస్తున్న విషయం తెలుసుకోవాలన్నారు. తెలంగాణ ఉద్యమం సమయంలో కేసీఆర్ అమరణ దీక్షకు దిగినప్పుడు ఎమ్మార్పీఎస్సే అండగా ఉన్న విషయాన్ని మర్చిపోవద్దన్నారు. మంద కృష్ణ మాదిగపై అక్రమ కేసులు పెట్టి జైల్లో పెట్టినదానికి నిరసనా రెండు తెలుగు రాష్ట్రాల్లో దీక్షలు, నిరసనలు, ఆందోళనలతో పాటు రాస్తారోకోలు కొనసాగుతున్నాయని, భవిష్యత్‌లో ఈ ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామన్నారు. వర్గీకరణ సాధన కోసం ఎమ్మార్పీఎస్ ఎంతవరకైనా పోరాటం చేస్తుందన్నారు.


చిరుత దాడిలో ఒకరికి గాయాలు



గాయపడ్డ సంతోష్

పెంబి, ప్రభ న్యూస్ : నిర్మల్ జిల్లా, అక్టోనిమాడ గ్రామంలో ఆదివారం ఉదయం గ్రామానికి చెందిన ఆత్రం సంతోష్‌పై చిరుతపులి దాడి చేసింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..అక్టోనిమాడ గ్రామానికి చెందిన సంతోష్ పొలంలో పనులు చేయడానికి వెళ్తుండగా చిరుతపులి అతనిపై దాడి చేసింది. సంతోష్ కేకలు వేయడంతో పక్క పొలంలో పని చేస్తున్న పలువురు అతనిని రక్షించి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అతను క్షేమంగానే ఉన్నాడని వైద్యులు తెలిపారు. అతనిపై దాడి చేసిన చిరుతపులి దగ్గరలోని చెట్టు తొర్రలో దాక్కుంది. విషయం తెలుసుకున్న అటవీ శాఖాధికారులు సంతోష్‌కు రూ.5 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

గినియా బిస్సావు ప్రధాని రాజీనామా



బిస్సావు: గినియా బిస్సావు ప్రధానమంత్రి ఉమరు సిస్సోకొ ఎంబలో తన పదవికి రాజీనామా చేశారు. అత్యంత పేద పశ్చిమ ఆఫ్రికా దేశంలో రెండేళ్ళ రాజకీయ సంక్షోభానికి ముగింపు పలికే ప్రయత్నంలో దేశాధ్యక్షుడు జోస్ మరియో వజ్‌కు తన రాజీనామా లేఖను సమర్పించారు. మాజీ ప్రధాని డొమింగోస్ సిమోయిస్ పెరీరాపై అధ్యక్షుడు వేటు వేసిన నాటి నుంచి అంటే 2015, ఆగస్టు నుంచి గినియా బిస్సావు అధికార సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నది. 2016, డిసెంబర్‌లో ఎంబలో ప్రధాని పదవి చేపట్టారు. నేను అధికారం కోసం వెంపర్లాడేవాడిని కాను. అధ్యక్షుడు నన్ను విశ్వసించని పక్షంలో నాకు ఉద్వాసన పలికేంతవరకు వేచి చూడను, పదవిని వీడుతాను అని రాజీనామా చేసిన అనంతరం ఎంబలో తెలిపారు. ఎంబలో రాజీనామా సమర్పణను అధ్యక్ష వర్గాలు ధృవీకరించాయి.

పార్కులు కావవి...

ప్రేమికుల విలాస కేంద్రాలు!

హైదరాబాద్, ఆంధ్రప్రభ : పార్కులు పాడు పనులకు కేరాఫ్ కేంద్రాలుగా భాసిల్లుతున్నాయి. ప్రశాంతత, ఆహ్లాదం కోసం పార్కులను సందర్శించే ప్రజలు అక్కడి కనిపించే దృశ్యాలతో పలు ఇబ్బందుల పాలవుతున్నారు. ప్రధానంగా సాయంత్రం వేళల్లోనే పార్కులకు సందర్శకుల తాకిడి ఉంటుంది. అదే సమయంలో ప్రేమపక్షులు ఎంటరవుతున్నాయి. ఇటీవలి కాలంలో సందర్శకుల కంటే ప్రేమపక్షుల సంఖ్య ఎక్కువగా ఉంటోందన్న వాదన బలంగా వినవస్తోంది. ప్రేమ పక్షులకు అనువైన విధంగా సెక్యూరిటీ గార్డులు ఉండటంతో సాయంకాలమయ్యేసరికి పార్కుల్లో ప్రేమ పక్షులు వాలిపోతున్నాయి. ఏదేని జరగరాని ఘటన జరిగితే తప్ప పార్కులవైపు నిఘా సంస్థలు దృష్టిసారించే అవకాశాలు తక్కువేనని చెబుతున్నారు. పార్కు నిర్వహణదారులు సైతం చూసీ చూడనట్లు వ్యవహరిస్తుండటంతో సెక్యూరిటీగార్డులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని తెలుస్తోంది.

భాగ్యనగరంలో ఇందిరా పార్కు, సంజీవయ్య పార్కు, దుర్గం చెరువు ప్రాంతాల్లో సాయంత్రానికి ఎక్కడెక్కడినుంచో ప్రేమపక్షులు వాలిపోయి, సినిమాల్లో కనిపించని రొమాంటిక్ సీన్లను చూపిస్తున్నాయి. సెక్యూరిటీ గార్డులు ప్రేమపక్షుల నుంచి లంచాలు తీసుకుని ఆ వైపు ఎవరూ వెళ్లకుండా చూసే బాధ్యతను చూసుకుంటున్నారని, ఇందుకుగానూ ఒక్కో జంట నుంచి రూ.500 వరకూ వసూలు చేస్తున్నారని తెలుస్తోంది. మరోవైపు పార్కులలో అసాంఘిక కార్యకలాపాలు అధికమయ్యాయని స్థానికులు పోలీస్ స్టేషన్లకు ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. అయినప్పటికీ పార్కులలో పరిస్థితి మెరుగవ్వకపోగా మరింతగా అసాంఘిక కార్య కలాపాలు చోటు చేసుకుంటుండటం గమనార్హం.

కీచక క్యాబ్ డ్రైవర్ అరెస్టు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: క్యాబ్‌లలో ప్రయాణించాలంటేనే మహిళలు జడిసిపోతున్నారు. తమ క్యాబ్‌ల్లో ఎక్కిన మహిళా ప్రయాణీకుల పట్ల కొందరు క్యాబ్ డ్రైవర్లు అనుచితంగా ప్రవర్తిస్తున్న ఘటనలు ఇటీవలి కాలంలో అధికమయ్యాయి. తాజాగా క్యాబ్‌ల్లో ప్రయాణించే మహిళా ప్రయాణీకులపై అత్యాచార యత్నానికి యత్నిస్తున్న కామాంధుడిని కుషాయిగూడ పోలీసులు అరెస్ట్ చేశారు. సికింద్రాబాద్ లాలాగూడలోని శాంతినగర్‌కు చెందిన కందుకూరి నాగ మధుకిరణ్ కొంత కాలంగా వోలా సంస్థలో క్యాబ్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. తన క్యాబ్‌లో ప్రయాణించే మహిళలను మాటలతో మభ్యపెట్టి వాహనం దారి మళ్లించి వారిపై అత్యాచారాలకు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ నెల 5న కుషాయిగూడలో ఇదే తరహాలో ఓ యువతిపై అత్యాచారయత్నం చేశాడు. సదరు క్యాబ్ డ్రైవర్ నుంచి తప్పించుకున్న బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అతడిపై నిఘా ఉంచిన పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. నిందితుడు ఇప్పటివరకు పది మంది యువతులను వేధించాడు. ఇద్దరిపై అత్యా చారం చేశాడు. పదేళ్ల బాలికను కూడా అతడు వేధించాడని పోలీసుల దర్యాప్తులో తేలింది. నిందితుడు బారినపడ్డ బాధితులు నిర్భయంగా ఫిర్యాదు చేయాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.

22న కోర్టుకు యాంకర్ ప్రదీప్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ యాంకర్ ప్రదీప్ ఈ నెల 22వ తేదీన కోర్టులో హాజరుకానున్నట్లు ట్రాఫిక్ పోలీసులకు సమాచార మందించాడు. న్యూఇయర్ వేడుకల సందర్భంగా నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్‌లో యాంకర్ ప్రదీప్ పోలీసులకు చిక్కాడు. కాగా, ఈ నెల 8న తండ్రితో కలిసి గోషామహల్ ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో కౌన్సెలింగ్‌కు హాజరయ్యాడు. సంక్రాంతి అనంతరం 16న కోర్టుకు హాజరవుతానని ప్రదీప్ పోలీసులకు సమాచారం అందించాడు. అయితే ఆ రోజున కోర్టుకు సెలవు కావడంతో 22వ తేదీకి ఆయన హాజరు వాయిదా పడింది. నాంపల్లిలోని నాలుగవ మెట్రో పాలిటన్ మెజిస్ట్రేట్ ఎదుట ప్రదీప్‌ను పోలీసులు హాజరుపర్చనున్నారు. అదే రోజు ప్రదీప్‌కు శిక్ష ఖరారు కానుంది.

డంకన్ డ్రైవ్స్‌లో మందుబాబుల న్యూట్రిక్స్

● వాలెట్ డ్రైవర్లను వాడి తప్పించుకునే యత్నం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పోలీసులకు పట్టుబడకుండా ఉండేందుకు మందుబాబులు సరికొత్త దారులు అన్వేషిస్తున్నప్పటికీ పోలీసులు అనుమానించి ఆరాతీసి సదరు మందుబాబులను పట్టేస్తున్నారు. ఇటీవలి కాలంలో డ్రంక్ అండ్ డ్రైవ్‌తో వాహనాలు నడుపుతుండటంతో పలు రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. దీంతో పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్‌ని కఠినతరం చేశారు. మద్యం తాగి రోడ్లపై వాహనాలు నడపొద్దని పోలీసులు సూచనలు చేస్తున్నా అంతకు మించి అన్న చందాన తాగి వాహనాలు నడుపుతూ పోలీసుల చేపట్టే డ్రంక్ అండ్ డ్రైవ్‌ల్లో పట్టుబడుతున్నారు. దీంతో పోలీసుల నుంచి తప్పించుకునేందుకు మందుబాబులు ఓ కొత్త ఎత్తుగడ వేశారు. అయితేనేం పోలీసులు దాన్ని వెంటనే పసిగట్టి వారి ప్లాన్ విఫలం చేవారు. మందుబాబులు వేసిన కొత్త ప్లాన్ ఏంటో తెలుసా? పోలీసులు చెకింగ్ చేస్తున్న ప్రాంతం నుంచి తప్పించుకోవడం కోసం వాలెట్ డ్రైవర్ల చేతిలో స్టీరింగ్‌ను పెట్టడం. శనివారం రాత్రి హైదరాబాద్ బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ ప్రాంతాల్లో పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారు. పబ్‌లు, క్లబ్‌ల్లో అర్థ రాత్రి వరకు పూటుగా మద్యం సేవించిన మందుబాబులు జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు సమీపంలో తనిఖీలు జరుగుతున్నాయని తెలిసింది. వెంటనే సదరు పబ్‌కు చెందిన వాలెట్ డ్రైవర్ల చేతికి స్టీరింగ్ ఇచ్చి, తాము తనిఖీలను దాటేంతవరకూ దాటించమని చెప్పారు. వారు చెప్పిన విధంగానే వాలెట్ డ్రైవర్లు కూడా అలానే చేశారు. జూబ్లీహిల్స్ దాటగానే బంజారాహిల్స్ ప్రాంతంలోనూ తనిఖీలు సాగుతున్నాయి. అయితే అక్కడ డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు జరుగుతున్నాయని తెలుసుకోలేని మందుబాబులు అడ్డంగా దొరికిపోయారు. ముందు తనిఖీలు జరుగుతుండగా, అక్కడ పట్టుబడకుండా తమ వద్ద పట్టుబడటం ఏంటన్న అనుమానం బంజారా హిల్స్ పోలీసులకు వచ్చింది. వెంటనే విషయం ఆరాతీస్తే ఈ వాలెట్ డ్రైవర్ల విషయం బయటపడింది. దీంతో మొత్తం ఆరుగురు వాలెట్ డ్రైవర్లపై పోలీసులు కేసులు పెట్టారు. శనివారం రాత్రి 40కి పైగా కార్లు, బైకులను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసు వర్గాలు వెల్లడించాయి.

ఐపీ అడ్రసులు ఇవ్వం

● ఫేస్‌బుక్‌పై ఎంహెచ్ఏకు సీఐడీ అధికారుల ఫిర్యాదు




హైదరాబాద్, ఆంధ్రప్రభ : ప్రముఖ సామాజిక మాధ్యమ సంస్థ ఫేస్‌బుక్‌కు, రాష్ట్ర పోలీసులకు మధ్య కోల్డ్ వార్ మొదలైంది. ప్రముఖులను కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేయడం, వాటిపై పోలీసులకు ఫిర్యాదు రావడం, దర్యాప్తు జరిపి దోషులను గుర్తించడం పరిపాటి. అసభ్య, కించపరిచే విధంగా వ్యాఖ్యలను పోస్ట్ చేసిన వారిని గుర్తించే విషయంలో రాష్ట్ర పోలీసులకు ఫేస్‌బుక్ సహకరించకపోవడంతో ఈ వార్ మొదలైంది. కొన్నాళ్ల క్రితం తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావుపై కొంత మంది అనుచిత వ్యాఖ్యలను ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేశారు. దీనిపై నగరంలోని ఛాదర్‌ఘాట్ పోలీసుస్టేషన్‌తో సహా మరిన్ని పోలీసుస్టేషన్లల్లో ఫిర్యాదులు అందడంతో కేసులను నమోదు చేశారు. ఇదే తరహా ఆరోపణలతో నిజామాబాద్ ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా పని చేస్తున్న ఒక ఉద్యోగిపై కూడా అక్కడి పోలీసులు కేసును నమోదు చేసి చర్యలు తీసుకున్నారు.


హైదరాబాద్‌లోని వేర్వేరు పోలీసు స్టేషన్‌లలో కెసిఆర్‌పై ఫేస్‌బుక్ వేదికగా పోస్ట్ అయిన వ్యాఖ్యలపై విచారణను నగర నేర పరిశోధన (సిసిఎస్)కు అప్పగించారు. ఫేస్‌బుక్‌ల ఐపి నంబర్లను ఇవ్వాలంటూ కొన్నాళ్ళుగా సిసిఎస్ అధికారులు ఫేస్‌బుక్‌కు లేఖలు రాస్తున్నా ప్రయోజనం కనిపించలేదు. వాస్తవానికి ఏ వ్యక్తి ఏ ఐపి నంబర్‌ను వినియోగించుకుంటున్నారన్న అంశం ఆయా ఇంటర్నెట్ సంస్థలకు మాత్రమే తెలుస్తోంది. అయితే పోలీసులు, దర్యాప్తు సంస్థలు కోరిన వెంటనే ఆయా సంస్థలు ఐపి చిరునామాలను తెలియజేయాల్సి ఉంటుంది. కానీ ఇందుకు భిన్నంగా ఫేస్‌బుక్ సంస్థ వ్యవహరించడం, అదీ ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తిపై వెల్లడైన వ్యాఖ్యానాలపై దర్యాప్తు జరిపే సంస్థకు ఇచ్చేందుకు నిరాకరించడంపై ఉన్నతాధికారులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.ఈ విషయాన్ని సిసిఎస్ అధికారులు సిఐడి అధికారులకు కూడా చెప్పి వారి ద్వారా ప్రయత్నించినా ఫలితం కనిపించలేదు. దీంతో ఫేస్‌బుక్ నిర్లక్ష్యంపై సిఐడి, సిసిఎస్ పోలీసులు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ (ఎంహెచ్ఏ)కు ఫిర్యాదు చేశారు. సాక్షాత్తు ముఖ్యమంత్రిపై అనుచిత వ్యాఖ్యలు పోస్ట్ చేసిన అంశంపై ఫిర్యాదులు వచ్చాయని, ఫేస్‌బుక్ నిరాకరణ వల్ల కేసు విచారణ పురోగతి లేకుండా పోయిందని ఎంహెచ్ఏకు రాసిన లేఖలో అధికారులు వివరించారు.

ఫేస్‌బుక్ గతంలోనూ పలు కేసులలో తమతో ఇదే ధోరణిని ప్రదర్శించిందని, దీంతో కొన్ని కేసులు ఇప్పటికీ అపరిష్కృతంగానే ఉన్నాయని అధికారులు పేర్కొంటున్నారు. కొన్ని సందర్భాలలో ఇంటర్నెట్ సంస్థలు కూడా ఇలానే వ్యవహరిస్తున్నాయని వారు వివరించారు. నిబంధనల ప్రకారం సామాజిక మాధ్యమాల నిర్వహణ సంస్థలన్నీ వ్యక్తిగత గోప్యతను తప్పనిసరి పాటించాల్సి ఉందని, ఇదే సమయంలో దర్యాప్తు సంస్థలు అధికారికంగా అడిగినపుడు వ్యక్తిగత సమాచారాన్నిఅందించాల్సి ఉంటుందని పేర్కొంటున్నారు.

ఫేస్‌బుక్ లాంటి సామాజిక మాధ్యమ సంస్థ ఈ విషయంలో నిబంధనలను ఉల్లంఘించి వ్యవహరించడం తమకు ఆశ్చర్యం కలిగిస్తుందని వారు అంటున్నారు. ఇప్పటికైనా పేస్‌బుక్ యాజమాన్యం తామడిగిన సమాచారాన్ని ఇస్తుందని, భవిష్యత్‌లో తమకు పూర్తిగా సహకరిస్తుందని భావిస్తున్నామని, లేకపోతే ఆ సంస్థపై చట్ట ప్రకారం చర్యలు తీసుకునే విషయాన్ని పరిశీలిస్తామని అధికారులు స్పష్టం చేశారు.



ఆన్‌లైన్‌లో మందులు.. డిస్కౌంట్ల పేరుతో మోసాలు



హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఆన్‌లైన్‌లో తక్కువ ధరలో మెడిసిన్ అంటూ పలు కంపెనీలు పోటాపోటీగా ప్రకటనలు గుప్పిస్తున్నాయి. ఇది చూసిన పలువురు రోగులు డిస్కౌంట్ ఎక్కువగా వస్తుండడంతో పాటు ఇంటికి మందులను డెలివరి చేస్తుండడంతో ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేస్తున్నారు. మందులు డెలివరి ఇచ్చేటప్పుడు వారు అందులో కొన్ని నాసిరం మందులను వినియోగదారులకు అంటగడుతున్నారు. ఇది తెలియని రోగి డూప్లికేట్ మందులను వాడి అనవసర ఇబ్బందులను కొని తెచ్చుకుంటున్నారు. ఆన్‌లైన్‌కు తోడు మామూలు మెడికల్ షాపులో అమ్మే మందులు కూడా నాసిరకమే అని ఓ సర్వేలో తేలింది. మెడికల్ షాపులకు పర్మిషన్ ఇచ్చే డ్రగ్ కంట్రోలర్ అధికారులు ఎప్పుడు కూడా తనిఖీచేసిన పాపాన పోవడం లేదు. ఆన్‌లైన్ అమ్మకాలపై వారికి ఫిర్యాదులున్నా అసలు పర్మిషన్ వాటికి ఎవరు ఇవ్వాలన్న క్లారిటీ లేని స్థితిలో ఉన్నారు. రోగులను ఆకర్షించడానికి మెడికల్ షాపులవారు పోటాపోటీగా డిస్కౌంట్లను ఇవ్వడంతో పలు అక్రమాలు జరుగుతున్నాయి. బిజినెస్ పెంచే ప్రయత్నంలో కొందరు డూప్లికేట్ మందులను అసలు మందులతో పాటు అమ్ముతున్నట్టు పలువురు ఆరోపిస్తున్నారు. దీనివల్ల ఒరిజినల్ మందులను అమ్మే షాపుల బిజినెస్ దెబ్బతింటుందని మెడికల్ షాపుల యజమానులు వాపోతున్నారు. డాక్టర్ మెడికల్ చీటి లేకున్నా ఆన్‌లైన్‌లో మందులను డెలివరీ చేస్తున్నారు. మెడికల్ షాపు వాళ్లు డాక్టర్ రాసే మందుల చీటి లేకున్నా మందులను అమ్ముతున్నారు. అధికారుల పర్యవేక్షణ కొరవడడంతోనే వ్యవస్థ ఇలా తయారయ్యిందని నిపుణులు ఆరోపిస్తున్నారు.

డ్రగ్ కంట్రోల్ అధికారులకు క్లారిటీ లేదు

ఆన్‌లైన్‌లో మందులను అమ్మడానికి పర్మిషన్ ఎవరు ఇవ్వాలన్న దానిపై డ్రగ్ కంట్రోల్ అధికారులకు క్లారిటీ లేదు. ఇదే అదునుగా కొందరు తమ బిజినెస్‌ను మూడు పువ్వులు ఆరు కాయలుగా కానిచ్చేస్తున్నారు. ఆన్‌లైన్ మందులు కొనేవారికి అవి ఒరిజినలా డూప్లికేటా అనే విషయం తెలియని పరిస్థితిలో ఉన్నారు. ఈ మధ్యన ఓ రోగి మందులు తక్కువగా వస్తున్నాయన్న ఆశతో మందులకు ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేశాడు. ఆ కంపెనీ వారు అతనికి డోర్ డెలివరి చేశారు. అనంతరం ఆ ట్యాబ్‌లెట్ వాడిన రెండు రోజుల్లోనే అతను కోమాలోకి వెళ్లాడు. అప్పుడు అతని కుటుంబ సభ్యులు ఎవరిపై ఫిర్యాదు చేయాలో అర్థం కాలేదు. వీరికి మందుల సరఫరా చేసిన కంపెనీయొక్క కార్యాలయం చిరునామా తప్పుగా తేలింది. ఇలా తప్పుడు చిరునామాలతో ఆన్‌లైన్ అమ్మకాలు సాగిస్తూ అధికారులు, రోగులను ముప్పు తిప్పలు పెడుతున్నారు. కొందరు డ్రగ్ కంట్రోలర్ అధికారులకు ఫిర్యాదు చేసినా అది తమ పరిధికి వస్తుందా లేదా అన్న విషయంపై సందిగ్ధంలో ఉన్నారు. ఇలాంటి కొన్ని బయటకు వచ్చినా మరికొన్ని బయటకు రాని పరిస్థితి నెలకొంది. మామూలుగా షాపులో ట్యాబ్‌లెట్లను తీసుకుంటే ఆ షాపుకు వెళ్లి అడిగే పరిస్థితి ఉంటుంది. దీంతో పాటు జనరిక్ మందుల షాపు పేరుతో మందుల షాపు నడిపించే కొందరు పర్మిషన్ లేని అసలు పేరు ఊరు లేని మందులను అమ్ముతున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

మెడికల్ షాపులకు దెబ్బమీద దెబ్బ

ఆన్‌లైన్లో మందుల సరఫరాతో మెడికల్ షాపుల యజమానులు కుదేలవుతున్నారు. అసలే పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న షాపులతో వ్యాపారం సరిగ్గా కాక ఇబ్బందులు పడుతుంటే మధ్యలో ఆన్‌లైన్ వ్యాపారం మరింత ఇబ్బంది కలుగుజేస్తుందని వారు వాపోతున్నారు. ఈ విషయమై డ్రగ్ కంట్రోల్ అధికారులు పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చాలా మందుల షాపుల వారు డూప్లికేట్ మందులను అమ్ముతూ రోగులను పక్కదారి పట్టిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మెడికల్ షాపులకు అధికారులు పర్మిషన్ ఇవ్వడం తప్ప అనంతరం పట్టించుకోవడం లేదని వారు విమర్శిస్తున్నారు. మందుల షాపులను ఎప్పటికప్పుడు తనిఖీ చేయాల్సిన డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు కొందరు అవినీతి అలవాటు పడి అటు వైపు కూడా తొంగిచూడడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. చాలామంది దగ్గర సర్టిఫికెట్ లేకున్నా వేరే వాళ్ల సర్టిఫికెట్‌ను అద్దెకు తీసుకొని మెడికల్ షాపును నిర్వహిస్తున్నారు. వారికి మందుల పేర్లు కూడా తెలియని పరిస్థితి నెలకొంది. కనీసం అవగాహన ఉందా లేదా అన్న దానిపై ప్రారంభంలోనే డ్రగ్ కంట్రోలర్ అధికారులు తనిఖీ చేయాల్సిన అవసరం ఉందని వారు సూచిస్తున్నారు.

మన ఔషధాలు కూడా నాసిరకమే..

ప్రస్తుతం మనం వాడుతున్న మందుల్లో ఔషధ గుణాలు నాసిరకంగా ఉంటున్నాయని పలు సర్వేలో తేలింది. ఈ మందులు వాడిన వారి చేతిచమురు వదులుతుంది తప్ప రోగం తక్కువ కావడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. ఎక్కువగా షుగర్, బీపీకి సంబంధించిన మందుల్లో నాణ్యత కొరవడిన మందులను అమ్ముతున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. తెలంగాణ సర్కారు వైద్యంలో 12.57 శాతం నాసిరకం మందులను అమ్ముతున్నట్టు తేలింది. చిల్లర వర్తకంలోనూ ఈ వెూసం ఎక్కువగా జరుగుతున్నట్టు తేలింది. ఉత్పత్తి నుంచి వినియోగం వరకు మొత్తం నాసిరకంగానే మందులను తయారు చేస్తున్నట్లు ప్రభుత్వ పరిశోధనలో వెల్లడయ్యింది. మధుమేహం, బీపీ, కోలస్ట్రాల్ తదితర మందలే ఎక్కువగా నాసిరకంగా ఉంటున్నాయని తేలింది. తెలంగాణలో 2.90 శాతం, ఆంధ్రప్రదేశ్‌లో 3.84 శాతం మందుల్లో నాణ్యత కొరవడిందని ఓ సర్వేలో తేలింది. ఇక యాంటీ బయాటిక్స్ మందుల గురించి చెప్పలేమని ఆ సర్వే రిపోర్టు పేర్కొంది.

ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించాలి

ఔషధాల కొనుగోలుకు ముందే ఆయా సంస్థలు పాటిస్తున్న నాణ్యతా ప్రమాణాలపై తనిఖీలు నిర్వహించాలి. కానీ వాటి గురించి అధికారులు పట్టించుకోవడం లేదు. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తున్నట్టు నిర్ధారణ అయిన తరువాతే ఔషధ తయారీకి అనుమతివ్వాలి. ఔషధాలను ఎప్పటికప్పుడు జాతీయ గుర్తింపు పొందిన ప్రయోగశాలల్లో పరీక్షించాలి. ఫార్మాసిస్టులకూ ఔషధాలను నిల్వ చేయడంపై శిక్షణ ఇప్పించాలి. ఔషధ సరఫరా వ్యవస్థను సమగ్రంగా పర్యవేక్షించాలి. ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించే ప్రయోగశాల సంఖ్యను పెంచాలి. నాణ్యతా ప్రమాణాల తనిఖీ వ్యవస్థను పటిష్టం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

Andhraprabha business 2018
బిజినెస్ BUSINESS

అమెజాన్‌లో 6,500 తాత్కాలిక కొలువులు

• 20 నుంచి 24 వరకు మెగా సేల్



న్యూఢిల్లీ : ఈ- కామర్స్ దిగ్గజం అమెజాన్ ఈ నెలాఖరులో ప్రారంభించ బోతోన్న మెగా సేల్ ఆఫర్ సందర్భంగా తాత్కాలికంగా 6,500 మందిని ఉద్యోగాల్లోకి తీసుకోబోతోంది. వారిలో 5,500 మందిని వివిధ పనులకు నియమించుకోవడం జరుగుతుంది. ఈ మెగాసేల్ ఈ నెల 20-24 వరకు కొనసాగుతోంది. కంపెనీ నెట్‌వర్కులోని ఫుల్‌ఫిల్‌మెంట్ సెంటర్స్, సార్టేషన్‌సెంటర్లు, డెలివరీ సెంటర్‌లలో వారిని నియమిస్తున్నట్లు అమెజాన్ వైస్ ప్రెసిడెంట్ (కస్టమర్ ఫుల్‌ఫిల్ మెంట్) అఖిల్ సక్సేనా చెప్పారు. కస్టమర్ల డిమాండ్‌ను బట్టి మరో 1,000 మంది అసోసియేట్స్‌లను కూడా నియమించుకుంటామని సక్సేనా పేర్కొన్నారు. దేశంలోని పలు మెట్రోల్లో వీరిని తీసుకోవడం జరుగుతుంది. వాటిలో హైదరాబాద్, బెంగళూరు కూడా ఉన్నాయి. కాగా దేశీయ ఈ-కామర్స్ మార్కెట్లో ఫ్లిప్‌కార్ట్‌తో అమెజాన్ డాట్ కామ్ గట్టిపోటీని ఎదుర్కొంటోంది. కాగా అమెజాన్ తమ నెట్‌వర్కును మరింత విస్తరించుకుంటూపోతోంది. దీని కోసం పెద్దమొత్తంలో పెట్టుబడులు పెడుతోంది. ప్రస్తుతం 41 ఫుల్‌ఫిల్‌మెంట్ సెంటర్‌లు (గిడ్డంగులు) 25 సార్టేషన్ సెంటర్లకు 150 డెలివరీ సెంటర్లు, 350 సర్వీసు పార్టనర్ స్టేషనలతో దేశవ్యాప్తంగా విస్తరించి ఉన్నాయి. ఈ సెంటర్ల నుంచి ప్యాకింగ్, షిప్పింగ్, డెలివరీలు చేయాల్సి వస్తుంది. దేశంలోని 12 నగరాల్లో 13 కస్టమర్ సర్వీస్ సెంటర్‌లున్నాయి. కాగా భారత్ మార్కెట్లో అమెజాన్ పెద్దెత్తునతమ వ్యాపారాన్ని విస్తరించుకునేందుకు 500 కోట్ల డాలర్లు పెట్టుబడులు పెడుతోంది.

రూ.లక్ష కోట్ల శత్రువుల ఆస్తుల వేలం

న్యూఢిల్లీ : దేశ విభజన సందర్భంగా భారత్ నుంచి విదేశాలకు తరలిపోయిన వారు ఉదాహరణకు కొంత మంది పాకిస్తాన్, చైనాల్లో పౌరసత్వం తీసుకున్నారు. అలాంటి వారి ఆస్తులు దేశవ్యాప్తంగా 9,400 వరకు ఉంటాయని, వాటి విలువ సుమారు రూ.1 లక్షల కోట్ల వరకు ఉంటాయని ప్రభుత్వం భావిస్తోంది. హోంమంత్రిత్వశాఖ త్వరలోనే ఈ ఆస్తులు ఎక్కడెక్కడ ఉన్నాయో గుర్తించి వాటిని వేలం వేయాలనే ఆలోచనలో ఉంది. 49 సంవత్సరాల అతి పురాతన 'ఓల్డ్ ఎనమీ ప్రాపర్టీ (సవరణ మరియు వ్యాలిడేషన్)చట్టం ప్రకారం దేశ విభజన తర్వాత దేశం నుంచి పాకిస్తాన్, చైనాకు వలస వెళ్లిన వారు... అటు తర్వాత ఈ ఆస్తులపై ఎవరూ వారసులు ముందుకు రాని ఆస్తులను గుర్తించి వేలం వేస్తారు. ఇటీవల కేంద్ర హోంశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ఒక సమావేశంలో మాట్లాడుతూ.. శత్రువు ఆస్తుల సర్వే కింద ఇప్పటి వరకు 6289 ఆస్తుల సర్వే పూర్తి చేయడం జరిగిందని.. ఇంకా 2,991 ఆస్తులపై సర్వేలు కొనసాగుతున్నాయని హోంమంత్రిత్వశాఖ అధికారులు తెలిపారు. ఈ ఆస్తులపై ఎలాంటి చిక్కులు లేవని తేలితే వాటిని వీలైనంత త్వరగా వేలం వేసి సొమ్ము చేసుకోవాలనుకుంటున్నట్లు చెప్పారు. దేశవ్యాప్తంగా ఇలాంటి ఆస్తులు 9,400 వరకు ఉన్నాయని.. వాటి విలువ రూ.1 లక్ష వరకు ఉంటుందని ఆయన అన్నారు. రాష్ట్రస్థాయిలో నోడల్ అధికారులను నియమించి శత్రువు ఆస్తులు ఎక్కడెక్కడ ఉన్నాయో గుర్తిస్తామని ప్రభుత్వ అధికారులు చెబుతున్నారు. మొత్తం 9,280 ఆస్తుల్లో అత్యధికంగా పాకిస్తాన్‌కు చెందిన వారి ఆస్తులు 4,991గా తేలాయి. అవి ఉత్తరప్రదేశ్‌లో ఉన్నాయి. అటు తర్వాత పశ్చిమబెంగాల్‌లో 2735 ఆస్తులు, ఢిల్లీలో 487 ఆస్తులున్నట్లు తేలింది. 126 ఆస్తులు చైనీయులవి ఉన్నాయి. వాటిలో మేఘాలయాలో అత్యధికంగా 57, పశ్చిమ బెంగాల్‌లో 29, అస్సాంలో 7 వరకు ఉన్నాయి. 1965లో ఇండో-పాకిస్తాన్ యుద్ధం తర్వాత ఎనిమీ ప్రాపర్టీ యాక్ట్ 1968లో తీసుకొచ్చారు. కాగా రాజా మహమ్మద్ అమీర్ మహ్మద్ ఖాన్‌ను రాజా ఆఫ్ మహబూబాబాద్ బాగా ప్రసిద్ధి చెందారు. ఆయనకు ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్‌లో పెద్దమొత్తంలో ఆస్తులున్నాయి. దాని తామే వారసులమని చాలా ముందుకు రావడంతో ప్రభుత్వం ఈ చట్టాన్ని తీసుకొచ్చింది.



ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ సూచీపై ప్రపంచ బ్యాంక్ సమర్థన


• ఖచ్చితమైన గణాంకాలతోనే రేటింగ్

న్యూఢిల్లీ : ప్రపంచబ్యాంకు ఇచ్చే ఈజ్ ఆఫ్ డూయింగ్ సూచిపై పలువురు ఆర్థికవేత్తలు అనుమానాలు వ్యక్తం చేశారు. ప్రపంచబ్యాంకు పక్షపాతంతో ఏ దేశానికి ర్యాంకు ఇవ్వదని.. ఖచ్చితమైన గణాంకాలను పరిగణనలోకి తీసుకొనే ర్యాంకు ఇవ్వడం జరుగుతుందని ప్రపంచబ్యాంకు ప్రధాన ఆర్థికవేత్త పాల్ రోమర్ శుక్రవారం నాడు ది వాల్‌స్ట్రీట్ జనరల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ చెప్పారు. ప్రపంచబ్యాంకు ఫలానా దేశాలకు ర్యాంకు ఇవ్వడానికి ఈజ్ ఆఫ్ డూయింగ్ ర్యాంకు ఇవ్వడానికి తీసుకునే గణాంకాలను ఆయా దేశాలకు అనుకూలంగా మార్చినట్లు వచ్చిన వార్తలను ఆయన తోసి పుచ్చారు. ప్రపంచబ్యాంకు గత నాలుగు సంవత్సరాల నుంచి ర్యాంకులు ఇస్తోందని.. ర్యాంకు ఇచ్చే ముందు పలుమార్లు ఒకటికి పలు మార్లు అధ్యయనం చేసి ర్యాంకు ఇవ్వడం జరుగుతోందన్నారు. అన్నీ దేశాలను సమానంగా చూస్తామని ఆయన అన్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ ర్యాంకును ఇచ్చే ముందు ఏదో ఒక దేశాన్ని పరిగణనలోకి తీసుకొని ర్యాంకు ఇవ్వడం జరగదన్నారు. ఇక్కడ రోమర్ విషయానికి వస్తే చిలీ ర్యాంకుపై అనుమానాలు వ్యక్తం అయ్యాయి. అయితే భారత్ గురించి ఎలాంటి పేచీ లేదు. మొత్తం 190 దేశాల ర్యాంకుల్లో భారత్ ఏకంగా 30 ర్యాంకులు ముందుకు వచ్చి 100 స్థానాన్ని దక్కించుకుంది. కాగా భారత్ విషయానికి వస్తే ఇప్పటికే పలుసంస్కరణలు తీసుకొచ్చింది. వాటలో ప్రధానంగా చెప్పుకోవాలంటే వ్యాపారం చేసుకోవడానికి నిబంధనలు సడలించింది. అలాగే రుణాలు తేలిగ్గా అందుబాటులో ఉంచింది. పన్ను చెల్లింపుల నుంచి దివాలా చట్టాన్ని తీసుకురావడం భారత్‌కు బాగా కలిసొచ్చింది.

రైతులకు ఫలాలందితేనే.. జీడీపీ వృద్ధిరేటుకు సార్థకం!

• ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ

• వ్యవసాయానికి పెద్దపీట



న్యూఢిల్లీ : వచ్చే బడ్జెట్ 2018-19లో కేంద్రప్రభుత్వం వ్యవసాయరంగానికి పెద్దపీత వేస్తుందని ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ స్పష్టం చేశారు. ఎందుకంటే దేశ ఆర్థికవ్యవస్థ వృద్ధి ఫలాలు రైతులకు దక్కకుంటే వృద్ధిరేటు పెరిగినా ఎలాంటి ప్రయోజనం లేదని ఆయన అన్నారు. అందుకే వచ్చే బడ్జెట్‌లో రైతులకు ప్రయోజనం కలిగించేందుకు వ్యవసాయరంగానికి అత్యధికంగా ప్రాముఖ్యత ఇస్తున్నట్లు జైట్లీ ఆదివారం ఇక్కడ జరిగిన ఒక కార్యక్రమంలో మాట్లాడుతూ చెప్పారు.

కేంద్ర గణాంకాల కార్యాలయం తాజాగా విడుదల చేసిన గణాంకాల ప్రకారం .. దేశ ఆర్థిక వ్యవస్థ ఈ ఆర్థిక సంవత్సరం 2017-18లో నాలుగేళ్ల కనిష్టానికి 6.5శాతానికి దిగివస్తుందని అంచనా వేసింది. కేంద్రంలో మోడీ ప్రభుత్వం పగ్గాలు చేపట్టిన తర్వాత అతి తక్కువ వృద్ధిరేటు ఇదే. దీనికి కారణం వ్యవసాయరంగంతో పాటు తయారీరంగం బాగా వెనకబడిపోవడమే.

కేంద్ర గణాంకాల కార్యాలయం లేదా (సీఎస్‌ఓ) అంచనా ప్రకారం వ్యవసాయం దాని అనుబంధ రంగాలు ఈ ఆర్థిక సంవత్సరం 2.1శాతం వృద్ధి నమోదు చేయవచ్చునని... అంతకు ముందు ఏడాది ఇదే కాలంలో 4.9 శాతంగా నమోదైందని తేల్చి చెప్పింది. ప్రస్తుతం భారత ఆర్థిక వ్యవస్థ ప్రపంచంలోనే శరవేగంగా దూసుకుపోతోంది.. వృద్ధిరేటు పుంజుకోవడంతో వివిధ రంగాలకు చెందిన ప్రజలు లబ్ది పొందుతున్నారు.

దేశ జనాభాలో మెజారిటీ ప్రజలు వ్యవసాయరంగంపై ఆధారపడిజీవిస్తున్నారు. ఈ అభివృద్ధి ఫలాలు రైతులకు దక్కకుంటే వృద్ధిరేటు పెరిగి ప్రయోజనం ఏమిటని జైట్లీ ఎన్‌సీడీఈఎక్స్ కమాడిటీ ఎక్స్ఛేంజీలో గోధుమ విత్తనాల ట్రేడింగ్ ఆప్షన్ ప్రారంభిస్తూ ప్రశ్నించారు.

తమ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇచ్చే రంగాల గురించి ప్రస్తావిస్తూ.. జైట్లీ.. వ్యవసాయరంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తామని.. ఆర్థిక వ్యవస్థ వృద్ధిఫలాలు వ్యవసాయరంగానికి దక్కితేనే వృద్ధిరేటు సార్థకత చేకూరుతుందన్నారు.

వ్యవసాయరంగంలో కొన్ని చోట్ల ఎదుర్కొంటున్న ఇబ్బందులను గురించి ప్రస్తావిస్తూ.. కొన్ని చోట్ల పంట దిగుబడి పెరిగిపోవడంతో ధరలు బాగా తగ్గిపోతున్నాయని, దీంతో రైతులకు తమ పంటపై న్యాయమైన ధర లభించడం లేదని అన్నారు. రైతుల ఇబ్బందులను గమనించి తమ ప్రభుత్వం గత కొన్ని సంవత్సరాల నుంచి కొన్ని చర్యలు తీసుకుందన్నారు. దాని ప్రభావం కొంచెం కనిపిస్తోందన్నారు. దేశానికి సేవలు అందించడంలో రైతులు గణనీయమైన పాత్ర పోషిస్తున్నారని.. దేశంలో ఆహార కొరతరాకుండా కష్టపడి పంట పండిస్తున్నారని.. ప్రస్తుతం ఆహారం నిల్వలు పుష్కలంగా ఉండటానికి రైతులే కారణమని ... అధిక దిగుబడితో ధరలు పడిపోతున్నాయని ఆయన వివరించారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని రైతుల ప్రయోజనం కోసం ప్రభుత్వం కొత్తగా ఆప్షన్ ట్రేడింగ్‌ను ప్రారంభించిందన్నారు. ప్రస్తుతం ఆప్షన్ ట్రేడింగ్ చిన్న అంశంగానే కనిపించినా.. రాబోయే రోజుల్లో రైతులకు దీనిపై అవగాహన కలుగుతుందని.. దీంతో రైతులు లబ్ధి పొందుతారని జైట్లీ వివరించారు.

ఎన్‌సీడీఈఎక్స్ ఎక్స్ఛేంజీ ప్రారంభం : గతేడాది అక్టోబర్ 2017లో ఎంసీఎక్స్ ఎక్స్ఛేంజీ ప్రారంభమయ్యింది. ఈ ఎక్స్ఛేజీలో గోల్డ్ ఆప్షన్ ట్రేడింగ్ జరుగుతోంది. తాజాగా రెండవ ఎక్స్ఛేజీ ఎన్‌సీడీఎక్స్ ఎక్స్ఛేంజీ ఈ ఎక్స్ఛేంలో మొట్టమొదటిసారి గోధుమ విత్తనాలు, ఆగ్రి కమాడిటీ ఆప్షన్‌లు జరుగుతాయి. ఎన్‌సీడీఈఎక్స్ ఎక్స్ఛేజీల్లో కొనుగోలు దారులు.. అమ్మకం దారుడు తమ ఉత్పత్తులను ఫలానా తేదీలో ఫలానా ధరకు విక్రయించుతామని ఒప్పందం కుదర్చుకోవచ్చు.. అయితే ఆ ఫలానా రోజు సరకు కొనుగోలు చేయాలనే నిబంధన ఉండదు.

ఎన్‌సీడీఈఎక్స్ ఎక్స్ఛేంజీవల్ల రైతులకు రాబోయే రోజుల్లో లబ్ది చేకూరుతుందని జైట్లీ ఎక్స్ఛేంజీని ప్రారంభించిన తర్వాత మాట్లాడుతూ అన్నారు. ఈ సందర్భంగా ఎన్‌సీఈఎక్స్ ఎండీ, సీఈవో సమీర్ షా మాట్లాడుతూ.. ఆప్షన్ టూల్ అనే శక్తిమంతమైన టూల్ అని .. వ్యవసాయ కమాడిటీ మార్కెట్ బలోపేతం అవుతుందని ఆయన అన్నారు. ఆప్షన్స్ వల్ల రైతులకు ధర తగ్గినప్పుడు.. తమ ఉత్పత్తులను ఎక్కువ ధరకు విక్రయించుకొని బయటపడవచ్చునని ఆయన అన్నారు. ఎన్‌సీడీఎక్స్ ఎక్స్ఛేంజీ ఫ్లాట్‌పాం ద్వారా సుమారు 15 లక్షల మంది రైతులకు అనుబంధం ఉందన్నారు. రాబోయే రోజుల్లో మరింత మంది రైతులువస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. వచ్చే బడ్జెట్‌లో ఆర్థికమంత్రి వ్యవసాయరంగాన్ని బలోపేతం చేయడానికి కొన్ని నిర్ణయాలు తీసుకుంటారని ఆశిస్తున్నామని ఎన్‌సీడీఎక్స్ చైర్మన్ రబి నారాయణదాస్ అన్నారు.

ఈ కార్యక్రమానికి నీతి ఆయోగ్ సభ్యుడు రమేశ్ చంద్, నాఫెడ్ మేనేజింగ్ డైరెక్టర్ సంజీవ్‌కుమార్ చద్దాతో సీనియర్ ఆర్థికమంత్రిత్వశాఖ, సెబి అధికారులు పాల్గొన్నారు. ఎన్‌సీడీఎక్స్‌లో మూడు ఆప్షన్ కాంట్రాక్టు మొదలైంది. ఫిబ్రవరిలో గోధుమ విత్తనాల కాంట్రాక్టు ముగిస్తుంది. ప్రస్తుతం మార్చి, ఏప్రిల్ ట్రేడింగ్‌ను అందుబాటులో ఉంచింది. ఇదిలా ఉండగామార్కెట్ నియంత్రణా సంస్థ సెబి సెప్టెంబర్ 2016లో ఎన్‌సీడీఈఎక్స్‌కు ఆప్షన్ ఎక్స్ఛేంజీకి అనుమతించింది. గత ఏడాది ఏప్రిల్ 26, 2017న ఆప్షన్ సెటిల్మెంట్‌కు సెబి ఆమోదం తెలిపింది.

ఎయిరిండియా ఉద్యోగులకు వీఆర్ఎస్?

• సంస్థలో 29 వేల మంది ఉద్యోగులు • కంపెనీ అప్పులు రూ. 50వేల కోట్లపై చిలుకే



న్యూఢిల్లీ : ఎయిర్‌ఇండియాలో ప్రభుత్వం పెట్టు బడుల ఉపసంహరణకు పక్కాగా నిర్ణయం తీసు కుంది. అయితే ప్రస్తుతం సంస్థలో పనిచేస్తున్న 29వేల మందిని ఎలా సర్దుబాటు చేయాలో అందుబాటులో ఉన్న అన్నీ అంశాలను పరిగణనలోకి తీసుకుం టోంది. అవకాశం ఉంటే ఉద్యోగులను ఉన్న ఉద్యోగంలోనే కొనసాగించడం, లేదా స్వచ్ఛంద పదవీ విరమణ (వీఆర్ఎస్) ప్యాకేజీ ఇచ్చి ఇంటికి పంపడమా? అనే ఆలోచనలో ప్రభుత్వం ఉంది.

కేంద్రప్రభుత్వం గత వారం ఎయిర్ ఇండియా లో 49శాతం వాటాలను విదేశీ ఎయిర్ లైన్స్‌కు విక్రయించాలని నిర్ణయించిన విషయం తెలసిందే. కాగా ఎయిర్‌ఇండియా ప్రస్తుతం రూ.50వేల కోట్ల అప్పులతో కునారిల్లుతోంది. కాగా ప్రజలుచెల్లించే పన్నులతో భారంగా నడుస్తోంది. ఇదిలా ఉండగా ప్రభుత్వం ఎయిర్ ఇండియాలో పనిచేసే ఉద్యోగులను ఇతర పీఎస్‌యు కంపెనీల్లో సర్దుబాటు చేసే ఆలోచనలో కూడా ఉంది. విశ్వసనీయవర్గాల సమాచారం ప్రకారం ప్రభుత్వం వీఆర్ఎస్ ప్యాకేజీ గురించి ఆలోచిస్తోందని.. ఇంకా దీనిపై తుది నిర్ణయం తీసుకోలేదని చెబుతున్నారు. ఉద్యోగుల ప్రయోజనాలను కాపాడేందుకు అందు బాటులో ఉన్న అన్నీ అంశాలను పరిశీలిస్తున్నామని పౌర విమానయాన కార్యదర్శి ఆర్‌ఎన్ చౌబే మీడియాతో చెప్పారు. ఎయిర్‌ఇండియాలో వాటాల విక్రయంపై గ్రూపు ఆఫ్ మినిస్టర్ విధివిధానాలను రూపుదిద్దుతోంది.

త్వరలోనే బిడ్డంగ్‌లను ఆహ్వానించే అవకాశాలు కనిపిస్తున్నాయి. అయితే ఎయిర్ ఇండి యాకు చెందిన వివిధ ట్రేడ్ యూనియన్‌లు దీన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ఈ నెల 10న ప్రభుత్వం ఎయిర్‌ఇండియాలో విదేశీ ఎయిర్‌లైన్స్‌కు 49 శాతం వాటాలు కొనుగోలు చేయడానికి అనుమతించింది. దీనికి కొన్ని షరతులు విధించింది. అయితే యాజమాన్యం బాధ్యతలు మాత్రం ఎయిర్‌ఇండియాలో చేతిలో కొనసాగుతాయి. ఇదిలా ఉండగా పార్లమెంటరీ ప్యానెల్ మాత్రం ఎయిర్‌ఇండియాను తిరిగి గాడిలో పెట్టానికి ఐదు సంవత్సరాల గడవు ఇవ్వాలని ప్రభుత్వానికి సూచించింది. ప్రభుత్వం ఎయిర్ ఇండియా నుంచి పెట్టుబడుల ఉపసంహరణ బదులు ప్రత్యామ్నయం ఆలోచించాలని సూచించింది. జాతీయ ఎయిర్‌లైన్ ఎయిర్ ఇండియా జాతి గౌరవమని ప్రభుత్వానికి సూచించింది

ఫలితాలు, ద్రవ్యోల్బణం గణాంకాలే కీలకం



న్యూఢిల్లీ : ఈ వారంలో బ్లూచిప్ కంపెనీలు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు, ఐటీసీ, విప్రోలు మూడవ త్రైమాసిక ఫలితాలు ప్రకటించబోతున్నాయి. దీంతో పాటు టోకు ద్రవ్యోల్బణం గణాంకాలు కూడా వెల్లడి కానున్నాయి. ఈ రెండు అంశాలు మార్కెట్‌కు దిశానిర్దేశం చేయనున్నాయని మార్కెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

ప్రస్తుతం మార్కెట్లు ఇదే స్థాయిలో కొనసాగు తాయని... గ్లోబల్ మార్కెట్లు కూడా లాభాల జోరుతో దూకుడుమీదున్న నేపథ్యంలో దాని ప్రభావం దేశీయ మార్కెట్లపై ఉంటుందని వారు చెబుతున్నారు. ప్రస్తుతానికి మాత్రం మార్కెట్లకు దశదిశ చూపించేంది మాత్రం క్యూ3 ఫలితాలు మాత్రమేనని విశ్లేషకులు అంటున్నారు. గత శుక్రవారం నాడు ఐఐపీ, రిటైల్ ద్రవ్యోల్బణం గణాంకాలు వెల్లడయ్యాయి. దాని ప్రభావం కూడా మార్కెట్లపై ఉంటుంది. నవంబర్ నెల తయారీ రంగం 17 నెలల గరిష్టానికి 8.4 శాతానికి ఎగబాకగా.. దీనికి వ్యతిరేకంగా డిసెంబర్ రిటైల్ ద్రవ్యోల్బణం 5.2 శాతానికి ఎగబాకింది. దీంతో వడ్డీరేట్లు తగ్గించే అవకాశాలపై నీళ్లు జల్లినట్లయ్యింది. స్టాక్ మార్కెట్లు గత కొన్ని వారాల నుంచి రికార్డుస్థాయిలో దూసుకుపోతున్నాయి. ప్రస్తుతం ఆల్‌టైం హైలో కొనసాగుతున్నాయి. అతిపెద్ద కార్పొరేట్లు టీసీఎస్, ఇన్ఫోసిస్ ఫలితాలు మాత్రం ప్రస్తుతానికి అంచనాలకు తగ్గట్లుగానే ఉన్నాయి. అయితే మార్కెట్లకు నిరుత్సాహ పరిచే అంశాల విషయానికి వస్తే ముడి చమురు ధరలు పెరగడం పెద్ద అడ్డంకిగా మారనుంది. గత వారం సెన్సెక్స్ 438.54 పాయింట్లు లాభపడితే నిఫ్టీ 122.40 పాయిం ట్లలాభపడింది.

ద్రవ్యోల్బణం ప్రభావం సోమవారం నాడు మార్కెట్లపై కనిపిస్తుంది.త్వరలో అతి పెద్ద కంపెనీలు హిందుస్తాన్ యూనీలీవర్, ఎస్‌బ్యాంకు, ఐటీసీ, కొటక్ మహీంద్రాలు క్యూ3 ఫలితాలు ప్రకటించబోతున్నాయి. ఫిబ్రవరి 1వ తేదీన ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ బడ్జెట్ ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో ఆయన ఎలాంటి కీలకమైన ప్రకటనలు చేస్తారో అని మదుపరులు ఎదురుచూస్తున్నారు.

భారత్‌లోకి వోల్వో ఎలక్ట్రిక్ కారు

వచ్చే ఏడాది మార్కెట్లోకి - 10 శాతం వాటాపై కసరత్తు



న్యూఢిల్లీ: స్వీడిష్ లగ్జరీ కార్ల తయారీ కంపెనీ వోల్వో కార్స్ వచ్చే ఏడాది ఎలక్ట్రిక్ కారును భారత్ మార్కెట్‌కు పరిచయం చేయబోతోంది. దీంతో పాటు కొత్త ప్రాడక్టులను కూడా తీసుకువస్తామం టోంది. భారత్ మార్కెట్లో తమ వాటాను 2020 నాటికి రెట్టింపు చేసుకోవాలనే లక్ష్యంగా ప్రణాళికలు రూపుదిద్దుతోంది. గతేడాది వోల్వో 2029 యూనిట్లు విక్రయించింది. భారతీయ లగ్జరీ కార్ల మార్కెట్లో 5 శాతం వాటాను దక్కించుకుంది.

వచ్చే ఏడాది నుంచి కొత్త రకం కార్లను వాటిలో హైబ్రిడ్ ఎలక్ట్రిఫైడ్ కార్స్‌తో పాటు ఫ్లగ్ ఇన్ హైబ్రిడ్, పూర్తిస్థాయి ఎలక్ట్రిక్ కార్లను 2019లో గ్లోబల్ మార్కెట్లో విడుదల చేస్తామని, దాంతోపాటు భారత్ మార్కెట్లో కూడా ఈ కార్లను ఒకేసారి విడుదల చేస్తామని వోల్వో ఆలో ఇండియా ఎండీ చార్లేస్ ఫ్రంప్ చెప్పారు.

వోల్వో లక్ష్యం 2025 నాటికి ప్రపంచవ్యాప్తంగా పది లక్షల ఎలక్ట్రిఫైడ్ కార్లను రోడ్లపై తీసుకురావడం అని.. వాటిలో భారత్ వాటా గణనీయంగా ఉండాలనే తమ లక్ష్యమని ఆయన వివరించారు. ప్రస్తుతం తమ దృష్టి అంగా హైబ్రిడ్, ఎలక్ట్రిఫైడ్ కార్లపైనే అని ఫ్రంఫ్ అన్నారు. దీంతో పాటు సంప్రదాయ కార్లను ఈ ఏడాది మార్కెట్లో విడుదల చేయనున్నామన్నారు. వాటిలో కాంపాక్ట్ ఎస్‌వీయూ ఎక్స్‌సీ 40 అని చెప్పారు. 2020 నాటిక తమ ఫోర్టుఫోలియోలో పూర్తి స్థాయి ప్రాడక్టులు ఉదాహరణకు ఎస్‌యూవీ, సెడాన్‌లు, లగ్జరీ హెచ్‌బ్యాకులుంటాయని అన్నారు. భారత్ మార్కెట్ కోసం ప్రత్యేకంగా రోడ్ మ్యాప్‌ను రూపుదిద్దామని.. ప్రస్తుతం భారత్ మార్కెట్లో తమ వాటా 5 శాతమని 2020 నాటికి పది శాతానికి పెంచుకోవాలనుకుంటున్నట్లు ఆయన తెలిపారు. అమ్మకాలు తమ అంచనా ప్రకారం కొనసాగుతు న్నాయన్నారు. 2017లో అమ్మకాల్లో 28 శాతం వృద్ధి కనిపించిందన్నారు. అమ్మకాలు పెంచుకోవడానాకి వచ్చే రెండేళ్లలో నెట్‌వర్కును విస్తరించుకుంటామని అన్నారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 18 డీలర్లున్నారని వోల్వో సీఈవో చెప్పారు..

తయారీ రంగంలో భారత్ ర్యాంక్ 30

• జపాన్ టాప్

• ప్రపంచ ఆర్థిక ఫోరమ్ ర్యాంకు



న్యూఢిల్లీ / జెనీవా : గ్లోబల్ తయారీరంగం సూచిలో భారత్ ర్యాంకు 30గా ప్రపంచ ఆర్థిక ఫోరమ్ (డబ్ల్యూఈఎఫ్) ప్రకటించింది. చైనా కంటే 5స్థానాలు దిగువన ఉంది. అయితే బ్రిక్స్ దేశాలు బ్రెజిల్, రష్యా, దక్షిణాఫ్రికాలతో పోల్చుకుంటే పైన ఉంది. తయారీరంగంలో నెంబర్ వన్‌స్థానం జపాన్ దక్కించుకుంది. దాని తర్వాత స్థానాలు దక్షిణ కొరియా, జర్మనీ, స్విట్జర్లాండ్, చైనా, చెక్ రిపబ్లిక్, అమెరికా, స్వీడన్, ఆస్ట్రేలియా, ఐర్లాండ్‌లు వరుసగా టాప్ 10 స్థానాలు దక్కించుకున్నాయి.

బ్రిక్స్ దేశాల విషయానికి వస్తే రష్యా 35వర్యాంకు, బ్రెజిల్ 41, దక్షిణాఫ్రికా 45వ స్థానాల్లో ఉన్నాయని డబ్ల్యూఈఎఫ్ మొట్టమొదటి రెడీనెస్ ఫర్ ది ఫ్యూచర్ ప్రొడక్షన్ రిపోర్టు'లో పేర్కొంది. అత్యాధునిక పారిశ్రామికాభివృద్ధిపై విశ్లేషించి ఈ ర్యాంకులు ఇవ్వడం జరిగింది. మొత్తం 100 దేశాలను నాలుగు గ్రూపుగా విభజించింది. వాటిని (ప్రస్తుతం బలమైన బేస్, భవిష్యత్తు కోసం పెద్దమొత్తంలో ఉత్పత్తి చేయడానికి సిద్ధంగా ఉన్న దేశాలు), ఎక్కువ సామర్థ్యం (ప్రస్తుతం పరిమితి స్థాయిలో బేస్, భవిష్యత్తులో ఎక్కువ సామర్థ్యం) చూపే అవకాశాలు, లేగసీ (ప్రస్తుతం స్ట్రాంగ్ బేస్; భవిష్యత్తులో రిస్కు), నాస్కెంట్ (పరిమితిస్థాయిలో బేస్, భవిష్యత్తులో తక్కువ సామర్థ్యం) చూపే దేశాలుగా విభజించింది. భారత్‌ను లెగసీ లేదా వారసత్వం గ్రూపులో నిలిపింది. హంగేరి, మెక్సికో, ఫిలిప్పీన్స్, రష్యా, థాయిలాండ్, టర్కీలతో కలిపింది. చైనాను లీడింగ్‌కంట్రీస్‌లో చేర్చింది. కాగా బ్రెజిల్, దక్షిణాఫ్రికాను నాస్కెంట్ లేదా భవిష్యత్తులో తక్కువ స్థాయిలో ఉత్పత్తి చేసే సామర్థ్యం కలిగిన దేశాల్లో చేర్చింది.

ఇక భారత్ విషయానికి వస్తే తయారీ రంగంలో ప్రపంచంలోనే అతి పెద్ద 5వ తయారీరంగానికి చెందిన దేశంగా నిలిచింది. 2016లో మొత్తం 420 బిలియన్ డాలర్ల విలువ చేసే వస్తువులను తయారు చేసింది. గత మూడు దశాబ్దాల నుంచి సరాసరి ఏడాదికి 7 శాతం కంటే ఎక్కువ వృద్ధిని సాధిస్తోంది. భారత్ జీడీపీలో 16-20 శాతం వరకు తయారీరంగం ఆక్రమిస్తోందని తెలిపింది.

ప్రభుత్వం కూడా మేకిన్ ఇండియాకు పెద్దపీట వేసి భారత్‌ను తయారీరంగానికి హబ్‌మార్చాలని నిర్ణయించింది. కాగా 2017లో మౌలికరంగంలో 59 బిలియన్ డాలర్ల వరకు పెట్టుబడులు పెట్టింది. మొత్తానికి చూస్తే భారత్‌కు పొరుగుదేశాలైన శ్రీలంక (66) పాకిస్తాన్ (74) బంగ్లాదేశ్ (80)లతో పోల్చుకుంటే భారత్ ర్యాంకు ఎంతో మెరుగ్గా ఉంది. భారత్ కంటే తక్కువ ర్యాంకు దేశాల విషయానికి వస్తే టర్కీ,కెనెడా, ఇండోనేషియా, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా, హాంగ్‌కాంగ్, మారిషస్, యూఏఈలున్నాయి. భారత్ కంటే మెరుగన ర్యాంకులు సాధించిన దేశాల ఇలా ఉన్నాయి. సింగపూర్, థాయిలాండ్, బ్రిటన్, ఇటలీ, ఫ్రాన్స్, మలేషియా, మెక్సికో, రోమానియా, ఇజ్రాయిల్, నెదర్లాండ్స్, డెన్మార్క్, ఫిలిప్పీన్స్, స్పెయిన్లున్నాయి.

నాలుగవ పారిశ్రామిక విప్లవం సాధించి మెరుగైన స్థానం దక్కించుకున్న దేశాల్లో అమెరికా టాప్‌లో ఉంది. తర్వాత స్థానం సింగపూర్, స్విట్జర్లాండ్, బ్రిటన్, నెదర్లాండ్స్ టాప్ ఐదు దేశాల్లో స్థానం దక్కించుకున్నాయి. ఈ జాబితాలో చూస్తే భారత్ 44వ ర్యాంకులో ఉంది. చైనా 25, రష్యా 43వ స్థానాల్లో ఉన్నాయి. బ్రెజిల్ 47వ స్థానం, దక్షిణాఫ్రికా 49తో పోల్చుకుంటే భారత్ ర్యాంకు మెరుగ్గా ఉంది. ప్రతి దేశం పలు సవాళ్లను ఎదుర్కొంటాయని.. అయితే ప్రైవేట్ రంగం కానీ ప్రభుత్వం రంగం కానీ వాటిని పరిష్కరించలేవని డబ్ల్యూఈఎఫ్ నివేదికలో పేర్కొంది. అయితే ప్రభుత్వం వ్యూహాత్మకంగా సంప్రదాయ పద్ధతిలో పబ్లిక్ - ప్రైవేట్ భాగస్వామ్యంలో ప్రభుత్వం వేగవంతంగా నిర్ణయాలు తీసుకుంటే వాస్తవ విలువను పెంచుకోవచ్చునని పేర్కొంది.

బీసీలపై కాంగ్రెస్‌ది కపట ప్రేమ

టిఆర్ఎస్ ఎమ్మెల్యే శ్రీనివాసగౌడ్



హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఎన్నిక లు సమీపిస్తున్న కొద్దీ కాంగ్రెస్ నాయ కులు వెనుకబడినవర్గాలపై ప్రేమ కురిపిస్తున్నారని టిఆర్ఎస్ పార్టీకి చెందిన మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే శ్రీనివా సగౌడ్ ఎద్దేవాచేశారు. టిఆర్ఎస్ ఎల్పీ కార్యాలయంలో ఆదివారం జరిగిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆరుదశాబ్దాలకు పైగా పాలించిన కాంగ్రెస్ నాయకులు బిసి లను బాగా అణచివేశారన్నారు. కాంగ్రెస్ పార్టీలో ఒక్క బిసి ఎమ్మెల్యే లేరని, కనీసం పిసిసి అధ్యక్షుని రేసులో ఒక్క బిసి నాయకుని పేరు కూడా వినిపించడం లేదన్నారు. కాంగ్రెస్ హయాంలో కేవలం 23రెసిడెన్షియల్ స్కూళ్ళు మాత్రమే ఉండగా, తాము 120గురుకులాలను ఏర్పాటుచేశామన్నారు. 2017బడ్జెట్‌లో బిసిలకు రూ.5,076కోట్లను కేటాయించి అనేక కార్యక్రమాలను ప్రభుత్వం చేప ట్టిం దన్నా రు. 2016-17సంవత్సరంఆనికి రూ.1250.62కోట్ల ఫీజు రీయిం బర్స్ మెంట్ ఇచ్చారని, ఓవర్సీస్ విద్యకు రూ.20లక్షలు ఇస్తున్నారన్నారు. కాంగ్రెస్ నాయకుల కల్లబొల్లి కబుర్లను గీతకార్మికులు నమ్మొద్దన్నారు. కాంగ్రెస్ నాయకుల కుట్ర రాజకీయాలకు తెలంగాణలో స్థానం లేదన్నారు.

కుల సమీకరణతో..

కాంగ్రెస్‌కు కలిసొచ్చేనా?

● అధికార టీఆర్ఎస్‌కు దీటుగా హస్తం పార్టీ కార్యాచరణ ● బీసీల్లో బలమైన సామాజిక వర్గాల ఓటు బ్యాంక్‌పైన ప్రత్యేక దృష్టి



హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఒక వైపు ప్రభుత్వం.. మరో వైపు ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ పార్టీ కుల సంఘాల సమావేశాలతో కుస్తీ పడుతున్నారు. వచ్చే ఎన్నికల్లో మళ్లీ అధికారంలోకి రావాలని అధికార టీఆర్ఎస్ పార్టీ వివిధ కులసంఘాలతో సమావేశాలు, తాయిలాలు ప్రకటిస్తున్న విషయం తెలిసిందే. ప్రధానంగా అధికార టీఆర్ఎస్, ప్రధాన ప్రతిపక్షంతో పాటు బీజేపీ, టీడీపీకి చెందిన నాయకులు బీసీల ఓటు బ్యాంక్‌ను పదిలం చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. ఈ విషయంలో అధికార టీఆర్ఎస్ ఒక అడుగు ముందుకేయగా.. ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న కాంగ్రెస్ పార్టీ తామెందుకు వెనుకబడి ఉంటామని కులాల వారిగా సంఘాలతో సమావేశాలను మొదలు పెట్టింది. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో అధికారంలోకి రావడమే ధ్యేయంగా కాంగ్రెస్ పార్టీ కార్యాచరణను సిద్ధం చేసుకుంటుంది. ఇప్పటికే తెలంగాణ ఇచ్చిన పార్టీగా ప్రజల్లోకి వెళ్లినా ఫలితం లేకపోవడంతో.. అధికారంలోకి వస్తే ఏమి చేయాలనేదానిపై కాంగ్రెస్ పార్టీ నేతలు కసరత్తు చేస్తున్నారు. కులాల వారిగా సమావేశాలు ఏర్పాటు చేసి.. వారికి ఎలాంటి ప్రయోజనాలు కల్పించాలనే అంశంపైన చర్చిస్తున్నారు. రాజకీయ ప్రాధాన్యతనే కాకుండా సంక్షేమంగా చేయాల్సిన అంశాలపైన హస్తం పార్టీ దృష్టిసారించారు. కాగా ఇప్పటికే టీ పీసీసీ ఆధ్వర్యంలో చేనేత, పిషర్‌మెన్‌తో పాటు గౌడ కులస్తులతోనూ సమావేశం నిర్వహించారు. అంతే కాకుండా కాంగ్రెస్ పార్టీకి ప్రజా గాయకుడు ఏపూరి సోమన్న ఆధ్వర్యంలో ప్రత్యేకంగా సాంస్కృతికసేనను కూడా ఏర్పాటు చేశారు. ఇక తెలంగాణ ఉద్యమంలో కీలక భూమిక పోషించిన విద్యార్థి సంఘాలను కూడా తమ వైపు తిప్పుకునేందుకు కాంగ్రెస్ పాచిక వేస్తున్నది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున సమీకరణ చేసి సమావేశాలు నిర్వహిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక అమలు చేసే సంక్షేమ పథకాలు, రాజకీయంగా ఇచ్చే ప్రాధాన్యత అంశాలను వివరిస్తున్నారు. అంతేకాకుండా టీఆర్ఎస్ ప్రభుత్వం ఈ మూడున్నరేళ్లలో ఏ ఒక సామాజిక వర్గాన్ని పట్టించుకోలేదని విమర్శలు చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే అన్ని వర్గాల ప్రజలను ఆదరిస్తామని, న్యాయం జరుగుతోందని చెబుతున్నారు. ఇదిలా ఉంటే వివిధ ఉద్యమ సంస్థలతోనూ కాంగ్రెస్ పార్టీ చర్చలు జరుపుతున్నారు. రాష్ట్ర ఏర్పాటులో కీలకంగా ఉద్యమం చేసిన సంస్థలు, సంఘాలను కూడా దరి చేర్చుకోవాలనే ఆలోచన చేస్తున్నారు. కలిసొచ్చే పార్టీలు, సంస్థలతోనూ వచ్చే ఎన్నికల్లో కలిసి పని చేయాలనే యోచనలో కాంగ్రెస్ పార్టీ నేతలు ఉన్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా పని చేసే ఉద్యమ సంస్థలు, పార్టీలను ఏకతాటిపైకి తీసుకురావాలనే ఆలోచన చేస్తున్నారు. వీరితో పార్టీకి చెందిన ఢిల్లీ పెద్దలే చర్చలు జరుపుతున్నారు. అన్ని వర్గాలను కలుపుకుని ముందుకు సాగితే అనుకున్న లక్ష్యానికి చేరుకోవచ్చని కాంగ్రెస్ పార్టీకి చెందిన ఒక సీనియర్ నేత అభిప్రాయపడ్డారు. అన్ని కుల సంఘాల నేతలతో చర్చించడమే కాకుండా అన్ని వర్గాలు మెచ్చే విధంగా పార్టీ మేనిఫెస్టో ఉంటుందని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి.

కేటీఆర్‌వి ప్రగల్భాలు

టీ పీసీసీ ఉపాధ్యక్షుడు మల్లు రవి



హైదరాబాద్, ఆంధ్రప్రభ : విద్యుత్ కొనుగోలు ఒప్పందంలో జరిగిన అవి నీతి అక్రమాలపై చర్చకు రమ్మన్న టీఆ ర్ఎస్ నేతలు.. ఎందుకు తోక ముడి చారని టీ పీసీసీ ఉపాధ్యక్షలు మల్లు రవి ప్రశ్నించారు. అక్రమాలను నిరూపిస్తామని ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి చెబు తుంటే.. మంత్రి కేటీఆర్ ఉత్తర కుమార ప్రగ ల్భాలు పలు కుతున్నారని ఆదివారం ఆయన ఒక ప్రకటనలో విమర్శించారు. రేవంత్‌రెడ్డి చిప్పకూడు తిన్నాడని మంత్రి అనడం అవివేకానికి పరాకాష్ట అన్నారు. విద్యుత్ అంశాన్ని పక్కదారి పట్టించాలనే ఇలాంటి మాటలు మాట్లాడటాన్ని తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారని ఆయన హెచ్చరించారు. విద్యుత్ కొనుగోలు విషయంపైన చర్చకు సిద్ధమని మొదటగా టీఆర్ఎస్ ఎంపీ బాల్క సుమనే ప్రకటన చేసిన విషయాన్ని మంత్రి కేటీఆర్ గుర్తుంచుకోవాలన్నారు. చర్చకు సిద్ధంగా ఉన్నా మని రేవంత్‌రెడ్డి చెప్పడంతో.. తేలు కుట్టిన దొంగలాగా దొరికిపోయిన టీఆర్ఎస్ తప్పిం చుకోవడానికి అనవసర అంశాలను ముందుకు తెస్తున్నారని పేర్కొన్నారు.

ఉగ్రవాద నిర్మూలనకు వ్యూహం

ఆర్మీ చీఫ్ బిపిన్ రావత్

న్యూఢిల్లీ : జమ్మూ-కాశ్మీర్‌లో శాంతి నెలకొల్పేందుకు రాజకీయంగా ముందడుగు వేయాలని ఆర్మీ చీఫ్ బిపిన్ రావత్ అన్నారు. దీనికి కొత్త వ్యూహాలు సిద్ధం చేయాలని అన్నారు. ఉగ్రవాదాన్ని అంతం చేయడానికిగాను రాజకీయంగా పాక్‌పై ఒత్తిడి తీసుకురావాలని ఆయన కోరారు. పాకిస్థాన్ ఎలాంటి చర్యలకు దిగిన సరిహద్దు వెంట భారత్ ఆర్మీ ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉందని వివరించారు. జమ్మూ-కాశ్మీర్‌లో రాజకీయాల కారణంగానే శాంతివిఘాతం కలుగుతున్నదని అన్నారు. లోయలో శాంతి నెలకొల్పేందుకు మాజీ ఇంటలిజెన్స్ బ్యూరో దినేశ్వర్ శర్మను ప్రత్యేక ప్రతినిధిగా నియమించారు. ఆయన కాశ్మీర్ ప్రజల మనోభావాలు తెలుసుకోవాలి. అల్లర్లు ఎందుకు జరుగుతున్నాయి..? అనే దిశగా ప్రణాళికలు సిద్ధం చేసి ప్రభుత్వానికి ఇవ్వాలి. కాశ్మీర్ సమస్య దేశానికి జఠిలంగా మారిందని, వెంటనే ప్రభుత్వం కల్పించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని అభిప్రాయపడ్డారు.

తెలుగు న్యాయవాదికి అరుదైన గౌరవం



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: దేశ రాజధానిలో నివాసముంటున్న తెలుగమ్మాయికి అరుదైన గౌరవం దక్కింది. ఢిల్లీకి చెందిన యువ అడ్వకేటు కామర్సు శ్రీతేజ 'షిప్ ఫస్ట్ వరల్డ్ యూత్ లీడర్స్' కార్యక్రమానికి ఎంపికయ్యారు. భారతదేశం నుంచి ఎంపికైన 10 మంది బృందానికి ఆమె నాయకత్వం వహించనున్నారు. ఈ కార్యక్రమానికి జపాన్ నుంచి 120 మంది, 11 దేశాల నుంచి మరో 120 మంది ప్రతినిధులు హాజరు కాబోతున్నారు. ఈ యువ నాయకుల బృందం నౌకలో 45 రోజుల పాటు జపాన్, శ్రీలంక, సింగపూర్‌తో పాటు భారత్‌లోని వివిధ ప్రాంతాల్లో పర్యటించనున్నారు. సామాజిక, మేథో, రాజకీయ అంశాలపై పరస్పర అవగాహన, నాయకత్వ లక్షణాల పెంపే ఈ పర్యటన లక్ష్యం. ఈ పర్యటనలో యోగా, భారత సంస్కృతి, సంగీత కార్యక్రమాల విశిష్టతను వివరించబోతున్నామని ఆంధ్రప్రదేశ్ భవన్‌లో జరిగిన పాత్రికేయుల సమావేశంలో కామర్సు శ్రీతేజ తెలిపారు. ప్రపంచ దేశాల ఐకమత్యం, శాంతికి కృషి చేయనున్నామని అన్నారు. ఆయా దేశాలలో హోమ్ స్టే ద్వారా అక్కడి సామాజిక పరిస్థితులను అధ్యయనం చేస్తామని ఆమె చెప్పారు. పర్యటన ఆసాంతం సముద్ర మార్గంలో నౌక మీద ప్రయాణం సాగుతుందని శ్రీతేజ వివరించారు.

వలసదారులను వద్దనొద్దు

ప్రపంచానికి పోప్ ఫ్రాన్సిస్ హితబోధ

వాటికన్ సిటీ: వలసదారులకు ఆతిథ్యమివ్వాలని పోప్ ఫ్రాన్సిస్ మానవ సమాజానికి పిలుపునిచ్చారు. ఇతరులను చూసి భీతిల్లడం పాపమని ప్రపంచ వలసదారులు, శరణార్థుల దినాన్ని పురస్కరించుకొని సెయింట్ పీటర్స్ బాసిలికా వద్ద వేలాది క్రైస్తవులను ఉద్దేశించి ఆయన అన్నారు. మనకంటే ఎంతో భిన్నంగా వ్యవహరించే వారిని మనలో కలుపుకోవడం అంత సులభం కాదు. కొత్తగా వచ్చినవారు తమ జీవనశైలిని, సంస్కృతీ సంప్రదాయాలను చిన్నాభిన్నం చేస్తారని స్థానికులు భీతిల్లుతుంటారు. అత్యంత వ్యయప్రయాసలతో తాము నిర్మించుకున్నవాటిని దోచుకుంటారని భయపడుతుంటారు. అలా భయపడ్డం పాపం కాదు అని పోప్ ఫ్రాన్సిస్ అన్నారు. మన బాధ్యతలు, మన ఎంపికలకు ఒక పరిధి, గౌరవం మరియు దయ చూపడంలో రాజీ, అన్నార్తుల ఆకలి తీర్చడాన్ని నిర్ణయించడంలో ఈ భయాలు ప్రాముఖ్యత సంతరించుకోవడమే అసలైన పాపం అని ఆయన తెలిపారు. మన తరచుగా ఇతరులను నిరాకరిస్తుంటాం. మనల్ని మనం కాపాడుకోవడానికి గోడలు నిర్మించుకుంటున్నాం అని పోప్ ఫ్రాన్సిస్ అన్నారు. 81 సంవత్సరాల పోప్ ఫ్రాన్సిస్ సాక్షాత్తూ అర్జెంటీనా నుంచి ఇటలీ వలసవచ్చిన వారి కుమారుడే. 2013లో ఎన్నికైన నాటి నుంచి వలసదారులు, శరణార్థుల సాధన కోసం ఆయన పోరాడుతున్నారు.

గులాబీ పార్టీలో ఎన్నికల ఫీవర్

టికెట్... టికెట్..

(మొదటి పేజీ తరువాయి)



ముగియగానే లోక్‌సభ, అసెంబ్లీ నియోజకవర్గాల వారీ సమీక్షలు చేపట్టాలని సిఎం భావిస్తున్నారు. తాజాగా మూడురోజల పాటు ఐదుజిల్లాల్లో పర్యటించి.. ఎన్నికల ప్రచారాన్ని మరిపించేలా పదిసభల్లో పాల్గొన్న మంత్రి హరీష్‌రావు ప్రజల మూడ్‌ను, పార్టీ మూడ్‌ను.. తాజా పరిస్థితులను అధినేతకు వివరించినట్లు తెలిసింది. ప్రస్తుతం అన్నినియోజకవర్గాల్లో ఇతర పార్టీల నుండి వచ్చిచేరిన నేతలతో కిటకిట వాతావరణం కనబడుతోంది. ఒక్కోపార్టీ నుండి వచ్చిన నేతలు.. ఎవరికి వారు గ్రూపులు నిర్వహించుకుంటున్న పరిస్థితి పలు నియోజకవర్గాల్లో ఉంది. ప్రస్తుతం టిఆర్ఎస్‌కు ఇతర పార్టీల నుండి వచ్చిన నేతలతో కలిపి 90మంది ఎమ్మెల్యేలు ఉండగా, వీరితో పాటు టికెట్ల ఆశతో టిఆర్ఎస్‌లోకి వచ్చిన మాజీ ఎంపీలు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు, ప్రభావిత నేతలు అనేకమంది టికెట్లు ఆశిస్తున్నారు. రాష్ట్రంలో ఎంఐఎం ప్రాతినిధ్యం వహిస్తున్న ఏడు స్థానాలను మినహాయిస్తే మిగిలిన 112స్థానాల కోసం 1000మందికి పైగా ఆశావహులు పోటీపడుతున్నారు. ఈ ఏడాది చివర్లోనే లోక్‌సభతో పాటు శాసనసభకు ఎన్నికలు వచ్చే అవకాశం ఉందన్న ప్రచారం నేపథ్యంలో టికెట్..టికెట్ అంటూ ముందస్తు ప్రయత్నాలు చేసుకుంటున్నారు. నూతన సంవత్సరం ప్రారంభం నుండి ఆశావహులు తెరపైకి వచ్చి.. తాము పోటీలో ఉన్నామని, తమను గుర్తుపెట్టుకుని టికెట్ అవకాశం చూడాలంటూ విజ్ఞప్తులు చేస్తున్నారు. మంత్రులు హరీష్ రావు, కెటిఆర్, ఎంపీ కల్వకుంట్ల కవితలకు ఈ తాకిడి ఎక్కువగా ఉండగా, ఆయా జిల్లాలకు సంబంధించిన మంత్రుల చుట్టూ కూడా నేతలు ప్రదక్షిణలు చేస్తున్నారు. కొందరు జిల్లా మంత్రితో పాటు కెటిఆర్, హరీష్, కవితలలో ఒకరిని నమ్ముకుని సీరియస్ ప్రయత్నాలు చేస్తుండగా.. మరికొందరు తమ సామాజికవర్గానికి చెందిన మంత్రుల ద్వారా ప్రయత్నాలు చేస్తున్నారు. టికెట్.. టికెట్.. అంటూ తమ అర్హతలు ఏకరువు పెడుతున్నారు. ఖర్చు ఎంతైనా రెడీ అంటూ కొందరు ముందుకు వస్తుంటే.. మరికొందరు తాము ఆదినుండీ పార్టీకి చేసిన సేవను ఏకరువుపెడుతూ అర్హతలు వివరిస్తున్నారు. చూద్దాం.. భాయ్‌సాబ్ అంటూ నేతలను మంత్రులు సముదాయించి పంపుతున్నారు. గతంలో జనసందడి తక్కువగా ఉన్న మంత్రుల క్వార్టర్లు కూడా.. ఆశావహుల జాతరతో ఇపుడు ప్రతిరోజూ రద్దీగా కనబడుతున్నాయి.

నియోజకవర్గ ఇన్‌ఛార్జిలపై కసరత్తు

ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో టిఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జిల నియాయకంపై దృష్టిపెట్టింది. ప్రస్తుతం రాష్ట్రంలో 90అసెంబ్లీ నియోజకవర్గాలుండగా, మిగిలిన 29అసెంబ్లీ నియోజకవర్గాలకు పార్టీ ఇన్‌ఛార్జిలు లేరు. గత ఎన్నికల్లో పోటీచేసి ఓడిన అభ్యర్థులే అనదికారికంగా ఇన్‌ఛార్జిలుగా కొనసాగుతున్నారు. ఇక ఇటీవల రాష్ట్రకమిటీని ప్రకటించినపుడు పార్టీ ప్రధానకార్యదర్శులకు పలు నియోజకవర్గాల పర్యవేక్షణ బాధ్యతను ముఖ్యమంత్రి అప్పగించారు. కొన్ని జిల్లాల్లో ఇన్‌ఛార్జిలు నియోజకవర్గ సమావేశాలు నిర్వహించి.. పార్టీని ఏకతాటిపైకి తెచ్చే యత్నం చేయగా, మరికొందరు ఇన్‌ఛార్జిలు సమావేశాల జోలికే వెళ్ళలేదు. రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాలకు ఇన్‌ఛార్జిలను ప్రకటించాలా, ఎమ్మెల్యేలు లేని 29నియోజకవర్గాలకు ప్రకటించాలా అన్న అంశాలపై పార్టీ ముఖ్యులతో సిఎం చర్చిస్తున్నట్లు తెలిసింది. ఈ నెలాఖరులోనే వీటిపై పార్టీ స్పష్టతనివ్వనుందని, బడ్జెట్ సమావేశాలు ముగియగానే నియోజకవర్గ సమీక్షలు నిర్వహించి పార్టీ స్థితిగతులపై సూక్ష్మస్థాయి పరిశీలన చేయాలని నిర్ణయించారు. ఈ సమావేశాల ద్వారానే పార్టీ గెలుపుకు అవసరమైన వ్యూహాన్ని ఖరారుచేయనున్నారు. అభ్యర్థుల అంశంపైనా.. ఈ సమావేశాల ద్వారా స్పష్టతకు వచ్చే అవకాశం ఉంది.

పునర్విభజన పరిస్థితేంటి?

నియోజకవర్గాల పునర్విభజనపై ఇంకా టిఆర్ఎస్ నేతల్లో ఆశలున్నాయి. ఏమో.. గుర్రంఎగరావచ్చు అన్నట్లు అనేకమంది ఆశావహులు కొత్త నియోజకవర్గం వస్తే సీటు నాకే ఇప్పించాలి అంటూ ముందస్తు ఖర్చీఫ్‌లు వేస్తున్నారు. వచ్చినా..రాకన్నా టికెట్ ఇవ్వాల్సిందే అంటూ ఒత్తిడిచేస్తున్న నేతల జాబితా చాంతాడంత ఉంది. ప్రస్తుతం టిఆర్ఎస్‌కు 90మంది ఎమ్మెల్యేలుండగా.. మొత్తం 119స్థానాల్లో 112స్థానాల్లో బలమైన అభ్యర్థులను నిలపనుంది. ఎంఐఎంతో ప్రత్యక్ష లేదా పరోక్ష స్నేహం ఉండనుంది. ఈ 119సీట్లకు అదనంగా మరో 34చేరితే.. టిఆర్ఎస్‌కు భారీ ఉపశమనం లభించనుంది. ముఖ్యనేతలను సర్దుబాటు చేసే వెసులుబాటు కలగనుంది. ఒకవేళ సీట్లు పెరగకుంటే సర్దుబాటుకు శ్రమపడాల్సి రావొచ్చు. అయితే ఇప్పటికే పలు నియోజకవర్గాల్లో బహిర్గతమైన వివాదాలను, పోటీపడుతున్న ఆశావహులను కొత్త నియోజకవర్గాలపై సంకేతాలున్నాయంటూ బుజ్జగిస్తున్నారు.

క్షేత్రస్థాయి పరిస్థితి ఇలా ఉంది?

క్షేత్రస్థాయి పరిస్థితిపై ముఖ్యమంత్రి కెసిఆర్ పలు ఏజెన్సీల ద్వారా, ఇంటెలిజెన్స్ ద్వారా ఎప్పటికపుడు నివేదికలు తెప్పించుకుంటారు. ప్రజల మధ్య ఉండే నేతలు చూసే కోణం వేరుగా ఉంటుంది. ముఖ్యమంత్రి సూచనమేరకు తాజా పర్యటనలు ఎన్నికల ప్రచారాన్ని మరిపించేలా చేసిన మంత్రి హరీష్ పరిస్థితిని సిఎంకు నివేదించినట్లు తెలిసింది. ప్రభుత్వతీరుపై ప్రజల్లో వ్యక్తమైన స్పందన, కార్యకర్తల మూడ్, నేతల శైలి.. అన్నింటినీ సిఎంకు వివరించినట్లు సమాచారం. సభలలో కెసిఆర్‌ను ఆశీర్వదించండి అని మంత్రి హరీష్ పిలుపునివ్వగా, పెద్ద ఎత్తున స్పందన వ్యక్తమైంది. దీంతో స్థానిక నేతలను నమ్ముకోకుండా.. ముఖ్యమంత్రి కెసిఆర్‌పై ప్రజల్లో ఉన్న అచంచల విశ్వాసాన్నే ప్రచారాస్త్రంగా ముందుకు తీసుకెళ్తే ఉపయోగం జరుగుతుందన్న భావన ముఖ్యుల్లో వ్యక్తమవుతోంది. ఎన్నికల ఫీవర్ ప్రారంభమైన నేపథ్యంలో రానున్న రోజుల్లో టిఆర్ఎస్ కార్యకలాపాల జోరు విస్తృతంకానుంది.

లౌకికవాదంలో హిందుత్వం!?

(మొదటి పేజీ తరువాయి)

రాహుల్ గాంధీ కొత్త అవతారం ఎత్తారు. ప్రచారంలో భాగంగా స్థానిక ప్రసిద్ధ ఆలయాలను సందర్శించారు. ప్రత్యేక పూజలు నిర్వహించి అందరినీ ఆశ్చర్యంలో ముంచెత్తారు. కాంగ్రెస్ సారథి తీరుతో బీజేపీ శ్రేణులు సైతం అవాక్కయ్యాయి. సోమనాథ్ ఆలయాన్ని సందర్శించన సందర్భంగా, సందర్శకుల పుస్తకంలో సంతకం చేయడంపై పెద్ద రాద్ధాంతం జరిగింది. ఈ వివాదం నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి మాట్లాడుతూ రాహుల్ జన్యుధారి, హిందువేనని స్పష్టం చేయడం కొత్త మలుపు. సందిగ్ధతకు తెరదించేందుకు రాహుల్ మరో అడుగు ముందుకేశారు. తానూ, తమ కుటుంబం శివభక్తులమని చాటిచెప్పారు. అయినా ఇలాంటి అంశాలను వ్యక్తిగతానికే పరిమితం చేస్తామని, రాజకీయాలకు వాడుకోమని పరిణితి చెందిన రాజకీయ నాయకుడిగా వ్యాఖ్యానించారు.

తృణమూల్ మలి అడుగు..

ఇటీవల బిర్భుమ్ జిల్లాలో 'బ్రాహ్మిణ్ అండ్ పురోహిత్' పేరుతో సమ్మేళనం జరిగింది. దీనికి తృణమూల్ పార్టీ సీనియర్ నాయకుడు అనుబ్రాత మండల్ పర్యవేక్షకుడిగా వ్యవహరించారు. సదస్సుకు ముఖ్య అతిథులుగా విచ్చేసిన వారికి శాలువా కప్పి, భగవద్గీత, రామకృష్ణ పరమహంస చిత్రపటాలను అందించడం ద్వారా స్వయంగా సత్కరించారు. ముస్లిం మైనార్టీలకు కొమ్ముకాస్తున్న ఒక అధికార పార్టీ పశ్చిమబెంగాల్ వంటి రాష్ట్రంలో ఈ విధమైన చర్యకు సాహసించడం గొప్ప పరిణామమే. వచ్చే ఎన్నికల్లో సత్తాచాటేందుకు భారతీయ జనతాపార్టీ వేగంగా పావులు కదుపుతున్న క్రమంలో తృణమూల్ వ్యూహాత్మక అడుగులు వేస్తున్నట్లు స్పష్టమవుతోంది. హిందుత్వ మార్కు వైపు సానుకూల దక్పథాన్ని ప్రదర్శిస్తున్నారని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు.

కర్నాటకంలో హిందుత్వ పోరు

కర్నాటక అసెంబ్లీ ఎన్నికల్లోనూ హిందుత్వం కోసం ప్రధాన పార్టీల మధ్య పోటీ తప్పదనిపిస్తోంది. గుజరాత్ మాదిరిగా ఇక్కడ కూడా కాంగ్రెస్ మిగతావర్గాలతోపాటు హిందువులకు చేరువ అయ్యే ప్రయత్నం చేస్తుందని రాజకీయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఇప్పటికే ముఖ్యమంత్రులు యోగి, సిద్ధరామయ్య మధ్య వాగ్యుద్ధం మొదలైంది. హిందుత్వం గురించి యోగి వద్ద నేర్చుకోవాల్సిన అవసరం లేదని సిద్ధరామయ్య వ్యాఖ్యానించారు. ఆయన గాడ్సే మద్దతు దారుడంటూ విమర్శలు గుప్పించారు. తద్వారా తమ పార్టీ అనుసరించబోయే వ్యూహాన్ని చెప్పకనే చెప్పినట్లయింది.

మార్చిలో 'రాష్ట్ర రక్ష యజ్ఞం'

రాబోయే ఎన్నికల్లో విజయం చేకూరాలని బీజేపీ ఎంపీ 'మహాయజ్ఞ' కార్యక్రమం ఆగమశాస్త్రం ప్రకారం దేవతల ఆశీర్వాదంతో పరిపాలన సాగాలని సంకల్పించారు. ఈ మహాయజ్ఞాన్ని ప్రసిద్ధి చెందిన దేశ రాజధాని ఎర్రకోట వద్ద మార్చిలో నిర్వహించనున్నట్టు భారతీయ జనతా పార్టీ సమాచారం. అయితే, కేంద్ర బీజేపీ ఎంపీ మహేష్ గిరి నేతృత్వంలో బీజేపీ పాలిత రాష్ట్ర ముఖ్యమంత్రులు, పార్టీ చీఫ్ అమిత్ షా, ప్రధాని నరేంద్ర మోడీ హాజరుకానున్నట్టు సమాచారం. ఈ 'రాష్ట్ర రక్ష యజ్ఞం' ప్రధానంగా బాగ్లాముఖీ దేవి ఆశీర్వాదంతో రాబోయే లోక్‌సభ, కొన్ని అసెంబ్లీ ఎన్నికల్లో విజయం చేకూరాలన్నదే ముఖ్య ఉద్దేశంగా ఆయన పేర్కొన్నారు. పూర్తి సమాచారాన్ని జనవరి 22న వెల్లడించనున్నట్టు ఎంపీ గిరి తెలిపారు. మళ్లీ పరిపాలనకు రావటానికి 'రాజ్ వ్యవస్థ' అమ్మవారి ఆశీర్వాదం ఉంటుందని భక్తుల నమ్మకం.

అంతేకాకుండా, శ్రీశ్రీ రవిశంకర్ ఆర్ట్ ఆఫ్ లివింగ్ చెప్పినట్టు 'అయో ఏక్ సంకల్ప లేన్, అయో ఏక్ ఆహుతి డేన్' అనే నినాదాలు ఎంపీ గిరి నివాసంలో ఉంచనున్నట్టు సమాచారం. అయితే, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, కర్నాటకలో కాంగ్రెస్ పార్టీని ఎదుర్కొనేందుకు జరిగే రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో బిజేపీ విజయాన్ని కోరుతూ ఈ మహాయజ్ఞాన్ని నిర్ణయించనున్నారు. ఈ యేడు నిర్వహించనున్న నాలుగు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో విజయాన్ని బట్టే 2019 జనరల్ ఎన్నికల్లో గెలుపు ఆధారపడి ఉన్నట్టు అంచనా వేస్తున్నారు.

పంచవర్ష ప్రణాళిక

(మొదటి పేజీ తరువాయి)

లఘు చిత్రాలను నిర్మిస్తున్నారు. ఒక్కో ప్రాధాన్యత రంగానికి సంబంధించి ఒక్కో డాక్యుమెంటరీని రూపొందిస్తున్నట్లు అనధికార వర్గాల సమాచారం. జాతీయ స్థాయిలో ప్రభుత్వ ప్రతిష్టను పెంచుతున్న ప్రత్యేక పథకాలకు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వనున్నారు. తెలంగాణ వెనకబాటుతనాన్ని తరిమికొట్టే విధంగా తాను తీసుకున్న కీలక నిర్ణయాలు, తదనంతర క్రమంలో అమలైన ప్రతిష్టాత్మక కార్యక్రమాలను హైలైట్ చేయబోతున్నారు.

కార్యాచరణకు మార్గదర్శకాలు

ఈ వ్యూహాత్మక ఆలోచనలన్నింటినీ కార్యరూపంలోకి తీసుకురావడానికి త్వరలోనే చర్యలు ప్రారంభించవలసిందిగా ఉన్నతాధికార యంత్రాంగానికి మార్గదర్శకాలు జారీ చేశారు. ఈ ఏడాది జూన్ మొదటివారం నుంచి లఘుచిత్రాలను ప్రాధాన్యతా క్రమంలో విడుదల చేయనున్నట్లు తెలుస్తోంది. ఈ డాక్యుమెంటరీలను గ్రామగ్రామాన ప్రదర్శించి, ప్రజల అభిప్రాయాలు తెలుసుకుని, వారినుంచి సలహాలు, సూచనలు స్వీకరించనున్నారు. వాటన్నింటినీ క్రోడీకరించి వచ్చే ఐదేళ్ళ ప్రణాళికను రూపొందించనున్నారు. ప్రస్తుతమున్న పథకాలకు మార్పులు, చేర్పులు చేయడం, కొత్త పథకాలను రూపిందించడం సీఎం మదిలో ఉన్న కొత్త ఆలోచనగా సీఎం సన్నిహితులు చెబుతున్నారు. తద్వారా ప్రజలు కోరిన విధంగా, వారి అభీష్టం మేరకు సంక్షేమ పథకాలు ప్రకటించి, అమలు చేసి వచ్చే రెండేళ్ళలో రాష్ట్ర ప్రజల సర్వామోదాన్ని పొందాలని అభిలషిస్తున్నారు.

రాజకీయ భవిష్యత్తుపై కొత్త పంథా

ప్రత్యేకరాష్ట్రం ఏర్పాటయ్యాక పాలనపై తన సరికొత్త పంథాను నిరూపించుకుంటున్న చంద్రశేఖరరావు రాజకీయ భవిష్యత్తుపై రెండేళ్ళ ముందుగానే దృష్టి కేంద్రీకరించారు. ఈ మూడేళ్ళ కాలంలో ప్రారంభించిన కొన్ని ప్రతిష్టాత్మక పథకాలు, చారిత్రాత్మక నిర్ణయాలతో ఇప్పటికే దేశంలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న ఆయన వచ్చే ఇదేళ్ళ కోసం సరికొత్త విధానంతో ముందుకు సాగుతున్నారు. 2019 ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని విజయానికి వ్యూహాలు రచిస్తున్నారు. ఇప్పటికే ప్రతిపక్షాలు నోరెత్తడానికి వీల్లేకుండా చేసిన కేసీఆర్ తాను సాధించిన ఫలితాలపై ప్రజల్లోకి వెళ్ళేందుకు సిద్ధమవుతున్నారు.

నిరాదరణకు గురైన రంగాలే కీలకం

గతంలో నిరాదరణకు గురైన సందర్భాలను, రాజకీయ కుట్రలను కూడా మలి విడత విజయానికి ఉపయోగించుకోనున్నారు సీఎం కేసీఆర్. వ్యవసాయం, అనుబంధ రంగాలు, సంక్షేమ కార్యక్రమాల విస్తరణ, విద్య, వైద్య రంగాలకు ఇస్తున్న ప్రాధాన్యత, పెట్టుబడులు, యువజనోపాధి అదితర రంగాల్లో సాధించిన విజయాలు, లబ్ధిదారుల అభిప్రాయాలు లఘు చిత్రాల్లో ప్రధానాంశాలు కాబోతున్నాయి. అందుకోసం ప్రభుత్వ ముఖ్య సలహాదారు డాక్టర్ రాజీవ్ శర్మ నేతృత్వంలో కసరత్తు జరుగుతోంది. సీఎం కేసీఆర్ మార్గదర్శకాల మేరకు కొన్ని కీలక శాఖల ముఖ్య కార్యదర్శులు కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేస్తున్నారు. వ్యవసాయ అనుబంధ రంగాలు, సాగు, తాగునీటి అంశాలను హైలైట్ చేయబోతున్నారు.

30 డాక్యుమెంటరీలు, 20 లఘు చిత్రాలు

ప్రతిష్టాత్మక పథకాలు విజయవంతంగా అమలు చేయడానికి దోహదపడిన అంశాలపై డాక్యుమెంటరీలు తయారు చేస్తున్నారు. ఈ విధానంతో ప్రజల్లోకి వెళితే పరిపాలనపై ప్రజల్లో ఉన్న అభిప్రాయాలపై స్పష్టత వస్తే మరింత మెరుగైన పాలన అందించేందుకు కేసీఆర్ వ్యూహాత్మక ఆలోచన ఉన్నారు. అధికార వర్గాల ద్వారా విశ్వసనీయంగా అందిన సమాచారం మేరకు సుమారు 30 డాక్యుమెంటరీలు, మరో 20 లఘు చిత్రాలు రూపొందించేందుకు ఉన్నతాధికారులు కసరత్తు చేస్తున్నారు. ప్రత్యేకమైన సామాజిక అంశాలను ఎంచుకుని డాక్యుమెంటరీలు తయారు చేయబోతున్నారు.

స్వయం ఉపాధి పథకాలు హైలైట్

ప్రభుత్వ విజయాలకు దర్పణం పట్టిన కొన్ని ప్రాధాన్యత గల అంశాలను క్రోడీకరించి లఘు చిత్రాలను రూపొందించనున్నారు. శాశ్వత ప్రాతిపదికన ఉపాధి పొందేందుకు మత్స్యకారులకు ప్రభుత్వం అందిస్తున్న చేయూత, వృత్తులను పరిరక్షిస్తూ తద్వారా గ్రామాల్లోనే ఉపాధి అవకాశాలను పెంపొందించేందుకు గొర్రెలు, మేకల పెంపకందార్లకు, పాడి రైతులకు అందిస్తున్న ప్రోత్సాహకాలపై విస్తృత ప్రచారం చేయనున్నారు. మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, కళ్యాణ లక్ష్మి, ఒంటరి మహిళలకు సామాజిక భద్రత తదితర అంశాలకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారు. సాంప్రదాయ జల వనరులు అంతగా లేని తెలంగాణ జిల్లాల్లో అవకాశాలపై అధ్యయనం చేసి, వాటిని ఉపయోగించుకుని మత్స్య పరిశ్రమను అభివృద్ధి చేస్తున్న అంశాన్ని కూడా ఎంచుకున్నారు.

బడ్జెట్ సమావేశాల నాటికి తుదిరూపం

గరిష్టంగా నెల రోజుల్లోగా డాక్యుమెంటరీలు, లఘు చిత్రాలను రూపొందించే ప్రక్రియను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. వాటిని ముఖ్యమంత్రితో పాటు మంత్రులు, పార్టీ ప్రముఖులు క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే విడుదల చేయనున్నారు. త్వరలో జరగనున్న బడ్జెట్ సమావేశాల నాటికి వీటికి తుదిరూపం ఇవ్వాలన్నది కేసీఆర్ ఆలోచన. ఇప్పుడున్న పథకాలను మరింత పటిష్టంగా అమలు చేసేందుకు ప్రభుత్వానికి ఉన్న ముందుచూపు, ప్రజాదరణ పొందుతున్న సంక్షేమ కార్యక్రమాలను విస్తృత పరిచి తద్వారా మరింత ఎక్కువ మంది లబ్ధిదారులకు న్యాయం చేకూర్చే విధానంపై ప్రజలకు స్పష్టత ఇవ్వనున్నారు.

గ్రాట్యుటీకి

నో ట్యాక్స్

(మొదటి పేజీ తరువాయి)

అవసరం ఉండదు. అదేవిధంగా, కేంద్రప్రభుత్వ చట్టాలకు అనుగుణంగా మెటర్నిటీ సెలవులు, పారితోషికాలను సద్వినియోగం చేసుకునే వెసులుబాటు వ్యవస్థీకృత రంగంలోని ఉద్యోగులకు కలుగుతుంది. కర్మాగారాలు, గనులు, చమురు క్షేత్రాలు, మొక్కలపెంపకం, ఓడరేవులు, రైల్వేలు, కంపెనీలు, దుకాణాలు, ఇతర వ్యవస్థల్లోని ఉద్యోగులు పారితోషికం పొందేలా 1972 నాటి గ్రాట్యుటీ చట్టాన్ని రూపొందించారు. పది లేదా అంతకంటే ఎక్కువ మంది ఉద్యోగులు కలిగిన సంస్థల్లో, వరుసగా ఐదేళ్లకుపైగా పనిచేసిన ఉద్యోగులు గ్రాట్యుటీకి అర్హులుగా నాటి చట్టం నిర్వచించబడింది. మహిళా ఉద్యోగినులకు 12 వారాలు మెటర్నిటీ సెలువులను సర్వీసు కాలంగా పరిగణించబడుతుంది. కాగా, మెటర్నిటీ ప్రయోజనాల గరిష్ట కాలపరిమితిని 26 వారాలకు పెంచాలన్న ప్రతిపాదనలు ఉన్నాయి. మొత్తం సర్వీసు కాలంలో ఏడాదికి 15 రోజుల వేతనాన్ని గ్రాట్యుటీగా గణిస్తారు. ఈ మొత్తానికి గరిష్టపరిమితిగా రూ. 10 లక్షలను నిర్ణయించారు. ఈ విధమైన సవరణలు 2010లో తీసుకొచ్చారు. ఏడవ వేతన సంఘం అమల్లోకి వచ్చిన తర్వాత గ్రాట్యుటీ గరిష్ట పరిమితిని కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు రూ. 10 లక్షల నుంచి రూ. 20లకు పెంచారు. తాజా సవరణ బిల్లులో గరిష్టపరిమితిని మిగతా వర్గాలకు విస్తరించనున్నారు.

కోడే గెల్చింది

● ఆంధ్రప్రదేశ్‌లో విశృంఖలంగా కోడి పందాలు ● గోదావరి జిల్లాల్లో గ్రామగ్రామాన పందాలజోరు ● తొలిరోజు వందకోట్లకు పైగా పందాలు ● వెంప గ్రామంలో ఉద్రిక్తత ● పోలీసులు, పందెంరాయుళ్ల మధ్య తోపులాట



కాకినాడ, ఆంధ్రప్రభ ప్రతినిధి: ఎట్టకేలకు కోడే గెల్చింది. ఖాకీ తలొం చాల్సొచ్చింది. భారత సర్వోన్నత న్యాయస్థానం నిలువరించమని ఆదేశాలిచ్చిందంటూ బరుల్లోకి కోళ్ళు దిగక్కుండా కాపుకాసేందుకు పోలీసులు చేసిన యత్నం భగ్నమైంది. ఆదివారం ఉదయం నుంచి గ్రామ గ్రామాన పందాల జాతర మొదలైంది. గోదావరి జిల్లాల్లో అయితే ఎక్కడ చూసినా పందాల గొడవే. ఒక్క భీమవరంలోనే తొలిరోజు వంద కోట్లకుపైగా విలువైన పందాలు జరిగినట్లు అంచనా. సమీపంలోని వెంప గ్రామంలో రెండువారాల ముందే బరులు సిద్ధం చేశారు. దేశ, విదేశాల్నుంచి కూడా పందెం రాయుళ్ళకు ఆహ్వానాలు పంపారు. ప్రతి ఏటా ఈ గ్రామంలో కోట్ల రూపాయలపైబడి జరిగే పందాలను ఈసారి ఎలాగైనా ఆపాలని పోలీసులు నిర్ణయించుకున్నారు. సుమారు రెండొందలమందికిపైగా పోలీసులు ఈగ్రామంలో మోహరించారు. సాక్షాత్తు నర్సాపురం డిఎస్‌పి ప్రభాకర్‌గౌడ్ కూడా అక్కడే కాపుకాశారు. అయితే అప్పటికే కోస్తా జిల్లాల్లో పందాలు మొదలైపోయాయి. ఏకంగా ఎమ్మెల్యేలు, ఎమ్‌పిలు, ప్రజాప్రతినిధులు దగ్గరుండి మరీ పందెంబరులకు రిబ్బన్లు కట్ చేశారు. కోళ్ళను పట్టుకుని దువ్వి మరీ బరిలోకొదిలారు. మరెక్కడా లేని నిర్బంధం తమపై మాత్రం ఎందుకంటూ వెంప గ్రామస్తులు పోలీసులపై తిరగబడ్డారు. వారి సమక్షంలోనే కోళ్ళకు కత్తులు కట్టి బరిలోకొదిలారు. డింకీ పందాలు మొదలెట్టారు. ఈ దశలో పోలీసులు, గ్రామస్తుల మధ్య తోపులాట జరిగింది. చివరకు తెలుగుదేశం, వైకాపా నాయకుల సూచనల మేరకు పోలీసులు అక్కడ్నుంచి నిష్క్రమించారు.

తూర్పుగోదావరి జిల్లా మురమళ్ళలో పందాల జాతర జోరుగా సాగింది. శనివారం అర్ధరాత్రి నుంచి పందాలు మొదలెట్టేశారు. ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు పందాల్ని స్వయంగా ప్రారంభించారు. పైగా పందాలు జరిగే ప్రాంతంలో గుర్రంపై తిరుగుతూ హల్‌చల్ సృష్టించారు. పందెం రాయుళ్ళకు భరోసా కల్పించారు. అక్కడే గొర్రెల పోటీలు కూడా నిర్వహించారు. పిఠాపురంలో ఎమ్మెల్యే ఎస్‌విఎస్‌ఎన్ వర్మ స్వయంగా పందాలు ప్రారంభించారు. తిమ్మాపురంలో రూరల్ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి ఆమె భర్త సత్తిబాబులు పరస్పరం చెరో పుంజును దువ్వి బరిలో కొదిలారు.

కోర్టు ఉత్తర్వులెలా ఉన్నా పలు వైపుల్నుంచొచ్చిన ఒత్తిళ్ళతో పోలీసులు పట్టు సడలించక తప్పలేదు. ఒకప్పటి సంక్రాంతి సంప్రదాయమైన కోడిపందాలు ఇప్పుడు అతిపెద్ద జూదంగా మారాయి. కొందరికి కోట్లు సంపాదించి పెడుతున్నాయి. ప్రతి ఏటా పందాల మొత్తం పెరుగుతోంది. ఈసారి అత్యద్భుత రీతిలో ఏర్పాట్లు చేశారు. మురమళ్ళ, ముమ్మిడివరం, తాళ్ళరేవు, తిమ్మాపురం, యు కొత్తపల్లి, కోరుకొండ, రాజానగరం, శంఖవరం, ప్రత్తిపాడు, వెంప, భీమవరం, ఉండి, ఆకివీడు, నర్సాపురం తదితర ప్రాంతాల్లో విశాలమైన ప్రాంగణాల్లో బరులేర్పాటు చేశారు. చుట్టూ వీక్షకులనుగుణంగా కుర్చీలేశారు. మధ్యలో పెద్దపెద్ద ఎల్‌ఇడి స్క్రీన్స్ ఏర్పాటు చేశారు. పందాల కోసం కౌంటర్లు కూడా పెట్టారు. కోడిపందాల ప్రదేశాల్లో గుండాట, స్కిల్‌గేమ్స్‌ను యథేచ్ఛగా నిర్వహిస్తున్నారు. దాదాపు ప్రతి పందెం బరి వద్ద ఓ బెల్ట్ షాప్‌ను ఏర్పాటు చేసేశారు. ఇలా విచ్చలవిడిగా రాష్ట్రం మొత్తం జూదకేంద్రంగా మారిపోయింది. ఓ వైపు పందాలు, మరోవైపు నెంబర్ గుండాటలు, ఇంకోవైపు మద్యం విక్రయాల్తో గ్రామాలు తొలిరోజునే హోరెత్తిపోయాయి. సోమవారం నుంచి ఈ పరిస్థితి మరింత తీవ్రంగా ఉంటుందని అంచనాలేస్తున్నారు. ఉభయగోదావరి జిల్లాల్తో పాటు కృష్ణ గుంటూరు జిల్లాల్లో కూడా కోట్ల రూపాయల పందాలు జరిగాయి. తొలిరోజు సుమారు 150కోట్ల వరకు చేతులు మారాయని అంచనాలేస్తున్నారు.



డ్రోన్ కెమెరాల వినియోగం

ఈసారి కోడిపందాల్లో కూడా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞాన వినియోగం మొదలైంది. కోళ్ళ మధ్య పోరాటంలో ప్రతి చిన్న కదలికను స్పష్టంగా రికార్డ్ చేస్తున్నారు. ఇందుకోసం అత్యాధునిక కెమెరాలు వినియోగిస్తున్నారు. వీటిని కంప్యూటర్లతో అనుసంధానించారు. వెంప, భీమవరంలలో అయితే ఏకంగా డ్రోన్ కెమెరాలను కూడా వినియోగిస్తున్నారు. వాటి ద్వారా చిత్రీకరణ చేస్తున్నారు. అలాగే భీమవరంలో ఎసి ఛాంబర్లు ఏర్పాటు చేశారు. పొలాల్లోని పందెం బరుల వద్దే అప్పటికప్పుడు తాత్కాలికంగా ఈఛాంబర్‌లు నిర్మించారు. వాటిలో ఎసిలు ఏర్పాటు చేశారు. విద్యుత్ సరఫరాకు జనరేటర్లు ఏర్పాటు చేశారు. ఒక్క పశ్చిమలోనే సుమారు 800బరులుంటాయని భావిస్తున్నారు. తూర్పులో 450కిపైగా బరులున్నట్లు అంచనాలేస్తున్నారు. రాష్ట్రం మొత్తమ్మీద సుమారు 2వేల బరుల్లో ఈ పందాలు జరిగినట్లు భావిస్తున్నారు. వచ్చే ఏడాది ఎన్నికలుండడంతో ఈ సారి పందాలు రాజకీయరంగును కూడా పులుముకున్నాయి. కోళ్ళకంటే కూడా తెలుగుదేశం, వైకాపాల మధ్యే ఎక్కువగా పోటీలు జరిగాయి. తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ, ప్రత్తిపాడు, పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడు, నర్సాపురం, ఉండి తదితర ప్రాంతాల్లో పార్టీల పేరిట కోళ్ళను బరిలోకొదిలారు.

ఈసారి పందాల కోసం రాష్ట్రంలోని పలు ప్రాంతాల్నుంచి గోదావరి జిల్లాలకు పందెం రాయుళ్లొచ్చేశారు. తమిళనాడు, కర్ణాటక, మహరాష్ట్ర, తెలంగాణాల నుంచి కూడా ఇక్కడికి విచ్చేశారు. వీరందరికీ సకల సదుపాయల్తో కూడిన బసను పందాల నిర్వాహకులు ఏర్పాటు చేశారు. కాగా బీమవరంలో కనుమూరు రఘురామకృష్ణంరాజు స్వయంగా తన ఇంటివద్దే కోడిపందాలకు శ్రీకారం చుట్టడంతో పాటు డింకీపందాలు కూడా ప్రారంభించారు. తొలిరోజు కొన్నిచోట్ల ఒకేకోడిపై 50లక్షల వరకు బెట్టింగ్ జరిగింది. ముఖ్యంగా వెంప, రాజోలు, రామచంద్రపురం, గన్నవరం, కిర్లంపూడి, ఉండి ప్రాంతాల్లో భారీ మొత్తాల్లో పందాలు కాశారు.

చూసేందుకు తరలొస్తున్న జనం

వివాదాలు లేదా కోర్టులో వ్యాజ్యాలు మీడియా ద్వారా వెల్లడౌతున్న సమాచారంతో కోడిపందాల పట్ల సాధారణ జనాల్లో కూడా ఆసక్తి పెరిగింది. గతంలో పండుగంటే దూరాబారాల్నుంచొచ్చే బంధుమిత్రులంతా స్థానికుల ఇళ్ళకు వెళ్ళేవారు. చిన్ననాటి సంగతుల్ని నెమరవేసుకునేవారు. కానీ ఇప్పుడు ఏకావికిన పందెం బరుల వద్దకు పరుగులు తీస్తున్నారు. పెరిగిన ప్రచారంతో కోడిపందాల్ని చూడ్డం ఓ ఫ్యాషన్‌గా మారింది. పైగా సినీ, టివి నటులు కూడా పందాలు కాసేందుకొస్తున్నారన్న ప్రచారంతో వార్ని చూసేందుకు ఎగడుతున్నవారి సంఖ్య గంటగంటకు పెరుగుతోంది. ఈ సారి పందాలకు పలువురు నటుల్ని ఆహ్వానించారు. వీరంతా సోమవారం మురమళ్ళ, భీమవరం తదితర ప్రాంతాలకొచ్చే అవకాశముంది. వీరొచ్చిన విషయం వెల్లడైతే చూసేందుకు ఎగబడే జనం సంఖ్య మరింత పెరుగుతుంది.

శారదా పీఠంలో సంక్రాంతి సంబరాలు

విశాఖపట్నం, ప్రభ న్యూస్ బ్యూరో: విశాఖ శారదా పీఠంలో ఆదివారం సంక్రాంతి సంబరాలు అత్యంత ఘనంగా ప్రారంభమయ్యాయి. పీఠం తూర్పు వైపు భోగి మంటలు వేసి తదుపరి పీఠం ప్రాంగణంలోగల దేవతామూర్తులకు ప్రత్యేక పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. తదుపరి శారదాపీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి ఆయా కార్యక్రమాల్లో పాల్గొని భక్తులకు ఆశీర్వాదం అందజేశారు. ఈ సందర్భంగా స్వరూపా నందేంద్ర భక్తులను ఉద్దేశించి అనుగ్రహ భాషణం చేస్తూ సంక్రాంతి పర్వదినం తెలుగు పండుగల్లో అత్యంత పెద్ద పండుగగా పేరు పొందిందన్నారు. రైతాంగం పండించిన పంట ఇంటికి చేరుకోవడంతోపాటు గ్రామీణ ప్రాంతాల్లో తెలుగు సంస్కృతీ సాంప్రదాయాలకు అనుగుణంగా సంబరాలు నిర్వహించుకోవడంతోపాటు కుటుంబ సభ్యులంతా ఒకేచోట చేరి ఆనందంగా గడపడం జరుగుతుందన్నారు. ఉత్తర పీఠాధిపతి కిరణ్‌కుమార్ శర్మ ఆధ్వర్యంలో ఈ సంక్రాంతి సంబరాలు నిర్వహించగా పలువురు భక్తులు పాల్గొని శారదా మాతను దర్శించుకుని స్వరూపానందేంద్ర ఆశీర్వాదం స్వీకరించారు. జనవరి 24 నుంచి 27 వరకు శారదా పీఠం వార్షికోత్సవాలను వైభవంగా నిర్వహించనున్నారు.

ప్రాణాలు తీసిన పొగమంచు

● నెల్లూరు జిల్లాలో రక్తసిక్తమైన రహదారులు
● వేర్వేరు ప్రమాదాల్లో ఆరుగురు దుర్మరణం



లారీని ఢీకొని నుజ్జునుజ్జయిన ఇన్నోవా కారు

నెల్లూరు (క్రైం), ప్రభ న్యూస్: రోడ్లపై కమ్ముకున్న పొగమంచు వల్ల జరిగిన మూడు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నెల్లూరు జిల్లాలో ఆరుగురు మృతిచెందగా, మరో ఐదుగురు తీవ్రగాయాలతో ఆసుపత్రి పాలైన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. ఎన్‌టీఆర్‌నగర్ జాతీయ రహదారిపై ఆగిఉన్న లారీని ఇన్నోవా వాహనం ఢీకొనడంతో టీపీగూడూరు మండలం వెంకన్నపాళెంకు చెందిన సర్పంచ్ ముత్యాల నరసమ్మ (45), పామంజి మంజుల (42), కారు డ్రైవర్ జాఫర్ (35) అనే ముగ్గురు సంఘటనా స్థలంలోనే దుర్మరణం పాలుకాగా, మరో ఐదుగురు తీవ్రగాయాలతో ఆసుపత్రి పాలయ్యారు. భోగి పండుగ సందర్భంగా నాటుకోడి మాంసం తెచ్చుకుందామని మోటార్‌సైకిల్‌పై వెళ్తున్న మైపాడుగేట్ ప్రాంతానికి చెందిన ఎం సుబ్రహ్మణ్యం (40), జాకీర్‌హుస్సేన్‌నగర్‌కు చెందిన పి వెంకటేష్ (28) అనే ఇద్దరు స్నేహితులను మైపాడుగేటు జాతీయ రహదారిపైన ట్రావెల్స్ బస్సు ఢీకొనడంతో అక్కడికక్కడే ఆ ఇద్దరు స్నేహితులు మృతిచెందారు. రాపూరు మండలం రేవ గుంటపల్లి సమీపంలో అదుపుతప్పి స్కార్పియో బోల్తా పడడంతో నెల్లూరుకు చెందిన రఘు (35) అనే వ్యక్తి మృతిచెందాడు.

భారతీయ శౌర్య ఘనత 'హైఫా'

న్యూఢిల్లీ: స్థానికంగా చరిత్రాత్మక తీన్‌మూర్తి చౌక్‌కు ఇజ్రాయెల్ పట్టణమైన హైఫా పేరు పెట్టారు. ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెటాన్యాహూ ఆదివారం భారత్ విచ్చేసిన సందర్భంగా ఈ ఆసక్తికరమైన ఘట్టం ఆవిష్కృతమైంది. ఇజ్రాయెల్ ప్రధానితోపాటుగా భారత ప్రధాని నరేంద్ర మోడీ నామకరణ కార్యక్రమానికి విచ్చేసి నివాళులర్పించారు.

హైఫాతో భారత్ అనుబంధం

భారత సైన్యం ప్రతి యేడాది సెప్టెంబర్ 23వ తేదీని హైఫా దినంగా జరుపుకుంటుంది. మొదటి ప్రపంచ యుద్ధంలో అత్యంత సాహసోపేతమైన యుద్ధాల్లో ఒకటిగా హైఫా సమరం పేరు పొందింది. 1922లో తీన్‌మూర్తి స్మారక చిహ్నాన్ని నిర్మించారు. జోధ్‌పూర్, హైదరాబాద్, మైసూరు రాజ్యాలకు చెందిన భారతీయ సైనికుల సంస్మరణార్థం ఇది నిర్మితమైంది. మొదటి ప్రపంచయుద్ధం సందర్భంగా ప్రస్తుత గాజా, ఇజ్రాయెల్, పాలస్తీనాలో బ్రిటీష్ ఇండియా సైన్యం తరపున వారు పోరాడారు.

చారిత్రక ప్రాధాన్యం

రైలు, ఓడరేవు లాంటి రవాణా సౌకర్యాలు సంతరించుకున్న ఇజ్రాయెల్ ఓడరేవు నగరమైన హైఫా ఒక వ్యూహాత్మక సరఫరా కేంద్రంగా భాసిల్లింది. హైఫాకు తోడు ప్రస్తుతం ఇజ్రాయెల్ మరియు సిరియాలో ఉన్న నజారెత్, డమాస్కస్‌ను స్వాధీనం చేసుకోవాలని సంకీర్ణ బలగాలు పథక రచన చేశాయి. జోధ్‌పూర్, మైసూరు రాజ్యాలకు చెందిన సైనికులతో కూడిన 15వ అశ్విక బలగం 1918, సెప్టెంబర్ 23న హైఫా నగరం చుట్టుపక్కల ఒట్టోమాన్ టర్కీల స్వాధీనంలో ఉన్న ప్రాంతాలపై దాడి చేసింది. సంఘటనాత్మకంగా బ్రిటీష్ జనరల్ ఎడ్మండ్ అల్లెన్‌బీ నాయకత్వంలోని భారతీయ అశ్విక బలగం టర్కీ, జర్మన్ బలగాల కబంధ హస్తాల్లో ఉన్న హైఫాకు విముక్తి ప్రసాదించడంలో సహాయపడింది.

ఫిరంగులపై ఖడ్గాల గెలుపు

ఈ గెలుపు ఎంతో ప్రత్యేకమైనదిగా నిలిచింది. టర్కీ సైన్యం దగ్గర అత్యంత అధునాతన ఫిరంగులు, మరతుపాకులు ఉన్నాయి. కానీ భారతీయ సైనికులు కేవలం ఖడ్గాలు, బల్లెంతో టర్కీ సైన్యాన్ని ఓడించారు. సైనిక చరిత్రలో కీలకమైన అశ్విక బలగం ప్రదర్శన అన్నట్టుగా భారతీయ సైనికులు అశ్వాలతో అత్యద్భుతమైన యుద్ధ ప్రతిభాపాటవాలను ప్రదర్శించారు. మర తుపాకుల నుంచి తూటాలు తుపానులా మీదకు వస్తున్నప్పటికీ కదనరంగంలో అశ్వాలు వెనుకంజ వేయలేదు. వాటిలో అనేకం యుద్ధానంతరం గాయాలతో మరణించాయి అని మొదటి ప్రపంచ యుద్ధానికి సంబంధించిన అధికారిక చరిత్ర చెబుతోంది. మొత్తంగా 1,350 జర్మనీ, ఒట్టోమన్ సైనికులను రెండు భారతీయ పటాలాలు యుద్ధ ఖైదీలుగా నిర్బంధించాయి. వారిలో ఇద్దరు జర్మనీ అధికారులు, 35 ఒట్టోమన్ అధికారులు ఉన్నారు. 17 ఫిరంగులు, 11 మర తుపాకులను స్వాధీనం చేసుకున్నారు.

విజయంతో వీరస్వర్గం

ఎనిమిది మంది సైనికులు వీరమరణం పొందారు. 34 మంది గాయపడ్డారు. 60 గుర్రాలు మరణించాయి. మరో 83 గాయపడ్డాయి.

కచ్ రోడ్డు ప్రమాదంలో 9 మంది దుర్మరణం

కచ్, గుజరాత్: జిల్లాలోని లోరియా గ్రామ సమీపంలో ఆదివారం ఒక లగ్జరీ బస్సును వ్యాను ఢీకొన్న ఘటనలో వ్యానులో తొమ్మిది మంది ప్రయాణికులు మరణించారని పోలీసులు తెలిపారు. బాధితులు కచ్ నుంచి తిరిగి వస్తుండగా ప్రమాదం జరిగింది. వారిలో ఐదుగురు అక్కడికక్కడే మరణించగా, మరో నలుగురు భుజ్‌లో ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళుతుండగా మృతి చెందారు. బస్సులో తీవ్రంగా గాయపడిన నలుగుర్ని చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతులను విజయ్ దొబరియా(22), మిలన్ కొరడియా(22), విపుల్ ఖొఖర్(21), హర్దిక్ బాంబొరియా(22), గౌరవ్ కొథారియా(22), ప్రశాంత్ కచ్చాడియా(20), రాజ్ వల్లభ్‌సెజాలియా(20), జైదీప్(21), మన్‌సుఖ్‌భాయి(22)గా గుర్తించినట్టు పోలీసు ఉన్నతాధికారి ఒకరు తెలిపారు.

లండన్-భారత్ మధ్య కీలక ఒప్పందాలు

లండన్ : భారత్, లండన్‌కు మధ్య రెండు కీలక ఒప్పందాలు జరిగాయి. లండన్‌లో అక్రమంగా నివసిస్తున్న వారిని తిరిగి భారత్ తీసుకురావాలని, అదేవిధంగా నేరాల పరంగా సహాయ సహకారాలు అందించుకోవడానికి గాను ఒప్పందాలు జరిగాయి. రూ.9వేలకోట్లు ఎగ్గొట్టి లండన్‌లో తలదాచుకున్న విజయ్ మాల్యాను భారత్‌కు రప్పించేందుకు అదేవిధంగా అతనిపై చర్యలు తీసుకునే విషయమై ఇరు దేశాల మధ్య చర్చలు జరిగాయి. దీనికి సంబంధించిన ఒప్పంద పత్రాలను లండన్ ఇమిగ్రేషన్ మంత్రి కరోలిన్ నోక్స్, భారత్ హోంశాఖ వ్యవహారాల మంత్రి కిరణ్ జిజు మార్చుకున్నారు. ఇప్పటికే రెండు దేశాల మధ్య మంచి సఖ్యత ఉందని, మున్ముందు కూడా ఇలాగే కొనసాగాలని ఇరు దేశాల మంత్రులు ఆశాభావం వ్యక్తం చేశారు. అదేవిధంగా భారత్‌లో పెట్టుబడులు పెట్టి, ఆర్థికాభివృద్ధికి దోహదపడాలని కిరణ్‌జిజు లండన్ ప్రభుత్వాన్ని కోరారు. నేరాలకు సంబంధించిన పత్రాలను ఇరు దేశాల అధికారులు ఇచ్చిపుచ్చుకున్నారు. అన్ని రకాల కేసులకు సంబంధించిన విషయాల గురించి చర్చించుకున్నారు.

రైతులకు ఇంధన సామర్థ్య పంపు సెట్లు

● దేశంలో తొలిసారి ఇస్తున్న రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ ● సంక్రాంతి కానుకగా అందిస్తున్నాం: ఏపీ సీఎం చంద్రబాబునాయుడు

అమరావతి, ఆంధ్రప్రభ : కొత్త పంటలు ఇంటి కొచ్చే వేళ.. ధనధాన్యాల, కొత్త బట్టలు, పిండి వంటలతో ప్రజలంతా సంతోషంగా జరుపుకొనే పండుగ సంక్రాంతి. ఇది తెలుగు ప్రజలకు, ముఖ్యంగా అన్నదాతలకు అత్యంత ముఖ్యమైన పండుగ. అలాంటి పండుగ సందర్భంగా మనందరికీ అన్నంపెట్టే అన్నదాతలకు కానుక ఇవ్వాలని నిర్ణయించాం. కేంద్ర ప్రభుత్వ సంస్థ ఎనర్జీ సంస్థ ఎనర్జీ ఎఫిషియన్సీ సర్వీస్ లిమిటెడ్ (ఈఈఎస్‌ఎల్) సహకారంతో విద్యుత్‌ను ఆదాచేసే రూ. 40 వేల విలువైన పంపుసెట్లను ఉచితంగా అందజేయబోతున్నాం. వ్యవసాయ రంగంలో ఇదో విప్లవాత్మక నిర్ణయంగా నిలిచిపోనుంది. రాష్ట్ర ప్రభుత్వం అందించనున్న ఈ పంపుసెట్లను రైతులు ఇంట్లో ఉండే ఆన్, ఆఫ్ చేసుకోవచ్చు. ఇది మరో విశేషం. మొత్తం రాష్ట్రవ్యాప్తంగా 15 లక్షల పాత పంపుసెట్లను మార్చి వాటి స్థానంలో దశలవారీగా ఇంధన సామర్థ్య పంపు సెట్లను, సోలార్ పంపుసెట్లను అందజేస్తామని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు ప్రకటించారు.

రైతులకు రూ. 40 వేల విలువైన ఇంధన సామర్థ్య పెంపు సెట్లను ఉచితంగా అందజేసే ప్రతిష్టాత్మక పథకాన్ని ప్రారంభింస్తున్నట్లు చంద్రబాబునాయుడు ప్రకటించారు. ఆదివారం ఆయన తిరుమలలో శ్రీ వేంకటేశ్వర స్వామి దర్శన అనంతరం నారావారిపల్లెకు చేరుకున్నారు. అక్కడ విద్యుత్ శాఖ అధికారులతో టెలిఫోన్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈపథకాన్ని ప్రవేశపెట్టిన రాష్ట్రం దేశంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఒక్కటేనని పేర్కొన్నారు. ఈ విధంగా ప్రకటించడం తనకు ఎంతో గర్వకారణంగా ఉందన్నారు. మొబైల్‌తో ఆపరేట్ చేసేందుకు సిమ్ కార్డుతో కూడిన స్మార్ట్ ప్యానల్ ఉన్న 5 స్టార్ రేటింగ్‌తో ఈ పంపు సెట్లు అందజేయడం వల్ల రైతులకు లబ్ధి కలుగుతుందన్నారు. ఈ పంపు సెట్లకు ఐదేళ్ల వరకు ఎలాంటి నిర్వహణ మరమ్మతు ఖర్చులు ఉండవన్నారు. ఒక వేళ పంపుల్లో లోపం తలెత్తితే వెంటనే ఎస్‌ఎంఎస్ వచ్చే వ్యవస్థ కూడా ఇందులో ఉంటుందని, అంతేకాకుండా ఈ పనిముట్ల ద్వారా దాదాపు 30 శాతం విద్యుత్ ఆదా అవుతుందని ముఖ్యమంత్రి వెల్లడించారు. ఈ కొత్త పంపు సెట్ల వల్ల రైతులు అర్ధరాత్రి పొలాలకు వెళ్లడం, పాము కాటుకు గురవడం వంటి ప్రమాదాలు తప్పుతాయన్నారు. 2018-19 ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా 4 లక్షల పాత పంపు సెట్ల స్థానంలో కొత్త వాటిని అమర్చేందుకు డిస్కంలు ప్రణాళికలు సిద్ధం చేసుకున్నాయన్నారు.

తమ ప్రభుత్వానికి రైతే ప్రథమ ప్రాధాన్యమని చెప్పారు. పోలవరం ప్రాజెక్టు పూర్తయితే రాష్ట్ర ముఖ చిత్రమే మారిపోతుందన్నారు. అలాగే పట్టిసీమ ద్వారా గోదావరి, కృష్ణానదుల అనుసంధానంతో సాగునీటి వెతలు తీరిపోయాయని చెప్పారు. చిట్టచివరి భూములకు కూడా సాగు నీరు అందిస్తామనే నమ్మకం తనకుందని ధీమా వ్యక్తం చేశారు. నదులు, కాలువలు, వ్యవసాయ పంపు సెట్ల ద్వారా పుష్కలంగా నీరు అందిస్తే మన రైతాంగం పంటలు దిగుబడిలో అద్భుతాలు సృష్టించి దేశానికే ఆదర్శంగా నిలుస్తారని ముఖ్యమంత్రి అన్నారు. ఇంధన సామర్థ్య పంపు సెట్లకు తోడు ప్రభుత్వం రైతులకు కొత్తగా సౌర పంపు సెట్ కనెక్షన్లను కూడా అందించనున్నమని చెప్పారు.

రాష్ట్రంలో 2014 నుంచి రైతులకు నాణ్యమైన, నమ్మకమైన విద్యుత్ సరఫరా అవుతుండటంతో వ్యవసాయ వృద్ధి గణనీయంగా పెరిగిందని సీఎం తెలిపారు. 2015-16, 2016-17 సంవత్సరాల్లో వృద్ధి రేటు 10.95 శాతం, 11.61 శాతంగా నమోదైంన్నారు. ఈ ఏడాది తొలి త్రైమాసికంలో వ్యవసాయ రంగ వృద్ధి రేటు దేశం మొత్తం మీద కేవలం 2.3 శాతం ఉండగా.. రాష్ట్రంలో మాత్రం 27.6 శాతం నమోదైందని, రెండో త్రైమాసికంలో 17.13 శాతం నమోదవడం విశేషమని ముఖ్యమంత్రి వెల్లడించారు. రాయలసీమను ఉద్యాన పంటల కేంద్రంగా రూపొందించాలని నిర్ణయించినట్లు సీఎం తెలిపారు. అన్ని ప్రాంతాలకు నీటి భద్రతపై భరోసా కల్పిస్తేనే 15 శాతం వృద్ధి రేటు సాధ్యమవుతుందని చంద్రబాబు అన్నారు.

కుటుంబ సభ్యులతో ఉల్లాసంగా చంద్రబాబు



తిరుపతి, ప్రభ న్యూస్ బ్యూరో: సంక్రాంతి సంబరాలలో భాగంగా ఏపీ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదివారం రోజంతా కుటుంబ సభ్యులతో కులాసాగా గడిపారు. ఉదయం ఇంటివద్ద భోగి పండగ జరుపుకున్న అనంతరం చంద్రబాబు కుటుంబ సభ్యులతో కలిసి తిరుమలేశుని దర్శించుకున్నారు. తర్వాత చంద్రగిరి మండలం కాశిపెంట్లలోని హెరిటేజ్ డెయిరీ యూనిట్‌లో ఉద్యోగుల పురస్కారాల కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆపై నారావారిపల్లెకు చేరుకున్న చంద్రబాబు రోజంతా కుటుంబ సభ్యులతో, సన్నిహితులతో, గ్రామస్థులతో కులాసాగా గడిపారు. స్వగ్రామమైన నారావారిపల్లిలో సంక్రాంతి సంబరాలు జరుపుకునే ఆనవాయితీ మేరకు చంద్రబాబు శనివారం రాత్రి గ్రామానికి చేరుకున్న విషయం విధితమే. ఆదివారం తెల్లవారుజామున కుటుంబ సభ్యులు భోగిమంటలు వేయగా ఆ కార్యక్రమంలో చంద్రబాబు వియ్యంకుడు హిందూపురం శాసనసభ్యుడు నందమూరి బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం చంద్రబాబునాయుడు సతీమణి భువనేశ్వరి, కొడుకు లోకేష్, కోడలు బ్రాహ్మణి, మనుమడు దేవాంశ్, వియ్యంకుడు నందమూరి బాలకృష్ణ సతీమణి వసుంధర తదితరులు కలిసి తిరుమలకు బయలుదేరి వెళ్లారు. అక్కడ నైవేద్య విరామ సమయంలో క్యూ కాంప్లెక్స్ ద్వారా ఆలయానికి వచ్చిన ముఖ్యమంత్రికి టీటీడీ ఉన్నతాధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి తిరుమలేశుని దర్శనం చేయించారు. రంగనాయక మండపంలో వేదపండితులు వేదాశీస్సులు అందజేయగా టీటీడీ అధికారులు తీర్థ ప్రసాదాలను, టీటీడీ డెయిరీ, క్యాలెండర్లను అందజేశారు. ఆలయం వెలుపలకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రం సుభిక్షంగా ఉండేలా ఆశీర్వదించమని తిరుమలేశుని ప్రార్థించినట్టు తెలిపారు.

సోమవారం పెద్ద పండుగైన సంక్రాంతి సందర్భంగా నారావారిపల్లెలోని తన తల్లిదండ్రుల సమాదుల వద్ద సంప్రదాయబద్ధంగా నిర్వహించే కార్యక్రమాలలో పాల్గొననున్నారు. మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు ఇంటివద్దకు తనను కలవడానికి వచ్చేవారిని కలిసి వారినుంచి విజ్ఞప్తులు స్వీకరించడం, వారితో సమస్యలపై చర్చించడం, అవసరాన్ని బట్టి అధికారులతో సమావేశాలు నిర్వహించడం వంటి కార్యక్రమాలలో పాల్గొంటారని అధికారవర్గాలు తెలిపాయి. 16వ తేది ఉదయం నారావారిపల్లెలో అత్యాధునిక వైద్య సౌకర్యాలతో నిర్మించిన కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను ప్రారంభించి, పుదిపట్ల, రంగంపేట రహదారి విస్తరణ పనులకు శంకుస్థాపన చేస్తారు. అనంతరం రేణిగుంట విమానాశ్రయం చేరుకుని విమానంలో అమరావతికి వెళ్లనున్నారు.

మరిన్ని ఆలింగనాలు చేసుకోండి

● మోడీపై కాంగ్రెస్ సెటైర్లు ● భగ్గుమన్న బీజేపీ... క్షమాపణకు డిమాండ్



న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోడీ ప్రపంచ నేతలను ఆలింగనం చేసుకోవడాన్ని ఎద్దేవా చేస్తూ కాంగ్రెస్ పార్టీ పోస్ట్ చేసిన ట్వీట్‌పై బీజేపీ భగ్గుమంది. క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేసింది. ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతాన్యా హూ భారత్ పర్యటన పురస్కరించుకొని ప్రధాని మోడీ నుంచి మరిన్ని ఆలింగనలు చేయవచ్చునని ట్వీట్ చేసిన కాంగ్రెస్ పార్టీ పనిలో పనిగా ఒక వీడియోను కూడా జోడించింది.ఆ వీడియోలో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయిల్ మాక్రోన్ లాంటి ప్రపంచనేతలను మోడీ ఆలింగనం చేసుకుంటున్న దృశ్యాలు ఉన్నాయి. విమానాశ్రయంలో మోడీ ప్రొటోకాల్‌ను పక్కన పెట్టి మరీ ఇజ్రాయెల్ ప్రధానిని ఆలింగనం చేసుకున్న కొద్ది గంటల్లోనే సదరు ట్వీట్ దుమారం లేపడం విశేషం. దీనిపై కేంద్ర మంత్రి ప్రకాష్ జవదేకర్ స్పందిస్తూ.. అది వారి అపరిపక్వతను, కొరవడిన రాజకీయ విచక్షణను ప్రదర్శిస్తున్నది. కాంగ్రెస్ మన ప్రధానినే కాదు అతిథినీ అవమానించింది. దీనికి ఆ పార్టీ క్షమాపణ చెప్పాలన్నారు.

విజయవాడ దుర్గగుడి ప్రక్షాళనకు కసరత్తు

అమరావతి, ఆంధ్రప్రభ: ఇంద్రకీలాద్రి కనకదుర్గమ్మ ఆలయ ప్రక్షాళనకు కసరత్తు ప్రారంభమైంది. గత కొద్ది రోజుల క్రితం దుర్గగుడి ఇన్‌చార్జి ఈవోగా దేవాదాయ శాఖ కమిషనర్ అనురాధ బాధ్యతలు తీసుకున్న సంగతి తెలిసిందే. ఆమె చెప్పిన విధంగానే ఆలయ ప్రక్షాళనకు శ్రీకారం చుట్టినట్లు సమాచారం. ఆలయంలో జరుగుతున్న వ్యవహారాలపై పూర్తి స్థాయిలో దృష్టి సారించారు. లోపాలు ఒక్కొక్కటి సరిచేసుకుంటూ ముందుకు పోతున్నారంటున్నారు. అందులో భాగంగా కొన్ని బదిలీలు కూడా చేపట్టినట్లు తెలుస్తోంది. మంత్రతంత్ర పూజల వ్యవహారంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆలయ ప్రధాన అర్చకులు బదరీనాథ్‌బాబు సెలవులో ఉండడంతో ఆయన బాధ్యతలను వేరే వారికి అప్పగించారు. పరివేక్షణ సుందరశర్మకు బాధ్యతలు ఇస్తూ అనురాధ ఆదేశాలు జారీ చేయడం చర్చనీయాంశమైంది. దీర్ఘకాలంగా పని చేస్తున్న ఇతర సిబ్బందిపై కూడా కమిషనర్ దృష్టి పెట్టినట్లు తెలిసింది.

మంత్రి లోకేష్‌కు ఇన్నోవేషన్ అవార్డు

అమరావతి, ఆంధ్రప్రభ: ఏపీ రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్‌కు ఏపీజే అబ్దుల్ కలామ్ ఇన్నోవేషన్ ఇన్ గవర్నెన్స్-2018 అవార్డు లభించింది. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల్లో టెక్నాలజీ అనుసంధానంతో గ్రామాల అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలు, అధునాతక సాంకేతికతో పంచాయతీరాజ్ శాఖకు రూపొందించిన డ్యాష్ బోర్డుకుగాను మంత్రికి లోకేష్‌కు ఈ అవార్డును దక్కింది. జనవరి 20న న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో జరిగే కార్యక్రమంలో అందజేయనున్నారు. ఈమేరకు కలామ్ ఇన్నోవేషన్ సెంటర్ ప్రతినిధులు మంత్రి లోకేష్‌కు ఆహ్వానాన్ని పంపారు. ఈ అవార్డుల ప్రారంభోపన్యాసంలో 10 నిమిషాలపాటు ప్రసంగించాల్సిందిగా కూడా తమ ఆహ్వానంలో వారు మంత్రిని కోరారు. ఈకార్యక్రమంలో కేంద్ర మాన వనరుల శాఖ మంత్రి ఉపేంద్ర కుష్వాతోపాటు పలువురు అధికారులు పాల్గొనున్నారు.

రూ.25 వేల కోట్లతో హైటెక్ రోడ్లు

● వ్యూహాత్మక రహదారులతో మారనున్న హైదరాబాద్ రవాణా వ్యవస్థ ● దశల వారీగా పనులు ●2019లోగా ప్రాజెక్టు పూర్తి



హైదరాబాద్, ఆంధ్రప్రభ: హైదరాబాద్ నగరంలో సిగ్నల్ ఫ్రీ రవాణా వ్యవస్థను ఏర్పాటు చేయడానికి ఉద్దేశించి రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వ్యూహాత్మక రహదారుల అభివృద్ధి పథకం (ఎస్ఆర్‌డిపి)లో భాగంగా పలు ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు, కారిడార్ల నిర్మాణం శరవేగంగా జరుగుతున్నాయి. 400 సంవత్సరాల పురాతన నగరమైన హైదరాబాద్ నగరంలోని అత్యంత రద్దీగా ఉన్న రహదారులపై ఫ్లైఓవర్లు, కారిడార్లు, అండర్‌పాస్‌ల నిర్మాణం చేపట్టడం అత్యంత కఠినమైనప్పటికీ వివిధ విభాగాల మధ్య సమన్వయంతో సవాళ్ళను ఎదుర్కొంటూ ఎస్ఆర్‌డిపి పనులను అత్యంత వేగవంతంగా నిర్వహిస్తోంది.

జీహెచ్ఎంసీ రూ.25వేల కోట్ల అంచనా వ్యవయంతో స్కైవేలు, మేజర్ కారిడార్లు, ప్రధాన రోడ్ల నిర్మాణం, గ్రేడ్ సపరేటర్లను ఎస్ఆర్‌డిపీ కింద చేపడుతోంది. వాటి నిర్మాణం ద్వారా 70శాతం ప్రజలకు సులుభమైన సిగ్నల్ వ్యవస్థలేని రవాణా సదుపాయాలను పొందనున్నారు.

ఎస్ఆర్‌డిపీలో చేపట్టనున్న నిర్మాణాలు

గ్రేడ్ సపరేటర్లు, జంక్షన్లు 54, ఎలివేటర్ కారిడార్లు, స్కైవేలు 111 కిలోమీటర్లు, మేజర్ కారిడార్ల అభివృద్ధి 166 కిలోమీటర్లు, ప్రధాన రోడ్ల అభివృద్ధి 348 కిలోమీటర్లు. మొత్తం 23వేల కోట్లతో రూపాయలతో ఎస్ఆర్‌డీపీలో రూ.3200 కోట్ల విలువైన పనులకు టెండర్ ప్రక్రియ పూర్తియి పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఈ ప్రాజెక్టుల్లో ఇప్పటికే మొదటి ప్రాజెక్టు కింద అయ్యప్ప సొసైటీ అండర్‌పాస్ పనులను ఈ నెల 3వ తేదీన మంత్రి కేటీఆర్ ప్రారంభించిన విషయం తెలిసిందే. కాగా ఈ సంవత్సరాంతంలో మరో ఆరు నిర్మాణాలు పూర్తి కానున్నాయి. 2019లో మరో 16 ప్రాజెక్టులు పూర్తి కానున్నాయి.

2018లో పూర్తియ్యే వాటి వివరాలు

మైండ్‌స్పేస్ అండర్ పాస్, చింతలకుంట అండర్‌పాస్ నిర్మాణ పనులు మార్చిలోగా పూర్తి చేస్తారు. అలాగే మైండ్‌స్పేస్ ఫ్లైఓవర్ జూన్ నాటికి, రాజీవ్‌గాంధీ ఫ్లైఓవర్‌ను డిసెంబర్ నాటికి, కామినేని ఎడమవైపు గల ఫ్లైఓవర్ సెప్టంబర్ వరకు, ఎల్బీనగర్ ఎడమవైపు అండర్‌పాస్ పనులను డిసెంబర్‌లోగా పూర్తి చేస్తారు.

2019లో పూర్తి అయ్యే ప్రాజెక్టులు

బయోడైవర్సిటీ ఫ్లైఓవర్ పనులను మార్చిలోగా పూర్తి చేస్తారు. అలాగే బైరామల్‌గూడ ఎడమవైపు ఫ్లైఓవర్, ఎల్బీనగర్ కుడివైపు ఫ్లైఓవర్, కామినేని కుడివైపు ఫ్లైఓవర్, రూ.184 కోట్లతో చేపట్టిన దుర్గం చెరువు కేబుల్ బ్రిడ్జి నిర్మాణ పనులు కూడా మార్చిలోగా పూర్తి చేయనున్నారు. కాగా రూ.150 కోట్లతో చేపట్టిన రోడ్డునంబర్ 45 ఎలివేటెడ్ కారిడార్ పనులు, రూ.333 కోట్లతో షేక్‌పేట్ ఎలివేటెడ్ కారిడార్ పనులు, రూ. 265 కోట్లతో చేపట్టిన కొత్తగూడ గ్రేడ్ సపరేటర్ పనులను జూన్‌లోగా పూర్తి చేస్తారు.

అలాగే రూ. 175 కోట్లతో రేతిబౌలి- నానల్‌నగర్ ఫ్లైఓవర్ పనులను డిసెంబర్‌లోగా పూర్తి చేస్తారు. రూ. 330 కోట్లతో చేపట్టే శిల్పా లేఅవుట్ నుంచి గచ్చిబౌలి ఫ్లైఓవర్ పనులు, రూ. 270 కోట్లతో చేపట్టే చేనంబర్ అంబర్ ఫ్లైఓవర్ పనులు, రూ. 1500కోట్లతో నిర్మించనున్న ఖాజాగూడ టన్నెల్, ఎలివేటెడ్ కారిడార్ పనులను డిసెంబర్‌లోగా పూర్తి చేస్తారు. ఈ పనులు పూర్తి అయితే హైదరాబాద్‌లో రవాణా వ్యవస్థలో పెనుమార్పులు చోటుచేసుకోవడం ఖాయమని తెలుస్తోంది.

'డాక్టర్లు రాయరు.. మందుల షాపువారు అమ్మరు'

'జనరిక్' ప్రోత్సాహం ఏదీ!

● విదేశీటూర్ల మోజుతో డాక్టర్లు ● వారు రాసిన కంపెనీ మందులకే డిమాండ్

● జనరిక్ వైపు మొగ్గుచూపని వైద్యులు ● పేరు లేని కంపెనీలను పట్టించుకోని డ్రగ్ అధికారులు

హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం జనరిక్ మెడికల్ షాపుల ఏర్పాటుకు ఎలాంటి చర్యలు తీసుకున్నా అది ముందుకు సాగడం లేదు. జనరిక్ గురించి చాలా మందికి అవగాహన లేదు. అవగాహన కల్పించడానికి ప్రయత్నించినా రోగులు వినే పరిస్థితిలో లేరు. డాక్టర్లు చెప్పిన మందులనే వాడే పరిస్థితిలో వారు ఉన్నారు. డాక్టర్ రాసిన మందులను రోగి వాడకపోతే అసలు రోగం తగ్గుతుందో లేదో ఆందోళనను డాక్టర్లు రోగికి కల్పిస్తున్నారు. గతంలో నిమ్స్‌లో జనరిక్ మెడికల్ షాపును ప్రారంభించారు. అక్కడి డాక్టర్లు జనరిక్ మందులను రాయకపోవడంతో దానిని మూసివేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. మనం వాడే మందుల్లో జనరిక్ మందులు కూడా ఉంటాయి. కానీ వాటిని మందుల షాపు వారు అమ్మరు. డాక్టర్లు వాటిని రాయరు. ఒకవేళ జనరిక్ మందుల షాపును పెట్టినా మాములు మెడికల్ షాపు వారు వాటిని నడిపించకుండా ముప్పు తిప్పలు పెడుతున్నట్టు పలువురు ఆరోపిస్తున్నారు. డ్రగ్ కంట్రోల్ అధికారులు సైతం జనరిక్ మెడికల్ షాపుల ఏర్పాటు విషయంలో అవగాహన కల్పించడంలో విఫలమ య్యారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

జనరిక్ అంటే...

పేటెంట్ నుంచి బయటకు వచ్చిన మందునే జనరిక్ అంటారు. అంటే ఒక మందును కనుగొన్నప్పుడు దానికి సంబంధించిన పేటెంట్ హక్కుల కోసం (కొంత మొత్తాన్ని కట్టి) కంపెనీ వారు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఒక వేళ ఆ కంపెనీ వారికి పేటెంట్ హక్కు లను కల్పిస్తే 20 సంవత్సరాల వరకు ఆ ఫార్మా కంపెనీయే ఆ మందుపై సర్వహక్కు లను కలిగి ఉంటుంది. 20 సంవత్సరాల తరు వాత పేటెంట్ కాలం అయిపోయిన ఓపెన్ క్యాటగిరీలోకి వస్తుంది. అప్పుడు ఎవ్వరైనా ఆ ఫార్మూలా ను ఫాలో అవుతూ ఆ మందును తయారు చేసుకునే వీలు ఉంటుంది.

జనరిక్ రెండు రకాలుగా ఉంటుంది

జనరిక్ అనేది ప్రతి కంపెనీలో తయారు కావాల్సిందే. మందుల్లో రెండు రకాలు ఉంటాయి.
1.జనరిక్. 2.కమర్షియల్‌గా ఉంటుంది.

కమర్షియల్ అనే వ్యాపారం ప్రస్తుతం సవాజంలో జోరుగా జరుగుతోంది. దీనికే డాక్టర్లతో పాటు మెడికల్ షాపు వారు మొగ్గు చూపుతున్నారు. ప్రతి కంపెనీ తమ మందులను ఎక్కువగా అమ్మినందుకు అనేక రకాలుగా వారికి లాభం చేకూరడం కూడా మందుల కంపెనీలకు కలిసోస్తుంది. జనరిక్ మందులను మాత్రం ఫార్ములా కోసమే తయారు చేస్తూ వాటి ప్రమోషన్ మాత్రం గాలికి వదిలేస్తున్నారు. ప్రభుత్వ పాలసీ ప్రకారం జనరిక్‌కు కూడా ప్రమోషన్ ఇవ్వాలని ఉన్నా వాటి గురించి డాక్టర్లు, మందుల కంపెనీ వారు పట్టించుకున్న పాపానపోవడం లేదు. జనరిక్‌ను గతంలో విదేశాలకు పంపించేవారు ప్రస్తుతం ఇప్పుడు అవగాహన రావ డంతో మన దగ్గర కూడా వాటిని అమ్ముకోవడానికి ప్రభుత్వం పర్మిషన్ ఇచ్చింది.

జనరిక్ పేరుతో నిలువు దోపిడీ

కొందరు జనరిక్ మెడికల్ షాపు పేరుతో నిలువుదోపిడీ చేస్తున్నారు. డ్రగ్ కంట్రోల్ అధికారులు లైసెన్స్ ఇవ్వడం వరకే వారి బాధ్యతగా ఫీలవుతున్నారు. వారు జనరిక్ మెడి కల్ షాపులో ఎలాంటి మందులను వాడుతున్నారో కూడా తనిఖీలు చేయలేని స్థితిలో ఉన్నారు. ఇదే అదునుగా కొంద రు జనరిక్ పేరుతో ప్రజలను నిలువు దోపిడీ చేస్తున్నారు. నాసిరకం మందులను జనరిక్ పేరుతో అమ్ముతూ అవా యకులు మోసం చేస్తూ మూడు పువ్వులు ఆరుకాయలుగా తమ వ్యాపారాన్ని విస్తరించుకుంటున్నారు. జనరిక్‌లో తక్కువ ధరకే మందులు దొరుకుతాయన్న ఆశతో వెళ్లేవారికి అక్కడ కొందరు నాసిరకం మందులు అంటగడుతూ మోసం చేస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

ప్రమోషన్లలో భాగంగా రూ. లక్షల ఖర్చు

మందులు తయారు చేసే కంపెనీలు ప్రమోషన్లలో భాగంగా డాక్టర్లకు లక్షల రూపాయలను ఖర్చు చేస్తున్నాయి. వారికి విదేశీ యాత్రల పేర్లతో లక్షలను ఖర్చు చేస్తూ వైద్యులు అవే మందులను వాడేలా ఒత్తిడి చేస్తున్నాయి. దీంతో వైద్యులు కూడా కంపెనీలు లాభాల బాటలో నడిచేలా తమకు తోచిన విధంగా సాయపడు తున్నారు. దీంతో పాటు జనరిక్ మందుల షాపు పేరుతో మందుల షాపు నడిపించే కొందరు పర్మిషన్ లేని అసలు పేరు ఊరు లేని మందులను అమ్ముతున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ విషయమై డ్రగ్ కంట్రోల్ అధికారులకు ఎలాంటి ఫిర్యా దులు అందినా పట్టించుకున్న పాపానపోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

ఆయుష్ జనరిక్ మందులు 80-90 మాత్రమే

కేంద్ర ప్రభుత్వం ఆయుష్ డిపార్ట్‌మెంట్ నుంచి తమ మందులను తామే తయారుచేస్తూ ఆలిండియా వ్యాప్తంగా జనరిక్ డిస్ట్రిబ్యూటర్ నిర్వహిస్తుంది. జనరిక్ మెడికల్ షాపు పెట్టిన వారు ఆయుష్ మందులనే అమ్మాలన్న రూల్ ఉంది. దీంతో చాలామంది ఆయుష్ మందులను అమ్మడానికి వెనుకడుగు వేస్తున్నారు. జనరిక్ మెడికల్ షాపును ఆయుష్ నుంచి పర్మిషన్ తీసు కుంటే మాత్రం ఆయుష్‌కు సంబంధించి ఉత్పత్తులను అమ్మాల్సి ఉంటుంది. ఆయుష్‌కు సంబంధించి 80 నుంచి 90 వరకు మాత్రమే వారి మందులు ఉంటాయి. దీనివల్ల వారికి పెట్టిన పెట్టుబడి రాదన్నది మెడికల్ షాపు నిర్వాహకుల ఆలోచన.

వేళ్లమీద లెక్కపెట్టే స్థాయిలో షాపులు



గాంధీ ఆస్పత్రుల్లో ఉన్న జనరిక్ మెడికల్ షాపు రెడ్ క్రాస్ పరిధిలో నడుస్తుంది. ఉస్మానియలో రెండు జనరి క్ షాపులు ఉన్నాయి. నిమ్స్ లో గతంలో ఉండేది. ప్రస్తు తం లేదు. వేళ్ల మీద లెక్కపె ట్టే స్థాయిలో జనరిక్ షాపు లు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నాయి. ఇవి నడవకపోవడానికి మెయిన్ విలన్‌గా డాక్టర్లనే చెప్పవచ్చు. డాక్టర్లకు మెడికల్ షాపు వారికి జనరిక్ మెడికల్ షాపులంటే పడదు.

మండలానికి ఒకటి లేదా రెండు

ప్రధాన మంత్రి జన ఔషధి పథకం కింద 3, 000 జనరిక్ షాపులను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావించింది. అందులోభాగంగా మండలానికి ఒకటిలేదా రెండు షాపుల ఏర్పాటుకు నడుంబిగించింది. కొన్ని మండలాల్లో అవి ప్రారంభం అయినా ఆ తరువాత వాటికి పెట్టిన పెట్టుబడి రాక మూసివేశారు. కొన్ని చోట్ల అంతంత మాత్రం గా నడుస్తున్నా స్థానికంగా మాములు మెడికల్ షాపు వాళ్లు స్థానిక డాక్టర్లు జనరిక్ మందులను రాయకపోయే సరికి ఈ షాపులను నిర్వహించే వారు ఇబ్బందులు పడుతున్నారు. గవర్నమెంట్ ఆస్పత్రుల్లో రోగికి ప్రభుత్వమే మందులను పంపిణీ చేయాల్సి ఉన్న అరకొరగా వాటిని పంపిణీ చేస్తూ వైద్యులు, సిబ్బంది చేతులు దులుపు కుంటున్నారు.



భారత వికాస్ జనరిక్ పరిషత్ పేరుతో 16 షాపుల నిర్వహిస్తున్నాం: కాశీవి.రావు

భారత్ వికాస్ జనరిక్ పరిషత్ ట్రస్టు కింద (భారత్ వికాష్ జనరిక్ పరిషత్) పేరుతో హైదరాబాద్‌లో 16 షాపు లను నిర్వహిస్తున్నాం. అందులో 350 జనరిక్ మందు లను అమ్ముతాం. ఆయుష్ డిపార్ట్‌మెంట్ నుంచి జనరిక్ మెడికల్ షాపును నిర్వహించమని అడిగారు. ఆయుష్ వాళ్లకు 80-90 రకాల మందుల ఉత్పత్తులు మాత్రమే ఉన్నాయి. అందుకే ఆ ప్రతిపాదనను విరమించు కొని మాములు జనరిక్ మెడికల్ షాపును నిర్వ హిస్తున్నాం. 5 శాతం లాభంతోనే ఈ జనరిక్ మందుల షాపు నడి పిస్తున్నాం. వచ్చిన 5 శాతం లాభాన్ని కూడా పేదలకు ఉచితంగా వైద్యం నిర్వహించడానికి వినియోగిస్తున్నాం. వారం రోజుల్లో 60 బస్తీలను గుర్తించి 2 సంవత్సరాలు పాటు అక్కడే శిబిరాలను నిర్వహిస్తున్నాం. వచ్చిన 5 శాతాన్ని కూడా ఈ మొబైల్ క్లీనిక్‌కే వినియోగిస్తున్నాం. ప్రతిరోజు హైదరాబాద్‌లో ఉన్న 16 షాపులకు 2,200 మంది సందర్శిస్తుండగా లక్ష రూపాయల వరకు సేల్ జరుగుతుంది. బ్రాండెడ్ జనరిక్ మందులనే వాడతాం. కమర్షియల్ మందులను మేము వాడం. మా దగ్గర పనిచేసి వెళ్లిపో యిన కొందరు కమర్షియల్ స్ట్రిప్ చూపించి జనరిక్ మందులను అమ్ముతున్నారు. మేము లాభం కోసం ఈ షాపులను నడపడం లేదు. జనరిక్ మెడికల్ షాపులను ప్రభుత్వం ప్రోత్సహించాలి. అందులో ప్రాఫిట్ లేదని చాలామంది చెబుతున్నారు. అవన్నీ తప్పుడు ప్రచారం. వాటిని డ్రగ్ కంట్రోల్ అధికారులు ప్రోత్సహించరు. మాములు మెడికల్ షాపు వాళ్లు వాటిని నడవనివ్వరూ.

జనరిక్ మందులు అమ్మితే తక్కువ లాభం

మందులను తయారు చేసే కంపెనీలు అన్ని కూడా జనరిక్ మందులను తయారు చేయాలని ఆదేశాలు ఎవ్వరూ కూడా వాటిని పట్టించుకున్న దాఖలాలు లేవు. జనరిక్ మందులు ఎక్స్‌పైయిరీ తేదీ అయిపోతే వాటిని ఆ కంపెనీ వారు రిటర్న్ తీసుకోరూ. అదే జనరిక్ కాక వేరే మెడిసిన్ అయితే ఎక్స్‌పైయిరీ తేదీ అయిపోయినా వాటిని ఆ కంపె నీ వారు రిటర్న్ తీసు కుంటారు.

బ్రాండెడ్ మందులు మెడికల్ షాపుల వారికి కాసుల వర్షాన్ని కురిపిస్తున్నాయి. బ్రాండెడ్ మందులను పేదలను అంటగట్ట డానికి కంపెనీలు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ నియమించుకొని తమ వ్యాపారాన్ని మూడు పువ్వులు ఆరు కాయలుగా విస్తరించుకుంటు న్నాయి. చాలామంది రోగులకు జనరిక్ మందుల గురించి తెలియదు. జనరిక్ మందులను అమ్మితే మాకు తక్కువ మొత్తంలో కమీషన్ వస్తుంది. మాములు మందులకు ఎక్కువగా వస్తుంది. అందుకే జనరిక్ మెడికల్ షాపు పెట్టడానికి ఎవరూ ముందుకు రావడం లేదు. ప్రభుత్వం, అధికారుల నుంచి ఎలాంటి ప్రోత్సాహం లేదు.

మెడికల్ షాపు నిర్వాహకుడు, కిషన్, హైదరాబాద్

బయట షుగర్ ట్యాబ్‌లెట్ 100 రూ ఉంటే జనరిక్‌లో అయితే 12 రూపాయలకే దొరుకుతుంది. నగరం లోని ఉస్మానియా, గాంధీలో జనరిక్ మందుల షాపుల వద్ద రద్దీ ఎక్కువగా ఉంటుం ది. ఈ మధ్య చాలామందికి జనరిక్ మీద అవగాహన వచ్చిం ది. మాములు మెడికల్ షాపు వారు కూడా జనరిక్ మందులను అమ్మడానికి కొంత మొగ్గు చూపుతున్నారు. దగ్గు, జలుబు, జ్వరం, షుగర్, బీపీ తదితర వాటితో పలు రకాల జనరిక్ మందులను అందుబాటులో ఉంచుతున్నారు. బ్రాండెడ్ ధరలతో పోలిస్తే సుమారు 70-80 శాతం వరకు జనరిక్ మందులు తక్కువ ధర ఉంటాయి.

త్వరలో అధికారులతో సమీక్ష



సామాన్య జనాలకు అందుబాటులో ఉండే విధంగా మందులు ఉండాలి. ఆ దిశగా కూడా ఆలోచన జరుగుతుంది. ఆరోగ్య శ్రీ కింద ఎమర్జెన్సీ రోగులకు ఉచితంగా మందులను పంపిణీ చేస్తున్నాం. జనరిక్ మందుల పంపిణీ, మందుల షాపుల గురించి కూడా విస్తృతంగా ఆలోచిస్తున్నాం. దీనిపై ప్రభుత్వం కూడా త్వరలోనే తమ నిర్ణయాన్ని ప్రకటించనుంది. జనానికి ఎలా మేలు జరుగుతుందోనన్న దానిపై చర్చతోపాటు అధ్యయనం జరుగుతుంది. జనరిక్ మెడికల్ షాపుల నిర్వహణపై కూడా వ్యాపారులకు, ప్రజలకు అవగాహన కల్పించేలా అధికారులతో సమీక్ష జరుపుతాం.

భాగ్యనగరానికి మహా ప్రణాళిక!

● మాస్టర్ ప్లాన్‌లో అస్పష్టత ● ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల్లో ప్రతిష్టంభన

● గతంలో పారిశ్రామికవాడలు ● నేడు నివాస ప్రాంతాలు

● సమగ్ర ప్రణాళికకు మళ్లీ సవరణలు

● ప్రభుత్వ నిర్ణయం కోసం దరఖాస్తు దారుల నిరీక్షణ



హైదరాబాద్, ఆంధ్రప్రభ: మాస్టర్ ప్లాన్‌లో అస్పష్టత కారణంగా ప్రజలు అనేక అవస్థలను ఎదుర్కొంటున్నారు. ఏ నిబంధనలను పాటించాలో తెలియక తికమకపడుతున్నారు. ప్రణాళికను రూపొందించే సమయంలో సంబంధిత ఉన్నతాధికారులు అన్ని కోణాలను పరిగణలోకి తీసుకోలేకపోవడం వల్ల పలు రకాల సమస్యలు తలెత్తుతున్నాయి. ఇది ప్రజలకు పడరాని పాట్లకు గురి చేస్తోంది. తీవ్ర ఆందోళనకు, ఆవేదనకు గురి చేస్తోంది. పైసా..,పైసా కూడబెట్టి సంపాదించుకున్న డబ్బు పెట్టి అతి కష్టంగా స్థలాన్ని కొనుగోలు చేసి దానిని ఎల్ఆర్ఎస్ కింద దరఖాస్తు చేసుకుంటే....అధికారులునిర్ధాక్షణ్యంగా తిరస్కరిస్తున్నారు. గతంలో నివాస ప్రాంతాలుగా పేర్కొన్న అధికారులు ప్రస్తుతం కొత్త మాస్టర్ ప్లాన్‌లో పరిశ్రమల జోన్‌గా చూపించారు. దీంతో కొత్త మాస్టార్ ప్లాన్ ఆధారంగా సదరు ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను అధికారులు తిరస్కరిస్తున్నారు. ఇది చూసి బాధితులు అవాక్కు అవుతున్నారు.గతం నాలుగు మాస్టర్ ప్లాన్‌లు అమలులో ఉండగా2013లో హైదరాబాద్ మెట్రోపాలి టన్ అథారిటీ పేరున హెచ్ఎండిఏ అధికారులు కొత్తగా ఐదవ ప్రణాళిలను రూపొందించారు. 2031 వరకు అమలులో ఉండే విధంగా దీనిని రూపొందించారు. అయితేప్రణాళికను రూపొందించే సమయంలో సంబంధితఅధికారులు ముందుగా సమగ్రంగాక్షేత్ర స్థాయి పరిశీలన చేసిన తరువాత ఆయా ప్రాంతాలను జోనింగ్ చేసి బృహత్తర ప్రణాళికలను రూపొందించాలి. కానీ హెచ్ఎండిఏ ప్రణాళికల్లో పారిశ్రామిక ప్రాంతంగా చూపిన పటంలో కాలనీలు ఏర్పడ్డాయి. ఇలాంటివి సుమారు ఆరువందలపైచీలుకు ఉన్నట్లుగా తెలుస్తోంది. హెచ్ఎండిఏ ప్రణాళికలో ఒక ప్రాంతాన్ని పరిశ్రమల జోన్‌గా ప్రకటిస్తే.... మరో బృహత్తర ప్రణాళిక దానిని గృహ అవసరాల జోన్‌గా పేర్కొన్నది. ఇలా 82 ప్రాంతాలను పూర్తిగా పరస్పర విరుద్ధంగా చూపారు.2012లో నాటి ప్రభుత్వంలోని ముఖ్య ప్రజాప్రతి నిధులు కొందరికి ప్రయోజనం కలిగించేందుకు వీలుగా ఈ వ్యూహం రూపొందించారన్న ఆరోపణలు న్నాయి. చెరువులను తప్పించి అందులో నిర్మాణాలకు అనుమతి ఇవ్వడం ద్వారా రూ. కోట్లు చేతులు మారాయన్న ఆరోపణలు అప్పట్లో బలంగా వినిపించాయి. మరోవైపు దాదాపు 50 నివాస ప్రాంతాలను పరిశ్రమలతో పాటు ఇతర నిషేధిత జోన్లుగా హెచ్ఎండిఏ చూపించడంతో అక్కడ స్థలాల క్రమబద్ధీకరణ పథకం (ఎల్ఆర్ఎస్) కింద వేలాది మంది పెట్టుకున్న దరఖాస్తుల తిరస్కరణకు గురవుతున్నాయి. దీంతో గత్యంతరం లేక చాలామంది అక్రమ నిర్మాణాలు చేపడుతన్నారు. నిజానికి ఇవన్నీ నివాస ప్రాంతాలే కాబట్టి....బృహత్తర ప్రణాళికను సవరణ చేస్తే వేలాదిమందికి లబ్ది చేకూర్చే అవకాశముందని అధికారులు సైతం చెబుతున్నారు. ఇలాంటి ఘటనలు బోడుప్పల్ పరిసర ప్రాంతాల్లో అధికంగా ఉన్నాయి. బోడుప్పల్లో ప్రస్తుతం లక్షలాది మంది నివాసాలను ఏర్పాటు చేసుకుని జీవిస్తున్నారు. కానీ హెచ్ఎండిఏ మాస్టర్‌ప్లాన్‌లో ఇక్కడ కొంత ప్రాంతాన్ని పరిశ్రమల జోన్‌గా చూపించారు. అయితే పరిశశ్రమల జోన్‌గా చూపించిన ప్రాంతంలో వేలాది ఇళ్ళు ఉన్నాయి. అలాగే సంగారెడ్డిలోని కొంత భూబా గాన్ని కూడా నివాసేతర ప్రాంతంగా చూపారు. పటాన్ చెరువులో ఒకప్పుడు పరిశశ్రమలున్నప్పటికీ ప్రస్తుతం అక్కడ కూడా పెద్దఎత్తున నివాసాలు వెలిశాయి. ఈ నేపథ్యంలో ఖాళీ స్థలాన్ని కొనుగులు చేసుకున్నవారు ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తు చేస్తే... ఇది పారిశ్రామిక ప్రాంతమం టూ అధికారులు వాటిని తిరస్కరిస్తున్నారు. అసలు పరిశ్రమల ఉనికి లేని ప్రాంతాల్లోని దాదాపు ఐదు వేల ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయి. కొందరు దరఖాస్తు దారులకు అయితే సంబంధిత అధికారుల నుంచి విచిత్రమైన సమాధానం వస్తోంది. మీరు ప్రతిపాదించిన స్థలం రెండు మాస్టర్ ప్లాన్ రహదారుల మధ్యన ఉంది....కాబట్టి మీ దరఖాస్తును తరిస్కరిస్తున్నాం అని బహిరంరంగానే చెబుతున్నారు. దీంతో అధికారుల తీరుపై ప్రజలు తీవ్రంగా ఆందోళన చెందుతున్నారు. ప్రణాళికల్లోని దొర్లిన తప్పులకు తమను ఎలా బలిచేస్తారని ప్రశ్నిస్తున్నారు. దీనిపై ప్రజల నుంచి పెద్దఎత్తున ఆగ్రవేశాలు , ఆందోళనలు చెలరేగడంతో హెచ్ఎండిఏ అధికారులు తమ సిబ్బందితో కొంతకాలం క్రితం మరోసారి క్షేత్ర స్థాయి పరిశీలన జరిపించారు. ఒకప్పటి పారిశ్రామిక ప్రాంతాలు ఇప్పుడు చాలావరకు కాలనీలుగా ఉన్నట్లు గుర్తించారు. దీంతో సమగ్ర ప్రణాళికను సవరిస్తే ఐదువేల మందికి పైగా మేలు జరుగుతుందని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్ళారు. జరిగిన తప్పును సవరించుకునేందుకు అధికారులు నడుంబిగించారు. దరఖాస్తుదారుల నుంచి తగు లేఖలు తీసుకుని, భూవినియోగాన్ని మార్పు చేయాల్సిందిగా ప్రభుత్వంఅనుమతి కోసం పంపారు. దీనికి మరికొంత సమయం పట్టే అవకాశముందని అధికారులు చెబుతున్నారు. దీంతో ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్న వారంతా ప్రస్తుతం ప్రభుత్వ నిర్ణయం కోసం నిరీక్షిస్తున్నారు.

ఆదాయమెలా!?

హెచ్ఎండీఏ మల్లగుల్లాలు

● త్వరలో 18 లే ఔట్లకు ఈ-వేలం

● ఉప్పల్ భగాయత్ ప్లాట్లను విక్రయించాలని నిర్ణయం

● మొత్తం రూ.700 కోట్లు సమీకరించేలా కసరత్తు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఆర్థికంగా చితికిపోయిన హెచ్ఎండీఏను తిరిగి పరిపుష్టిని చేసే విధంగా సంబంధిత ఉన్నతాధికారులు అడగులు వేస్తున్నారు. శరవేగంగా నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా నగర శివారు ప్రాంతాల్లో పలు లేఅవుట్లను విక్రయించాలని తలపెట్టింది. సంక్రాంతి పండగ అనంతరం గుర్తించిన 18 లేఅవుట్లలోని ప్లాట్లకు ఈ-వేలం ద్వారా విక్రయించాలని నిర్ణయించారు. ఈ లేఅవుట్లలో సుమారు 120 ప్లాట్లు ఉన్నాయి. వీటిని విక్రయించిన అనంతరం ఉప్పల్ భాగయత్ ప్రాంతంలోని ప్లాట్లను విక్రయించనుంది. ఇలా విక్రయాల ద్వారా మొత్తంగా రూ. 700 కోట్ల సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది.

గతంలో కూడా ఇలాంటి ప్రక్రియ చేపట్టి పెద్దఎత్తున ఆదాయాన్ని సమకూర్చుకున్న హెచ్ఎండీఏ మరోసారి ప్లాట్లను వేలం వేసేందుకు రంగం సిద్దం చేసుకుంది. ఇందుకోసం పద్దెనిమిది లేఅవుట్లను హెచ్ఎండిఏ అభివృద్ధి చేసింది. ఇందులో ప్లాట్ల విక్రయాల ద్వారా సుమారు రెండువందల కోట్ల రూపాయల వచ్చే అవకాశముందని అధికారులు భావిస్తున్నారు. ఆయా లేఅవుట్లలో ఉన్న 160 స్థలాలను మార్కింగ్ చేసిన అధికారులు వాటిని జీపీఎస్ పద్ధతిన జియో ట్యాగింగ్ చేసేందుకు కూడా కసరత్తు చేస్తున్నారు. జీపీఎస్ లొకేటర్ ద్వారా ప్లాట్ల ఆకృతులను తెలుసుకోనున్నారు. సర్వే ఆఫ్ ఇండియా సహకారంతో ఈ పనులను దాదాపుగా ఇప్పటికే పూర్తి చేశారు. రియల్‌బూమ్ ఉన్నప్పుడు 24 లేఅవుట్లను హెచ్ఎండిఏ అభివృద్ధి చేసింది.వాటిల్లో ఆరు లేఅవుట్లలో అన్ని ప్లాట్లు అమ్ముడుపోగా, మిగిలిన 18 లేఅవుట్లలలో స్ట్రే బీట్‌లు,కర్వ్, ఓపెన్, గిఫ్టు ల్యాండ్ ప్లాట్లుఉన్నాయి. వీటి విక్రయానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. మియాపూర్, చందానగర్, వనస్థలిపురం, సరూర్‌నగర్, మాదాపూర్, తెల్లాపూర్, నల్లగండ్ల తదితర ప్రాంతాల్లో ఈ లేఅవుట్లలో ఉన్న ప్లాట్లను గుర్తించి అధికారులు వేలం వేయాలని తలపెట్టారు. ఈ విక్రయాల్లో ప్రభుత్వం బేసిక్ విలువ కంటే 1.5 రేట్లు ఎక్కువగా కనీస ధరనుపెట్టాలని అధికారులు నిర్ణయించినట్లుగా తెలుస్తోంది. కొనుగోలుదారుడు డబ్బులుచెల్లించిన నెల రోజులలోపు రిజిస్ట్రేషన్ ప్రక్రియను అధికారులు పూర్తి చేస్తారు. స్టాంపుడ్యూటీ, రిజిస్ట్రేషన్ ఛార్జీలను కొనుగోలుదారుడే భరించాల్సిఉంటుంది. కాగా 18 లే అవుట్ ప్లాట్ల విక్రయాల అనంతరం ఉప్పల్ భగాయత్ ప్లాట్ల విక్రయాలను అధికారులు చేపట్టనున్నారు. 2005లో ప్రభుత్వం చేపట్టిన మూసీ రివర్ కన్జర్వేషన్ అండ్ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్‌లో భాగంగా ఉప్పల్ భగాయత్ రైతుల నుంచి 733 ఎకరాలను సేకరించిన విషయం తెలిసిందే. ఇందులో మెట్రో రైలు డిపో, జలమండలి మురుగు శుద్ధి నీటి కేంద్రం, మూసీ సుందరీకరణ ప్రాజెక్టు కొంత స్థలం కేటాయించింది. మిగిలిన 413.32 ఎకరాల్లో 20వేల చదరపు గజాల్లో ఉప్పల్ భగాయత్ పేరుమీద లేఅవుట్‌ను అభివృద్ధి చేసింది. రాష్ట్ర విభజన, కోర్టు కేసులు, యూఎల్‌సీ వల్ల భూములు కోల్పోయిన రైతుల్లో 1,520 మందికి గత ఏడాది మార్చిలో లాటరీ రూపంలో ప్లాట్లు కేటాయించారు. మిగిలిన లక్షా ఇరవైఐదువేల చదరపు అడుగల్లో ఉన్న ప్లాట్లను ఇప్పుడు విక్రయించాలని అధికారులు నిర్ణయించారు. గజానికి ధరను రూ. 20వేల నుంచ రూ.35వేల వరకు నిర్ణయించినట్లుగా సమాచారం. దీని ద్వారా సుమారు రూ.350 నుంచి 500 కోట్ల ఆదాయం సమకూరనుందని అధికారులు అంచనా వేస్తున్నారు. మొత్తంగా అన్ని ప్లాట్ల విక్రయాలను కలిసి రూ.700 కోట్ల మేరకు ఆదాయం లభించనుందని భావిస్తున్నారు.

స్మారక చిహ్నంగా నారిమన్

ముంబై : 26/11న ఉగ్రవాదులు నారిమన్ హౌస్‌లో బీభత్సం సృష్టించారు. చాలా మంది ముష్కరుల దాడిలో ప్రాణాలు కోల్పోయారు. దీంతో నారిమన్‌ను మెమోరిల్‌ను స్మారక చిహ్నంగా మార్చారు. గతంలోనే ఈ నిర్ణయాన్ని తీసుకున్నా.. ఈ వారంలో ఇజ్రాయెల్ ప్రధాని బెంజిమెన్ నేతాన్యాహ వస్తుండటంతో అధికారికంగా ప్రకటించారు. నారిమన్ హౌస్‌లో రబ్బీ గావ్రియల్, రివ్క హోల్ట్జ్‌బర్గ్‌లు దంపతులు చనిపోయారు. చాబడ్ హౌస్‌లో కూడా ఉగ్రవాదులు జరిపిన కాల్పులకు ఆరుగురు అసువులు బాశారు. 2008లో 10 మంది పాకిస్థానీ ఉగ్రవాదులు ఈ మారణహోమానికి పాల్పడ్డారు. మరణించి దంపతులకు రెండేళ్ల కుమారుడు మోషే హోల్జ్‌బర్గ్‌ను నేవీ సిబ్బంది రక్షించారు. నారిమన్ స్మారక చిహ్నంగా మారుస్తున్నట్టు నారిమన్ ప్రస్తుత అధినాయకుడు రబ్బీ ఇజ్రాయెల్ కోజోల్‌లో వాస్కి ప్రకటించారు. నారిమన్ అన్ని వర్గాల ప్రజలకు స్ఫూర్తిగా నిలవడానికిగాను ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఆయన తెలిపారు. మృతి చెందిన దంపతులకు సంబంధించిన విగ్రహాలను సైతం ఏర్పాటు చేసినట్టు వివరించారు.

చర్చల పర్వం

- సుప్రీం సంక్షోభంపై చర్చలు షురూ • జడ్జిలతో బీసీఐ భేటీ
- అంతర్గతంగా వివాదం పరిష్కారం దిశగా మంతనాలు
- న్యాయ వ్యవస్థ ప్రతిష్ఠను కాపాడాలని వినతి



న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు సంక్షోభనివారణకు న్యాయమూర్తులు, న్యాయవాద సంస్థల ప్రతినిధులు చర్చలు మొదలుపెట్టారు. బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీసీఐ) ఏర్పాటుచేసిన ఏడుగురు సభ్యుల బృందం ప్రధాన సుప్రీంకోర్టు ప్రధానన్యాయమూర్తిపై ఆరోపణలు చేసిన జడ్జిల్లో ముఖ్యులైన జస్టిస్ జస్తి చలమేశ్వర్ ను కలిసింది. బీసీఐ ఛైర్మన్, సీనియర్ న్యాయవాది మనన్ కుమార్ నేతృత్వంలోని ఈ బృందంసుప్రీంసంక్షోభ ప్రభావం న్యాయ వ్యవస్థపై ఏ విధంగా ప్రభావితం చేస్తుందన్న విషయాన్ని వివరించినట్లు సమాచారం. న్యాయవ్యవస్థలోని సమస్యను అంతర్గతంగానే పరిష్కరించుకుందామని వారంతా చలమేశ్వర్‌కు నచ్చజెప్పిన ట్లు ప్రచారం జరుగు తోంది. అయితేఅంతకు ముందు బీసీఐ బృందం సుప్రీంకోర్టులోని ఏడుగురు ఇతర న్యాయమూర్తులతో చర్చలు జరిపిన ట్లు బార్ కౌన్సిల్ వర్గాల సమాచారం. బీసీఐ బృందం కలిసిన వారిలో జస్టిస్ ఆర్.కె అగర్వాల్ కూడా ఉన్నట్లు తెలుస్తోంది. సుప్రీంకోర్టుసీజేఐనికలిసేందుకు అపాయింట్‌మెంట్‌కోరానని వారు అగర్వాల్ ను కోరినట్లు తెలుస్తోంది. కొంత మంది సుప్రీంకోర్టు న్యాయమూర్తులు ఢిల్లీలో అందుబాటులో లేరని..వారి తిరిగొచ్చిన తర్వాత కలిసేందుకు బీసీఐ బృందం సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది.

చలమేశ్వర్‌తో ఇద్దరు సుప్రీం జడ్జిల భేటీ

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రాపై ఆరోపణలు చేసిన నలుగురు న్యాయమూర్తుల్లో ఒకరైన జస్టిస్ జాస్తి చలమేశ్వర్ ను సర్వోన్నత న్యాయస్థానం లోని ఇద్దరు న్యాయమూర్తులు కలిశారు. జస్టిస్ ఎస్.ఏ.బోబ్డే, జస్టిస్ ఎల్.నాగేశ్వరరావు లు ఆదివారం సాయంత్రం చలమేశ్వర్‌తో చర్చలు జరిపారు. న్యాయవ్యవస్థకు సంబంధించిన వ్యవహారాలను అంతర్గతంగానే చర్చించి పరిష్కరించుకుందామని వారు వివరించినట్లు సమాచారం. న్యాయమూర్తులు మీడియా ముందు లేవనెత్తిన అంశాలపై ప్రధానం గా చర్చ జరిగినట్లు తెలుస్తోంది. సుప్రీం జడ్జిలు మీడియా ముందుకు రావడంపై ఉత్పన్నమైన పరిణామాలు..తదుపరి అవలం భించాల్సిన తీరుపై కూడా చర్చించినట్లు ప్రచారం జరుగుతోంది.

సీజేఐకి రిటైర్డ్ జడ్జిల బహిరంగ లేఖ

సుప్రీంకోర్టు వ్యవహారంపై నలుగురు రిటైర్డ్ జడ్జిలు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి బహిరంగ లేఖ రాశారు. ఈ నలుగురిలో సుప్రీంకోర్టుమాజీ న్యాయమూర్తి పి.బి సావంత్, ఢిల్లీ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఏపీ షా, మద్రాస్ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి కె. చంద్రు, బాంబే హైకోర్టు మాజీ న్యాయమూర్తి హెచ్ సురేష్ ఉన్నారు. సుప్రీంకోర్టు పాలనా వ్యవహారాలు, ప్రధాన న్యాయమూర్తి తీరుపై నలుగురు న్యాయమూర్తులు లేవనెత్తిన అంశాలతో తాము ఏకీభవిస్తున్నట్టు రిటైర్డ్ జడ్జిలు లేఖలో పేర్కొన్నారు. ఈ లేఖ సోషల్ మీడియాలో వైరల్ అయింది. కీలక కేసులు సరైన క్రమంలో కేటాయించడం లేదని.. సీనియర్ జడ్జిలకు సీరియస్ కు కాకుండా జూనియర్ న్యాయమూర్తులకు కేసులు అప్పగించ వంటి అంశాలు తమదృష్టికి వచ్చాయన్నారు. ఏకపక్షంగా వ్యవహరించే జూనియర్ జడ్జిలకు కేసుల అప్పగింత వల్ల న్యాయవ్యవస్థ పరిపాలనా విధానాలపై తీవ్ర ప్రభావం చూపుతోందని ఆరోపించారు.నలుగురు న్యాయమూ ర్తులు లేవనెత్తిన అంశాలతో తాము ఏకీభవిస్తున్నామని..సీజేఐ కేసుల అప్పగింతలో రోస్టర్ విధానాన్ని అవలంభించడం లేదని అన్నారు. సున్నితమైన, కీలకమైన కేసులను ఏకపక్షంగా, అనుకూలంగా ఉండే జూనియర్ న్యాయమూర్తుల బెంచ్ లకు కేటాయించడాన్ని రిటైర్డ్ జడ్జిలు ఆక్షేపించారు. ఇలాంటి అంశాలను వెంటనే పరిష్కరించాలని..సుప్రీంకోర్టు నియమ, నిబంధనల ప్రకారం కేసుల అప్పగింత జరగాలని డిమాండ్ చేశారు. ప్రజలకు న్యాయవ్యవస్థపై నమ్మకం కలిగించే విధంగా చర్యలు చేపట్టాలనికోరారు.తమలేఖలో పేర్కొన్న అంశాలను వెంటనే పరిగణలోకి తీసుకుని సుప్రీంకోర్టు వ్యవహారాలను చక్కదిద్దాలని రిటైర్డ్ జడ్జిలు సీజేఐని కోరారు. ముఖ్యమైన, సున్నితమైన కేసులను జటిలంగా తప్పనిసరిగా రాజ్యాంగ బెంచ్ కు అప్పగించాలని డిమాండ్ చేశారు. పెండింగ్ కేసులను కూడా కనీసం ఐదుగురు సభ్యులుండే బెంచ్ కు మాత్రమే పంపాలన్నారు. అలా జరిగినప్పుడే సుప్రీంకోర్టుపై ప్రజలకు నమ్మకం పెరిగి.. పారదర్శకంగా తీర్పులు వెలువడతాయని పేర్కొన్నారు. ప్రధాన న్యాయమూర్తి రోస్టర్ కేటాయింపులకు మాస్టర్ లాంటివారని ఆ హోదాను దుర్వినియోగం చేసుకోరాదని స్పష్టం చేశారు. తమ లేఖలో లేవనెత్తిన అన్ని అంశాలపై వెంటనే అవసరమైన చర్యలు చేపట్టాలని రిటైర్డ్ జడ్జిలు ప్రధాన న్యాయమూర్తిని కోరారు.

సీజేఐతో సుప్రీం బార్ అసోసియేషన్ అధ్యక్షుడి చర్చలు



సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వికాస్ సింగ్ ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రాను కలిసి తాజా పరిణామా లను వివరించారు. సుప్రీం కోర్టు బార్ అసోసియేషన్ తీర్మానా న్ని సీజేఐకి అందజేసినట్టు సీనియర్ న్యాయవాది తెలిపారు. సీజేఐతో సమావేశం తర్వాత వికాస్ సింగ్ మాట్లాడుతూ.. నేను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని కలిసి ఎస్‌సీబీఏ తీర్మాన కాపీని అందజేశా. అందుకు ఆయన సానుకూలంగా స్పందిస్తూ తీర్మానంలోని అంశాలను పరిశీలిస్తానని హామీ ఇచ్చారన్నారు.

అంతర్గతంగా పరిష్కరించాలి: ఢిల్లీ బార్ అసోసియేషన్

సుప్రీంకోర్టు పరిణామాలపై ఢిల్లీ జిల్లా కోర్టు బార్ అసోసియేషన్ స్పందించింది. ఆరు జిల్లాలకు చెందిన లాయర్లకోఆర్డినేషన్ కమిటీ సమావేశమై ప్రత్యేక తీర్మానం చేసింది. సుప్రీం సంక్షోభానికి ముగింపు పలికేందుకు అంతర్గత వ్యవస్థను ఏర్పాటు చేసి వివాదాలను పరిష్కరించాలని లాయర్లు డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా న్యాయ జవాబుదారి బిల్లును తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ వివాదానికి 10 రోజుల్లో పరిష్కారం లభించకుంటే తాము కూడా దేశంలోని అన్ని బార్ అసోసియేషన్లతో చర్చిస్తామన్నారు.ఆరోపణలు లేవనెత్తిన నలుగురు న్యాయమూర్తులు మీడియాకు వెళ్లడానికి బదులు సీజేఐ కలవాలని డిమాండ్ చేశారు. సీజేఐపై మీడియా ముందు ఆరోపణలు చేయడం దురదృష్టకరమైన విషయమన్నారు.

మమ్మల్ని వేధించకండి: లోయా కుమారుడు



ముంబాయి: తన తండ్రి మృతిపై మొదట్లో అనుమానాలు ఉండేవి కానీ, ప్రస్తుతం అలాంటిదే మీలే దని సిబీఐ ప్రత్యేక జడ్జీ బి.హెచ్. లోయా కుమారుడు అనుజ్ లోయా ఆదివారం స్పష్టం చేశారు. అప్పట్లో భావోద్వేగ సంక్షోభం లో కొట్టుమిట్టాడాను. అందుకే నాన్నగారి మరణంపై అనుమానాలుండేవి. మా తాతగారు, ఒకానొక బంధువు సైతం సందేహం వెలిబుచ్చారు. ప్రస్తుతం మాలో ఏ ఒక్కరికీ ఎలాంటి అనుమానాలు లేవు అని విలేకరులతో అన్నారు. రాజకీయ నాయకులు, ఎన్జీవోల నుంచి కొంత ఒత్తిడిని ఎదుర్కొన్నాము. ఎవ్వరి పేరు ప్రస్తావించాలనుకో వడంలేదు. దయచేసి మా కుటుంబాన్ని వేధించకండి. మా నాన్నగారి మృతి గురించి అదే పనిగా ప్రశ్నించడం మానండి అని కన్నీళ్ళపర్యంతమైన అనుజ్ వేడుకున్నారు. ఆయన పూణెకు చెందిన కాలేజీలో ఎల్ఎల్‌బీ రెండవ సంవత్సరం చదువుతున్నారు. జడ్జి లోయా సోహ్రబుద్దీన్ షేఖ్ బూటకపు ఎన్‌కౌంటర్ కేసును విచారిస్తున్నారు. 2014, డిసెంబర్ ఒకటవ తేదీన నాగపూర్‌లో ఒక వివాహానికి హాజరైన సందర్భంగా ఆయన గుండెపోటుతో మరణించారు.

స్వయం ఉపాధిని గౌరవిద్దాం : రాష్ట్రపతి

ముంబాయి: స్వయం ఉపాధిని ఒక గౌరవప్రదమైన వృత్తిగా సమాజానికి చాటి చెప్పాలని ప్రభుత్వం, ఎన్జీవోలకు రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ విజ్ఞప్తి చేశారు. ఉద్యోగాలు ఆశించడానికి బదులుగా ఉపాధిని సృష్టించాలని భారతీ యువతకు ఆయన పిలుపునిచ్చారు. ఆర్ఎస్ఎస్ అనుబంధ రామ్‌భువా మాల్గి ప్రబోధిని దాతృత్వ సంస్థ ఆదివారం నిర్వహించిన ఆర్థిక ప్రజాస్వామ్య సదస్సులో కోవింద్ ప్రసంగించారు. ఔత్సాహిక పారిశ్రామిక విధానం ద్వారా ఆర్థిక ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడం దేశం, సమాజానికి ఎంతో ముఖ్యమని ఆయన అన్నారు. ప్రజలు నిర్బంధంగా కాకుండా మనస్ఫూర్తిగా స్వయం ఉపాధి చేపట్టాలని రాష్ట్రపతి చెప్పారు. యువతకు సాధికారత కల్పించి వారిని ఉపాధి కోరేవారిగా కాక ఉపాధి కల్పించేవారిగా తీర్చిదిద్దేందుకు ముద్రా యోజన, స్టార్టప్ ఇండియా, స్టాండప్ ఇండియా లాంటి అనేక కార్యక్రమాలు ఉన్నాయని ఆయన తెలిపారు.

సరిహద్దుల్లో అదనపు బలగాలు

న్యూఢిల్లీ: దేశంలో రెండు ప్రధానమైన, ముఖ్యమైన దేశ సరిహద్దుల్లో సైన్యాన్ని మోహరించే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్టు తెలుస్తోంది. అంతేకాకుండా దేశ సైన్యాన్ని బలోపేతంలో చేసేందుకు ఇది దోహదపడుతుందని, పాకిస్తాన్, బంగ్లాదేశ్, చైనా సరిహద్దుల్లో మోహరించనున్నట్టు, ఆరు సరిహద్దు భద్రతా దళాలు (బీఎస్ఎఫ్), టిబెట్ సరిహద్దు పోలీస్(ఐటీబీపీ)కు చెందిన తొమ్మిది సైనిక దళాలను మోహరించేందుకు సన్నద్ధమైనట్టు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ సీనియర్ అధికారి తెలిపారు. అయితే, ప్రతి బెటాలియన్‌లోను 1000 మందితో కూడిన జవాన్లు, అధికారులు ఉంటారు. బంగ్లాదేశ్, పాక్ సరిహద్దుల్లో మానవుల అక్రమ రవాణా, డ్రగ్స్ స్మగ్లింగ్, అవినీతి వ్యవహారాలు తదితరాలను నియంత్రించడానికి కొత్తగా బెటాలియన్లను మోహరించనున్నట్లు బీఎస్ఎఫ్ అధికారి తెలిపారు. అదేవిధంగా సరిహద్దు అవుట్‌పోస్ట్ దూరాన్ని తగ్గించే ప్రయత్నంలో భాగంగా చొరబాట్లను అరికట్టడానికి ఐటీబీపీ దళాలను ఉంచనున్నట్టు సమాచారం. కానీ రాబోయే రోజుల్లో ఐటీబీపీ సైన్యం 12 బెటాలియన్లలో 9 బెటాలియన్ల అవసరం ఉందని సీనియర్ ఐటీబీపీ అధికారి తెలిపారు.అయితే, ప్రస్తుతం చైనా ఆర్మీ సరిహద్దు ఉల్లంఘన చేస్తున్న నేపథ్యంలో సరిహద్దు ఐటీబీపీని పెంచనున్నట్టు తెలిపారు. కొండప్రాంతాల్లో శిక్షణ పొందిన సైన్యాన్ని హిమాలయ ప్రాంతంలో కొత్తగా 47 సరిహద్దు బెటాలియన్లను కేటాయించారు.

పాత నోట్ల ముఠా అరెస్ట్

న్యూఢిల్లీ: తిరుచిలో రద్దుచేసిన పాత 500, 1000 నోట్లు తరలిస్తున్న ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. వీరినుంచి కోటిరూపాయలు విలువచేసే పాత నోట్లను స్వాధీనం చేసుకున్నమన్నారు. ఈ ఘటనలో నలుగురు సభ్యులు ఉన్న ముఠాను అరెస్ట్‌చేసి కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు. శుక్రవారం రాత్రి వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఈ ముఠాను అదుపులోకి తీసుకున్నామన్నారు. అనంతరం విచారణలో నకిలీ నోట్ల విషయం బయటప డింద న్నారు. ఈ కేసుపై విస్తృత దర్యాప్తు చేస్తున్నామన్నారు. కాగా కేంద్ర ప్రభుత్వం నవంబర్ 8, 2016న పాత 500, 1000నోట్లను నిషేధించిన సంగతి విదితమే.

అగ్ని ప్రమాదంలో 8మంది మృతి

లిస్బన్: ఉత్తర పోర్చుగల్‌లో ఒక కమ్యూనిటీ సెంటర్ వద్ద శనివారం జరిగిన అగ్ని ప్రమాదంలో 8మంది మృతి చెందారు. కాగా ఈ ప్రమాదంలో మరో 50మంది గాయపడ్డారు. ప్రమాదం జరిగిన సమయంలో ఇక్కడ సుమారు 70మంది ఉన్నారని పౌర రక్షణశాఖ అధ్యక్షుడు పాల్ శాంటోస్ వెల్లడించారు. కొండిండి, వైసల ఉత్తరప్రాంతాల మధ్య టాండెలా సమీపంలో అగ్ని ప్రమాదం జరిగిందన్నారు. టోండెలా మేయర్ జోస్ ఆంటోనియాస్ మాట్లాడుతూ పోర్చుగల్లో అత్యంత ప్రజాదరణ పొందిన ఆట సుకాకా ఆడుతుండగా ఈ ప్రమాదం జరిగిందన్నారు. మంటలు వేగంగా వ్యాప్తి చెందటంతో ప్రమాద తీవ్రత పెరిగిందన్నారు. అగ్నిమాపకసేవ సిబ్బంది మంటలను అదుపు చేశారని తెలిపారు.

వలసదారులపై కేంద్రం వివక్ష : రాహుల్



న్యూఢిల్లీ: వలసదారులపై బీజేపీ ప్రభుత్వం వివక్షాపూరితంగా వ్యవహరిస్తోందని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ఆరోపించారు. ఇండియన్ మైగ్రెంట్ వర్కర్లను ద్వితీయ శ్రేణి పౌరులుగా చూస్తోందని మండిపడ్డారు. భారత దేశ మైగ్రెంట్ వర్కర్లను ద్వితీయ శ్రేణి పౌరులుగా పరిగణించడం ఎట్టి పరిస్థితిల్లోనూ ఆమెదయోగ్యం కాదన్నారు. ఇండియన్ పాస్ పోర్టులో మార్పులు నిర్ణయంపై రాహుల్ స్పందిస్తూ ట్వీట్ చేశారు. ఈ చర్య బీజేపీ వివక్షపూరిత ఆలోచన వెల్లడిస్తోందని రాహుల్ ట్విట్టర్లో పేర్కొన్నారు. కేంద్రం తాజాగా వెల్లడించిన వివరాల ప్రకారం ఎమిగ్రేషన్ చెక్ రిక్వైర్డ్ స్టేటస్ కోసం జారీచేసే పాస్ పోర్టు నారింజ కలర్లోకి మార్చనున్నారు. నాన్ ఈసీఆర్ స్టేటస్ ఉన్నవారికి గతంలో మాదిరిగానే నీలిరంగు పాస్ పోర్టులు కొనసాగుతాయని అధికారులు తెలిపారు.

అదిగదిగో మకర జ్యోతి




స్వాములతో కిటకిటలాడిన శబరిమల

శబరిమల: పవిత్రమైన మకరవిళక్కు పర్వదినాన్ని పురస్కరించుకొని వేలాదిగా భక్తులు ఆదివారం ఇక్కడి ప్రసిద్ధి చెందిన అయ్యప్ప స్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు జరిపారు. మండల దీక్షకు ముగింపు పలికారు. తలపై ఇరుముడి ధరించి కేరళ, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులు మూల విరాట్టు దర్శనం కోసం దేవస్థానం వెలుపల గంటలతరబడి వేచి చూశారు. రోజంతా కూడా పర్వతంపైన ఉన్న సన్నిధానం, పంపా నది తీర ప్రాంతం స్వామియే శరణమయ్యప్ప అంటూ భక్తుల శరణు ఘోషతో మారుమోగిపోయింది. పవిత్ర తిరువాభరణం ఆభరణాలను మూలవిరాట్టుకు ధరింపజేసి హారతి ఇచ్చిన అనంతరం భక్తుల దర్శనార్థం సన్నిధానం ద్వారాలు తెరుచుకున్నాయి. కొద్ది రోజుల క్రితం పండలం రాజ ప్రాసాదం నుంచి భక్తజన సందోహం మధ్య ఊరేగింపుగా బయలుదేరిన ఆభరణాలు హారతి ఇవ్వడానికి కొద్దిసేపటికి ముందు ఇక్కడకు తీసుకువచ్చారు. పురాణేతిహాసాల ప్రకారం అయ్యప్ప స్వామి తన బాల్యాన్ని పండల రాజప్రాసాదంలో గడిపారు. హారతి ఇచ్చిన కొద్దిసేపటికే పొన్నాంబలమేడు పైన తూర్పు వైపున భక్తులు దివ్య జ్యోతిగా భావించే మకర జ్యోతి మిణుక్కుమనగానే భక్తుల శరణు ఘోషతో శబరిమల ప్రతిధ్వనించింది. తీర్థ యాత్ర తుది అంకానికి చేరుకున్న సందర్భంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్నాటక, కేరళ, తదితర రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున వచ్చే భక్తులను నియంత్రించడం కోసం పోలీసులు, ఇతర ప్రభుత్వ శాఖలు విస్తృతమైన ఏర్పాట్లు చేశాయి. పర్వదిన కాలం ఏర్పాట్లలో భాగంగా దేవస్థాన పట్టణం వద్ద పోలీసులు, విపత్తు నివారణ సిబ్బంది, వైద్యులు, పారామెడికల్ సిబ్బంది విధుల నిర్వహణలో పాలు పంచుకున్నారు.

హవాయిలో మెసేజ్ కలకలం

హవాయి : హవాయి వాసులను ఓ సందేశం భయభ్రాంతులకు గురి చేసింది. అందరూ జాగ్రత్తగా ఉండాలని, నిర్లక్ష్యం వహించకూడదని, అలా చేస్తే ప్రాణాలు పోవచ్చు అని, అందకే సమాచారం ఇచ్చే సంస్థలు చాలా జాగ్రత్తగా ఉండాలి. హవాయిలో ప్రజలను అప్రమత్తం చేసే అధికారుల్లో ఒకరు తప్పుడు సమాచారం ఇవ్వడంతో ప్రజలంతా తీవ్ర గందరగోళానికి గురయ్యారు. హవాయిపై ఏ క్షణంలో అయినా క్షిపణి దూసుకురావొచ్చని, దీన్ని డ్రిల్ అనుకొని తేలిగ్గా తీసి పారేయకూడదని, అంతా అప్రమత్తంగా ఉండాలని సందేశం సారాంశం. దాదాపు అన్నీ సెల్‌ఫోన్‌లకు ఆ సందేశం పోయింది. దాంతో వెనుకాముందు ఆలోచించకుండా జనాలు తమ బంధువులకు ఫోన్‌లు చేసుకున్నారు. అందరినీ అప్రమత్తం చేసుకుని వీలైన ప్రదేశాల్లో దాచుకుని ఎప్పుడు క్షిపణి పడుతుందో అని భయాందోళనకు గురయ్యారు. ఉదయం 8.07 గంటలకు ఈ సందేశం వచ్చింది. దీంతో అందరూ అప్రమత్తం అయ్యారు. అడమ్ కుర్జ్ అనే వ్యక్తి తన అనుభవాన్ని చెబుతూ.. నేను మిసైల్ అలర్ట్ వచ్చిన నాలుగు నిమిషాల తరువాత నిద్ర లేచాను. అంతా పరుగులు పెడుతున్నారు.. మాకు ఏం చేయాలో తోచలేదు.. వెళ్లి బాత్రూంలో దాక్కున్నాం అని చెప్పారు. డేవిడ్ ఐజ్ డీ అనే ప్రభుత్వ అధికారి ఈ సమాచారం తప్పని ధ్రువీకరించారు. ఎమర్జెన్సీ విభాగంలో పనిచేస్తున్న అధికారులు తమ షిఫ్ట్ మారే సమయంలో పొరపాటున రాంగ్ బటన్ నొక్కడంతో అందరికీ తప్పుడు సమాచారం వెళ్లినట్టు తెలిపారు. ఇక ముందు ఇలాంటి పొరపాటు జరగకుండా చూసుకుంటామని హామీ ఇచ్చారు.

ట్రంప్ లండన్ పర్యటన రద్దు



లండన్ :అమెరికా ఎంబసీని ప్రారంభించేందుకు బ్రిటీష్ గవర్నర్‌మెంట్ అందించిన ఆహ్వానా న్ని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తిరస్కరించారు. ఫిబ్రవరి 26, 27వ తేదీల్లో ఎంబసీని ప్రారంభించేందుకు లండన్ ప్రభుత్వం నిర్ణయించింది. చెడ్డ ఒప్పందంగా అభివర్ణిస్తూ.. ట్రంప్ తన పర్యటనను రద్దు చేసుకున్న విషయం తెలిసిందే. అయితే ఈ విషయమై లండన్ మేయర్ సాధిక్ ఖాన్ స్పందించారు. అసలు ఎంబసీ చెడ్డ ఒప్పందం అనేది ఓ చిన్న కారణం అని, అసలు లండన్‌పై ట్రంప్‌నకు ప్రేమ లేదంటూ ట్విట్టర్ వేదికగా విమర్శలు గుప్పించారు. లండన్‌లో ట్రంప్‌ను ఆదరించేవారు చాలానే ఉన్నారని, కానీ పర్యటన రద్దు చేసుకోవడానికి కారణం వేరే అని సాధిక్ అన్నారు. సెంట్రల్ లండన్‌లో నిర్వహించిన ఓ కార్యక్రమంలో మేయర్ సాధిక్ ప్రసంగిస్తున్న సమయంలో ట్రంప్ మద్దతుదారులు ఒక్కసారిగా నినాదాలు చేశారు. ట్రంప్‌పై విమర్శలు గుప్పిస్తున్న సాధిక్ లండన్‌కు మేయర్‌గా కొనసాగే అర్హత లేదంటూ సభలో గోల చేశారు.

తృటిలో తప్పిన ప్రమాదం



టర్కీ : టర్కీకి చెందిన పెగాసస్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన విమానానికి ఆదివారం పెను ప్రమాదం తప్పింది. విమానం ల్యాండింగ్ అవుతున్న సమయంలో ప్రమాదవశాత్తు అదుపు తప్పి రన్‌వే పై నుండి పక్కకు దూసుకెళ్లింది. టర్కీ రాజధాని అంకారా నుండి ట్రబ్‌జాన్ పట్టణానికి చెందిన 162 మంది ప్రయాణికులతో విమానం బయలుదేరింది. ల్యాండింగ్ అవుతున్న సమయంలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. సముద్రానికి కొద్ది మీటర్ల దూరంలో విమానం ఆగిపోయినట్టు అధికారులు వివరించారు. దట్టమైన పొగలు వచ్చాయని, దీంతో అధికారులు అగ్నిమాపక యంత్రాలు తీసుకొచ్చి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదని తెలిపారు. విమాన ప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు. ఘటనపై విచారణకు ఆదేశించినట్టు ట్రబ్‌జాన్ ప్రభుత్వం వెల్లడించింది.

గల్ఫ్ సంక్షోభం..చైనాకు ముప్పేనా..?



బీజింగ్: గత ఆరునెలలుగా కొనసాగుతున్న గల్ఫ్ దేశాల రాజకీయ సంక్షోభం ఇతర దేశాలపైనా తీవ్ర ప్రభావం చూపుతోంది. ముఖ్యంగా హార్న్ ఆఫ్ ఆఫ్రికాపై సంక్షోభం ప్రభావం ఎక్కువగా ఉండటం చైనాకు కంటిమీదకునుకు లేకుండాపోయింది.చైనా తమ పెట్టుబడులను . హార్న్ ఆఫ్ ఆఫ్రికా లోని దేశాలైన సొమాలియా, ఇథియోఫియా, కెన్యా, దక్షిణ సూడాన్, ఇరిటీరియా తదితర దేశాల్లో చైనా భారీగా పెట్టుబడులు పెట్టింది. తమ వస్తువులను గల్ఫ్ దేశాల్లో విక్రయించడం ద్వారా అధికలాభాలు ఆర్జించవచ్చని పలు కంపెనీలను కూడా ప్రారంభించింది. అయితే గల్ఫ్ దేశాల సంక్షోభం సొమాలియా, ఇథియోఫియా, కెన్యా, దక్షిణసూడాన్, ఇరిటీరియా వంటి దేశాలకు పాకడంతో చైనాకు కూడా తీవ్ర నష్టం వాటిల్లే పరిస్థితులు వచ్చాయని నిపుణులు అంచనా వేస్తున్నారు. దీంతో చాలామంది చైనీయుల పెట్టుబడులు ప్రమాదంలో పడ్డాయి. హార్న్ ఆఫ్రికా దేశాల్లోని సంక్షోభం వల్ల హిందూ మహాసముద్ర తీరం మీదుగా 4వేల కిలోమీటర్ల మేర జరిగే వాణిజ్యానికి కూడా కోలుకోలేని దెబ్బతగిలింది.

సూడాన్ నిర్ణయంపై చైనా ఆగ్రహం

ఇక గతనెల సూడాన్ టర్కీమధ్య కుదిరిన ఒప్పందం కూడా చైనాపై ఎక్కువ ప్రభావం చూపుతోంది. టర్కీ ఎర్రసముద్రం తీరంలో నౌకాశ్రయాన్ని నిర్మించుకోవడంతో పాటు నౌకా దళాన్ని ఏర్పాటు చేసుకుని వారి పౌరులు, మిలిటరీ ద్వారా నిర్వహించుకునేందుకు సూడాన్ అనుమతించింది. దీంతో చైనీయుల్లో ఆందోళన పెరిగిపోయింది. తమ వ్యాపార,వాణిజ్య కార్యకలాపాలకు సూడాన్ లాంటి దేశాలు అడ్డుకట్ వేస్తున్నాయని చైనీయులు ఆందోళన చెందుతున్నారు. చైనా తమ ఎగుమతులను పెంచుకునేందుకు చైనా వ్యూహాత్మకంగా జిబౌటిలో సైనికస్థావరాన్ని ఏర్పాటు చేసింది.అయితే అక్కడ తాజా పరిణామాలు, ప్రాంతీయ ఉద్రిక్తతల నేపథ్యంలో వ్యాపారం కష్టతరంగా మారిపోయింది. జిబౌటీలో ఇప్పటికే అమెరికా, ఫ్రాన్స్, సౌదీ, జపాన్ దేశాల మిలిటరీ స్థావరాలున్నాయి. ఈ దేశాల ముఖ్య ఉద్దేశం ఒక్కటే. తమ దేశాల ఎగుమతులు సురక్షితంగా జరగాలంటే మిలిటరీ తప్పనిసరి అనే భావనతో జిబౌటీలో ఆయా దేశాలు తమ మిలిటరీ స్థావరాలను ఏర్పాటు చేసుకున్నాయి. అయితేసూడాన్-టర్కీమధ్యజరిగిన 650 మిలియన్ల అమెరికన్ డాలర్ల ఒప్పందం ద్వారా ఉగ్రవాదం, ఇతర ఘర్షణలను సమర్థవంతంగా తిప్పికొట్టేందుకు ఎర్రసముద్రం తీరంలో టర్కీ తన మిలిటరీని మొహరింపజే యనుంది.సూడాన్ తీసుకున్న ఈ నిర్ణయం చైనాకు మింగుడు పడటం లేదు. దీంతో పరస్పర వివాదాలు చెలరేగే ప్రమాదం ఉంది. గల్ఫ్ దేశాలపై తమ ఆధిపత్యం కోసం పోటీపడుతున్న దేశాలు ముఖ్యంగా హార్న్ ఆఫ్రికా, తూర్పు, మధ్య, పశ్చిమ ఆఫ్రికా దేశాలపై దృష్టిపెట్టాయి.ఆఫ్రికా దేశాల్లో తమ వాణిజ్యాన్ని మరింతగా పెంచుకోవడమే ఆయా దేశాల ముఖ్య ఉద్దేశం.

ఇజ్రాయెల్ ప్రధానికి మోడీ ఆత్మీయస్వాగతం



న్యూఢిల్లీ: భారత పర్యటనకు వచ్చిన ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహును ప్రధాని మోడీ పాలం విమానాశ్రయంలో ఆత్మీయంగా ఆలింగనం చేసుకుని స్వాగతం పలికారు. బెంజమిన్‌కు స్వాగతం పలికేందుకు ఆదివారం మోడీ ప్రొటోకాల్‌ను పక్కనపెట్టి స్వయంగా ఢిల్లీ విమానాశ్రయానికి విచ్చేశారు. 130మంది సభ్యుల వ్యాపార ప్రతినిధుల బృందంతో కలిసి బెంజమిన్ భారత్‌లో పర్యటించనున్నారు. నెతన్యాహు వెంట ముంబై పేలుళ్ల నుంచి సురక్షితంగా బయటపడిన 11ఏళ్ల బాలుడు మోషే కూడా భారత్ వచ్చాడు. నెతన్యాహుతోపాటు ఆయన సతీమణి సారా భారత్‌లో ఆరురోజులపాటు పర్యటించనున్నారు. ప్రధాని మోడీ ఇచ్చిన ఆత్మీయ స్వాగతంపై బెంజమిన్ ట్విట్టర్లో సంతోషం వ్యక్తం చేశారు. స్వయంగా విచ్చేసి ఆత్మీయస్వాగతం పలికిన ఆప్తమిత్రుడు మోడీకి ధన్యవాదాలన్నారు. విమానం దిగగానే మోడీ వచ్చి ఆత్మీయంగా స్వాగతం పలకటం ఆశ్చర్యంలో ముంచెత్తిందన్నారు.

మిత్రదేశాలు సముద్ర మార్గంలో ప్రయాణించేందుకు అవకాశం లభించింది.అనంతరం ఆయన భారత విదేశాంగమంత్రి సుష్మా స్వరాజ్‌ను కలిశారు.

మోడీకి మొబైల్ జీప్ బహుమతి

ఈ పర్యటనలో భాగంగా బెంజమిన్ భారత ప్రధాని మోడీకి ఆధునిక సాంతకేతికతో కూడిన గాల్ మొబైల్ జీపును బహుమతిగా ఇవ్వనున్నారు. గత ఏడాది మోడీ ఇజ్రాయెల్ పర్యటనలో ఇరు దేశాధినేతలు ఈ వాహనంలో ప్రయాణించారు. ఈ వాహనం ఖరీదు 70లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు. ఈ వాహనం రోజుకు 20వేల లీటర్ల సముద్రపు నీటిని మంచినీటిగా మార్చగలదని అధికారులు తెలిపారు. ఇజ్రాయెల్ ప్రధాని భారత పర్యటనకు రావటం గత పదిహేనేళ్లలో ఇదే ప్రథమం. 2003లో ఏరియల్ షరాన్ ఇజ్రాయెల్ ప్రధానిగా ఉండగా భారత పర్యటనకు వచ్చారు. అనంతరం బెంజమిన్ భారత్ పర్యటనకు వచ్చారు.

నూతన ఒరవడికి నాంది: బెంజమిన్ నెతన్యాహూ



భారత్, ఇజ్రాయెల్ మధ్య రక్షణ సంబంధాల విష యంలో నూతన ఒరవడికి నాంది పలుకు తామని ఇజ్రాయెల్ ప్రధా ని బెంజమిన్ నెతన్యాహూ అన్నారు. ఇరువురం కలిసి ఉభయ దేశాల సంబంధాన్ని ఉన్నతస్థాయికి తీసుకువెళ్తామని ఆయన పేర్కొన్నారు. ఈ పర్యటనలో ఉగ్రవాదంపై పోరాటం, ఇరుదేశాల మధ్య వ్యాపార సంబంధాల బలోపేతం తదితర అంశాలు చర్చించనున్నామన్నారు. మరోవైపు మోడీ సైతం బెంజమిన్ పర్యటనపై హర్షం వ్యక్తం చేస్తూ ఆయన రాకతో ఇరుదేశాల బంధం మరింత బలపడుతుందని ట్వీట్ చేశారు. బెంజమిన్ పర్యటన సందర్భంగా మోడీ ఆదివారం రాత్రి ప్రత్యేకవిందు కార్యక్రమం ఏర్పాటు చేశారు. అనంతరం మోడీ, నెతన్యాహు ఇరువురు తీన్‌మూర్తి చౌక్ వెళ్లారు.

తీన్‌మూర్తి హైఫీ చౌక్‌గా మారిన తీన్‌మూర్తి చౌక్

ఈ సందర్భంగా దేశ రాజధాని ఢిల్లీలోని తీన్‌మూర్తి చౌక్ పేరు తీన్‌మూర్తి హైఫీ చౌక్‌గా మార్చారు. ఇజ్రాయెల్ నగరం హైఫా పేరును చేర్చి తీన్ మూర్తి హైఫా చౌక్‌గా మార్చారు. ఆదివారం తీన్ మూర్తి మెమోరియల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ఇరుదేశాల ప్రధానులు పాల్గొన్నారు. తీన్ మూర్తి మెమోరియల్‌లో హైదరాబాద్, జోధ్‌పూర్, మైసూర్ ముగ్గురు లాన్సర్ల కాంశ్య విగ్రహాలు ఉన్నాయి.15 ఇంపీరియల్ సర్వీస్ కావల్రీ బ్రిగేడ్‌లో ఈ ముగ్గురు పాల్గొన్నారు. మొదటి ప్రపంచ యుద్ధంలో 1918 సెప్టెంబరు 23న హైఫా సిటీపై ఈ బ్రిగేడ్ విజయం సాధించింది. హైఫా విముక్తి కావడంతో

నేడు రాష్ట్రపతితో ఇజ్రాయెల్ ప్రధాని భేటీ

సోమవారం రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి రామనాథ్ కోవింద్‌తో బెంజమిన్ భేటీ అవుతారు. అనంతరం బెంజమిన్ దంపతులు ఆగ్రా వెళ్లి తాజ్‌మహల్‌ను సందర్శిస్తారు. పర్యటనలో భాగంగా వీరు ముంబై, అహ్మదాబాద్‌లో పర్యటించనున్నారు. నేడు ఇండో-ఇజ్రాయూ సిఈవో ఫోరంతో సమావేశం అవుతారు. అనంతరం ప్రత్యేక వ్యాపార కార్యక్రమంలో పాల్గొంటారు.





మెగాస్టార్ అతిథిగా ఛలో ప్రీ రిలీజ్


చిరంజీవి, నాగశౌర్య

యువ కథానాయకుడు నాగశౌర్య, కన్నడ బ్యూటీ రష్మిక మండన్న జంటగా నటిస్తున్న చిత్రం ఛలో. వెంకీ కుడుముల ఈ చిత్రంతో దర్శకుడిగా అరంగేట్రం చేస్తున్నారు. శంకర్ ప్రసాద్ మూల్పూరి సమర్పణలో ఐరా క్రియేషన్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. ఉషా మూల్పూరి నిర్మాణ బాధ్యతలు వహిస్తున్నారు. ప్రస్తుతం నిర్మాణాంతర కార్యక్రమాలు తుది దశలో ఉన్న ఛలో ఫిబ్రవరి 2న భారీగా విడుదలకు సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో చిత్ర ప్రీ రిలీజ్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. ఈ నెల 25న హైదరాబాద్‌లో జరిగే ఈ కార్యక్రమానికి మెగాస్టార్ చిరంజీవి అతిథిగా హాజరవనున్నారు. ఈ సందర్భంగా నిర్మాతలు శంకర్ ప్రసాద్, ఉషా మూల్పూరి మాట్లాడుతూ...సినిమా ప్రకటించిన రోజు నుంచీ ఛలో అందరిలోనూ ఆసక్తి కలిగిస్తోంది. చిత్ర టీజర్, పాటలకు అనూహ్య స్పందన వస్తోంది. ఈ నెల 25న హైదరాబాద్‌లో వినూత్న పద్ధతిలో వైభవంగా ఛలో ప్రీ రిలీజ్ కార్యక్రమాన్ని నిర్వహించబోతున్నాం. ఆ వేడుకకు మెగాస్టార్ చిరంజీవి గారు విశిష్ట అతిథిగా హాజరవుతున్నారు. ఎన్నో పనుల్లో తీరిక లేకుండా ఉండి కూడా చిరంజీవి గారు మా కార్యక్రమానికి రావడం సంతోషంగా ఉంది. ప్రస్తుతం నిర్మాణాంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చేలా ఛలో ఉంటుందని నమ్మకంతో ఉన్నాం. అన్నారు నరేష్, పోసాని, రఘుబాబు, వెన్నెల కిషోర్, మైమ్ గోపీ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి ఎడిటింగ్ - కోటగిరి వెంకటేశ్వరరావు, తమ్మిరాజు, సినిమాటోగ్రఫీ - సాయి శ్రీరామ్, ఆర్ట్ - రాము అరసవిల్లి.

హద్దే ముద్దు నయా విధానం

సినిమారంగంలో ఏ తార అభిప్రాయం ఆ తారకు ఉంటుంది. ముఖ్యంగా గ్లామర్ పేరుతో కొందరు ఎక్స్‌పోజింగ్ చేస్తుంటే...కొందరు మాత్రం హద్దులలో ముందుకు సాగడం చూస్తున్నదే. అయితే తమకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు, అలాగే డిమాండ్ వచ్చేంతవరకు కొన్ని సందర్భాలలో ఎక్స్‌పోజింగ్ చేయాల్సివచ్చినా ఇమేజ్ వచ్చిన తర్వాత హద్దులను విధించుకున్న ఉదాహరణలు లేకపోలేదు. ఈ కోవలో నయనతార ఇకపై ఎక్స్‌పోజింగ్ విషయంలో హద్దులను విధించుకున్నట్లు సినీవర్గాలు అంటున్నాయి. లోగడ బిల్లా చిత్రంలో టూపీస్ దుస్తులు ధరించి, ఆ రకంగా ఆమె వార్తల్లోకి ఎక్కిన సంగతి తెలియంది కాదు. అయితే అప్పట్లో ఆమెకున్న గుర్తింపుకు, నేడు ఆమెకున్న ఇమేజ్‌కు ఎంతో వ్యత్యాసం ఉంది. తమిళంలో సూపర్‌స్టార్ ఇమేజ్‌ను సొంతం చేసుకోవడమే కాదు అడపాదడపా తెలుగు చిత్రాల్లో కూడా ఆమె నటిస్తున్న విషయం వేరుగా చెప్పనక్కరలేదు. నయనతారను తమ చిత్రాల్లో కథానాయికగా ఎంపిక చేసుకోవాలన్న దర్శక, నిర్మాతలు ఆమె పెట్టే నిబంధనలను అనుసరించాల్సిందేనట. తాను నటించిన చిత్రమైనప్పటికీ, దాని ప్రచార కార్యక్రమాలకు దూరంగా ఉండటం ఆమె అలవాటు అని, ఇకపై కూడా ఆ సంప్రదాయాన్నే కొనసాగించబోతున్నారట. ఇక ఎక్స్‌పోజింగ్ విషయంలో ఇప్పటివరకు తాను అనుసరించిన విధానానికి స్వస్తి పలికి, తాను ఎంచుకున్న నూతన పంథాతో ముందుకు సాగనున్నట్లు పరిశ్రమలో చెప్పుకుంటున్నారు. ప్రస్తుతం తమిళంలో కొలమావు కోకిల, కొలైయుధీర్ కాలం, ఇమైకానోడిగళ్ తదితర చిత్రాలు చేస్తున్న ఆమె తెలుగులో నటించిన జైసింహా సంక్రాంతి సందర్భంగా ప్రేక్షకుల ముందుకొచ్చిన సంగతి తెలిసిందే. మరో చిత్రం సైరా నరసింహారెడ్డి సెట్స్‌పై ఉంది.


నాని

నాని న్యూలుక్‌తో కృష్ణార్జునయుద్ధం

విభిన్నమైన సినిమాలను చేస్తున్న నాని నటిస్తున్న తాజా చిత్రం కృష్ణార్జునయుద్ధం. ఇందులో ద్విపాత్రాభినయంతో మెరవనున్న ఆయన లుక్స్ ఎలా ఉంటాయోనన్న ఆసక్తి ఏర్పడింది. కాగా సంక్రాంతి సందర్భంగా కృష్ణపాత్రలో నాని ఎలా ఉండబోతున్నారన్న లుక్ విడుదలైంది. కోరమీసాలు, పదునైన చూపులతో పక్కా మాస్ కోణంలో ఉన్న నాని లుక్‌కు మంచి స్పందన లభించిందని నిర్మాతలు తెలిపారు. వెంకట్ బోయనపల్లి సమర్పణలో షైన్ స్క్రీన్స్ పతాకంపై సాహు గారపాటి, హరీష్ పెద్ది ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్, ఎక్స్‌ప్రెస్‌రాజా చిత్రాల దర్శకుడు మేర్లపాక గాంధీ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం చివరి షెడ్యూల్ చిత్రీకరణ ప్రస్తుతం జరుగుతోంది. దీంతో షూటింగ్ మొత్తం పూర్తవుతుందని, నిర్మాణానంతర కార్యక్రమాలతో సహా అన్ని కార్యక్రమాలను పూర్తిచేసి, ప్రపంచవ్యాప్తంగా ఏప్రిల్ 12న సినిమాను విడుదల చేయనున్నామని నిర్మాతలు తెలిపారు.

ఈ చిత్రంలో నాని సరసన అనుపమ పరమేశ్వరన్, రుక్సర్ నాయికలుగా నటిస్తుండగా, ఈ చిత్రానికి సంగీతం: హిప్ హాప్ తమిళ, సినిమాటోగ్రఫీ: కార్తీక్ ఘట్టమనేని, ఆర్ట్: సాహిసురేష్.

విదేశాలకు వెళుతున్న ఎంఎల్‌ఏ


కల్యాణ్ రామ్

నందమూరి కల్యాణ్‌రామ్ కథానాయకుడిగా ఉపేంద్రమాధవ్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం ఎంఎల్‌ఏ (మంచి లక్షణాలున్న అబ్బాయ్). బ్లూప్లానెట్ ఎంటర్‌టైన్‌మెంట్స్, ఎల్‌ఎల్‌పి, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ సంయుక్త నిర్మాణంలో తెరకెక్కుతున్న ఈ చిత్రం టాకీపార్ట్ చిత్రీకరణ పూర్తయింది. వచ్చేనెలలో విదేశాలలో పాటలను చిత్రీకరించడంతో షూటింగ్ మొత్తం పూర్తవుతుంది. ఈ విషయాన్ని నిర్మాతలు తెలియజేస్తూ, ఆద్యంతం వినోదభరితంగా సాగే ఈ చిత్రం హీరో కల్యాణ్‌రామ్ కెరీర్‌లో ఓ మంచి చిత్రమవుతుందని నమ్ముతున్నాం. దర్శకుడు ఉపేంద్ర చిత్రాన్ని చాలాబాగా మలిచారు. ఆదివారం విడుదలచేసిన ఈ చిత్రం టీజర్‌కు విశేష స్పందన లభించింది. మార్చిలో వేసవి సెలవుల సందర్భంగా చిత్రాన్ని విడుదల చేయనున్నాం అని చెప్పారు. దర్శకుడు మాట్లాడుతూ, పూర్తి కొత్త లుక్‌లో కల్యాణ్‌రామ్ ఇందులో ఎంతో స్టైలిష్‌గా కనిపిస్తారు. ఎంఎల్‌ఏ టైటిల్‌కు, ఉపశీర్షికకు తగినవిధంగా ఈ చిత్రం ఉంటుంది. నాకు దర్శకత్వం అవకాశం ఇచ్చిన కల్యాణ్‌రామ్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను అని అన్నారు. కల్యాణ్‌రామ్ సరసన కాజల్‌అగర్వాల్ నాయికగా నటిస్తున్న ఈ చిత్రంలోని ఇతర పాత్రల్లో కిషెన్, పోసాని, జయప్రకాష్‌రెడ్డి, అజయ్, వెన్నెలకిషోర్, పృథ్వి, శివాజీరాజా, ప్రభాస్ శ్రీను, లాస్యా, మనాలిరాథోడ్ తదితరులు తారాగణం. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: ప్రసాద్ మూరెళ్ళ, సంగీతం: మణిశర్మ, ఎడిటింగ్: తమ్మిరాజు, సహ నిర్మాత: వివేక్ కూచిబొట్ల, సమర్పణ: టి.జి.విశ్వప్రసాద్, నిర్మాతలు: సి.భరత్‌చౌదరి, ఎం.వి.కిరణ్‌రెడ్డి, కథ, స్క్రీన్‌ప్లే, మాటలు, దర్శకత్వం: ఉపేంద్రమాధవ్.

ఆశ్చర్యపరుస్తున్న సూపర్‌స్టార్



ఈ ఏడాది సూపర్‌స్టార్ రజినీ అభిమానులకు ఎంతో ప్రత్యేకంగా నిలవబోతోంది. సాధారణంగా రజినీ రెండేళ్లకో సినిమా చేస్తుంటారు. నరసింహా సినిమా తర్వాత ఆయన నటించే వేగం బాగా తగ్గించారు. అంతకు ముందు ఏడాదికి కనీసం మూడు నాలుగు చిత్రాలు వస్తుండేవి. బాబా సినిమ అపజయం అనంతరం రెండు మూడేళ్లకు ఓ చిత్రాన్ని చేస్తూ వచ్చారు రజినీ. ఇక అలా వచ్చే ఆ సినిమా కోసమే అభిమానులు ఎప్పుడెప్పుడా అని వేచి చూస్తుండేవారు. ఈ సందర్భంలో ఒకే ఏడాది రెండు రజినీ చిత్రాలు విడుదలకు సిద్ధమవుతుండటం వాళ్లకు ఆశ్చర్యం కలిగిస్తోంది. శంకర్ దర్శకత్వంలో రజినీ నటిస్తున్న 2.0 ఏప్రిల్‌లో తెరపైకి వస్తుండగా...ఆ తర్వాత కొద్ది రోజులకే పా రంజిత్ రూపొందిస్తున్న కాలా విడుదల కాబోతోంది. ఈ విషయాన్ని రజినీ కూడా సంతోషంగా పంచుకున్నారు. ఇటీవల ఆయన స్పందిస్తూ...త్వరలో రెండు చిత్రాలతో మీ ముందుకొస్తున్నాను. 2.0 విడుదలైన రెండు నెలలకే కాలా తెరపైకి వస్తుంది. 2.0 లాంటి మరో సినిమాను వెండితెర చూడదు. ఇంతకంటే ఎక్కువ ఖర్చు పెట్టి సినిమాలు చేయొచ్చు. కానీ...2.0 కథలో ఉన్న నూతనత్వం మరే చిత్రంలో రాదు. ఈ సినిమా గ్రాఫిక్స్ ఆలస్యమవుతున్నాయి. సినిమాకు అన్ని సాంకేతిక హంగులు చేర్చాకే రీరికార్డింగ్ మొదలువుతుంది. రెహమాన్ గ్రాఫిక్స్ పూర్తయ్యే వరకు వేచి చూస్తున్నారు. ఈ పనులున్నాయి కాబట్టే జనవరి 26న విడుదల కావాల్సిన 2.0 ఏప్రిల్ 14కు తెరపైకి వస్తోంది. దర్శకులు పా రంజిత్ రూపొందిస్తున్న కాలా పూర్తిగా నన్ను కొత్తగా చూపించే సినిమా. ఇలాంటి పాత్రను గతంలో నేనెప్పుడూ చేయలేదు. అన్నారు.

గోవా నేపథ్యంలో అనగనగా ఓ రాజకుమారుడు

నవీన్‌బాబు, సంజన, అమృత హీరోహీరోయిన్లుగా, సుమన్‌శెట్టి ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న చిత్రం అనగనగా ఓ రాజకుమారుడు. షెరాజ్ (షాలిని ఫేమ్) దర్శకుడు. రామ్‌సాయి గోకులం క్రియేషన్స్ పతాకంపై పి.వి.రాఘువులు నిర్మిస్తున్నారు. ఈ చిత్రం తొలి షెడ్యూల్ గోవాలో పూర్తిచేసుకుంది. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ, లవ్, కామెడీ, థ్రిల్లర్ ఎంటర్‌టైనర్‌గా దీనిని మలుస్తున్నాం. సరికొత్త అంశంతో రూపొందే ఈ చిత్రంలో కథకు సరిపోయేలా హీరోహీరోయిన్లు చక్కగా కుదిరారు. గోవా నేపథ్యంలో సాగే ప్రేమ ఇతివృత్తంతో ఈ చిత్రం సాగుతుంది. అక్కడ చిత్రీకరించిన సన్నివేశాలు ఆద్యంతం ఆసక్తిని కలిగిస్తాయి. కామెడీతో పాటు థ్రిల్లర్ అంశాలు ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయి. రెండో షెడ్యూల్‌ను త్వరలో హైదరాబాద్‌లో మొదలుపెట్టనున్నాం. ఈ షెడ్యూల్‌లో మిగతా సన్నివేశాలు, పాటల చిత్రీకరణను పూర్తిచేస్తాం అని చెప్పారు.ఈ చిత్రానికి కెమెరా, ఎడిటింగ్: ఏకరీ లక్కీ, కథ: 100 డేస్ మూవీస్, పాటలు: బాషాశ్రీ, సమర్పణ: రమాదేవి.


నవీన్‌బాబు, సంజన

నవ్వించే మిఠాయి



గాయత్రీ గుప్తా, శ్వేతా వర్మ, రాహుల్ రామకృష్ణ ప్రియదర్శి పులికొండ తదితరులు ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం మిఠాయి. డార్క్ కామెడీ కథతో ప్రశాంత్ కుమార్ స్వీయ దర్శకత్వంలో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. మిఠాయి చిత్ర షూటింగ్ ప్రారంభోత్సవం హైదరాబాద్‌లో లాంఛనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో నటుడు విజయ్ దేవరకొండ, దర్శకులు సందీప్ రెడ్డి, క్రాంతి మాధవ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా దర్శకులు ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ...మిఠాయి ఒక డార్క్ కామెడీ చిత్రం. ఈ కథలో మంచి వాళ్లకు చెడు జరుగుతుంటే, మంచి వాళ్లు అని చెప్పుకునే చెడ్డవాళ్లకు మంచి జరుగుతుంటుంది. ఈ సినిమా నా అభిమాన ఫిలింమేకర్స్ కోయెన్ బ్రదర్స్‌కు సమర్పిస్తున్నాను. ఈ కథ రాసేప్పుడు ప్రతి క్షణాన్ని ఆస్వాదించాను. ప్రతి పాత్రలోకి వెళ్లి వాళ్ల జీవితాలను చూశాను. అబ్బాయిగా, అమ్మాయిగా, ముసలి వాడుగా, పోలీసుగా ప్రతి పాత్రనూ ఆస్వాదించాను. సినిమా జయాపజయాల బాధ్యత దర్శకుడిదే అని భావిస్తాను. మిఠాయితో ఓ మంచి, నిజాయితీ ప్రయత్నం చేయాలనుకుంటున్నాను. మా రెడ్ యాంట్స్ సంస్థనుంచి ప్రతి రెండేళ్లకో సినిమా చేయాలని సన్నాహాలు చేసుకుంటున్నాను. అన్నారు. అతిథి సందీప్ రెడ్డి మాట్లాడుతూ...ప్రశాంత్ కుమార్ నాకు మంచి స్నేహితుడు. ఇది కొత్తతరహా కథ. తెలుగులో డార్క్ కామెడీ చిత్రాలు వచ్చి చాలా కాలమవుతోంది. చిత్ర యూనిట్‌కు శుభాకాంక్షలు చెబుతున్నాను. అన్నారు. నటుడు విజయ్ దేవరకొండ మాట్లాడుతూ...ఈ చిత్రంలో పనిచేస్తున్న వాళ్లలో చాలా మంది నాకు పెళ్లి చూపులు సినిమా నుంచి పరిచయం. ప్రశాంత్ చేస్తున్న ఈ సినిమా కోసం వేచి చూస్తాను. డార్క్ కామెడీ కథ అనగానే నాకు సినిమాపై ఆసక్తి పెరిగింది. అన్నారు.

కమల్ కామరాజు, భూషణ్ కళ్యాణ్, రవి వర్మ, అజయ్ ఘోష్, విజయ్ మురార్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం - వివేక్‌సాగర్, సినిమాటోగ్రఫీ - సాకేత్ సౌరభ్, ఎడిటింగ్ - వీణు భూషణ్, కొరియోగ్రఫీ - అనీ, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ - కృష్ణవొడపల్లి.

క్రీడాప్రభ

ఐసీసీ అండర్ 19 ప్రపంచకప్ తొలి పోరులో భారత యువకులు అదరగొట్టారు. మొదటి మ్యాచ్‌లోనే సత్తా చాటారు. ప్రపంచకప్‌లో తమ పోరాటాన్ని అద్భుతంగా ఆరంభించారు. ఆదివారం న్యూజిలాండ్‌లోని మౌంట్ మాంగనీలో జరిగిన వన్డేలో మాజీ చాంపియన్ ఆస్ట్రేలియాను 100 పరుగుల తేడాతో చిత్తు చేశారు. కఠినమైన ప్రత్యర్థిని ఓడించిన భారత్‌కు నాకౌట్ అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. కెప్టెన్ పృథ్వీ షా (94) తృటిలో శతకం చేజార్చుకున్నాడు. షా.. ఓపెనర్ మన్‌జోత్ కల్రా (86)తో కలిసి భారత్‌కు బ్రహ్మాండమైన ఆరంభం ఇవ్వడంతో భారత యువ జట్టు ఇక వెనుదిరిగి చూడలేదు.



కుర్రాళ్లు కుమ్మేశారు

- ఆసీస్‌పై ఘనవిజయం
- సెంచరీ చేజారిన షా
- కల్రా, గిల్ అర్ధసెంచరీలు
- అండర్ 19 ప్రపంచకప్

మౌంట్ మాంగనీ: కెప్టెన్ పృథ్వీ షా (94, 100 బంతుల్లో, 8 ఫోర్లు, 2 సిక్స్), మన్‌జోత్ కల్రా (86, 99 బంతుల్లో, 12 ఫోర్లు, 1 సిక్స్), శుభ్‌మన్ గిల్ (63, 54 బంతుల్లో, 6 ఫోర్లు, 1 సిక్స్) టాప్ ఆర్డర్‌లో చిచ్చర పిడుగుల్లా చెలరేగడంతో భారత యువ జట్టు ప్రపంచకప్‌లో శుభారంభం చేసింది. 50 ఓవర్లలో 7 వికెట్లకు 328 పరుగుల భారీ స్కోరు సాధించి ఆస్ట్రేలియా యువకులకు సవాలు విసిరింది. ఆసీస్ ఇన్నింగ్స్‌లో భారత బౌలర్లు వారి బ్యాటింగ్‌ను ఊచకోత కోశారు. కమలేశ్ నగర్ కోటి (3-29), శివమ్ మావి (3-45) మూడేసి వికెట్లు తీసి ఆసీస్ ఇన్నింగ్స్‌ను కుదురుకోనీకుండా చేశారు. ప్రత్యర్థి బ్యాట్స్‌మెన్‌ను గడగడలాడించారు. ఆసీస్ ఆల్‌రౌండర్ ఎడ్వర్డ్స్ (73, 90 బంతుల్లో, 6 ఫోర్లు, 1 సిక్స్- 4-65) ఆల్‌రౌండ్ ప్రతిభ ప్రదర్శించినా ప్రయోజనం లేకపోయింది. భారత్ పేసర్ల దెబ్బకు 42.5 ఓవర్లలో 228 పరుగులకే ఆలౌటైంది.

ఓపెనింగ్ అదిరింది: షా, కల్రా ఫోర్లు, సిక్స్‌లతో చెలరేగి భారత్‌కు సరైన ఆరంభాన్నిచ్చారు. వీరిద్దరు తొలి వికెట్‌కు ఏకంగా 180 పరుగులు జోడించారు. అండర్ 19 ప్రపంచకప్‌లో భారత్‌కిదే అత్యుత్తమ ఓపెనింగ్ భాగస్వామ్యం. 2006 ప్రపంచకప్‌లో ఉతప్ప, ధావన్ కలిసి 173 పరుగులు జోడించారు. వైస్ కెప్టెన్ గిల్ 54 బంతుల్లోనే 64, అభిషేక్ 8 బంతుల్లోన 23 పరుగులు చేయడంతో భారత్ యువ జట్టు భారీ స్కోరు వైపు వడివడిగా పరుగులు తీసింది. షాకు ఆరంభంలో జీవనదానం లభించింది. ఆరంభంలో నిదానంగా ఆడిన షా... తరువాత జేవియర్ బౌలింగ్‌లో రెండు కళ్లు చెదిరే ఫోర్లతో పరుగుల వేట ఆరంభించాడు. అనంతరం ఓ భారీ సిక్స్ కూడా బాదాడు. ఎడమ చేతి వాటం కల్రా క ూడా షాకు తోడై ఆఫ్‌సైడ్ రెండు బౌండరీలు కురిపించాడు. వీరిద్దరు చెలరేగి ఆడడంతో 10వ ఓవర్లోనే భారత్ స్కోరు 50కి చేరుకుంది. సదర్లాండ్ బౌలింగ్‌లో కల్రా రెండు ఫోర్లు కొట్టి భారత్ స్కోరును 50కి చేర్చాడు. 18వ ఓవర్లో భారత్ స్కోరు 100క ు చేరింది. కల్రా మరోసారి పోప్ బౌలింగ్లో రెండు బౌండరీలు సాధించడం తో భారత్ వంద మార్క్‌ను అందుకుంది. షా 55 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తి చేశాడు. అనంతరం కల్రా కూడా 60 బంతుల్లో అర్ధశతకం సాధించాడు. షా, కల్రా మిడిల్ ఓవర్లలో కూడా రన్‌రేట్ పడిపోకుండ జాగ్రత్త పడడంతో భారత్ పరుగుల వేగం మందగించలేదు. మిడిలార్డర్‌కు సరైన వేదికను అమర్చి షా, కల్రా నిష్క్రమించారు. ఆరు పరుగుల తేడాలో సెంచరీ షా చేజారింది. సదర్లాండ్ బౌలింగ్‌లో అతను లెంత్ డెలివరీని ఆడబోయి కీపర్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. మరో 20 పరుగుల తర్వాత కల్రా కూడా పెవిలియన్ చేరాడు. వెంటవెంటనే రెండు వికెట్లు పడినా భారత్ పరుగుల ప్రవాహం ఆగలేదు. గిల్, అభిషేక్ ఆ జోరును కొనసాగించారు. దీంతో చివరి 10 ఓవర్లలో భారత్ 5 వికెట్లు కోల్పోయినా స్కోరు 300 దాటింది. ఆ పది ఓవర్లలో 105 పరుగులు సాధించింది. అనంతరం ఓపెనర్ ఎడ్వర్డ్స్ (73), వికెట్ కీపర్ హాల్ట్ (39) రాణించినా తక్కిన బ్యాట్స్‌మెన్ విఫలం కావడంతో ఆసీస్ ఓటమి పాలైంది.

స్కోరుబోర్డు

భారత్ అండర్ 19: పృథ్వీషా (సి) హాల్ట్ (బి) సదర్లాండ్ 94, మన్‌జోత్ కల్రా (సి) సంఘా (బి) ఉప్పల్ 86, శుభ్‌మన్ గిల్ (సి అండ్ బి) ఎడ్వర్డ్స్ 63, హిమాన్షు రాణా (సి) వా (బి) ఎడ్వర్డ్స్ 14, రాయ్ (సి) సంఘా (బి) వా 6, అభిషేక్ (సి) సదర్లాండ్ (బి) ఎడ్వర్డ్స్ 23, నగర్‌కోటి నాటౌట్ 23, శివసింగ్ (బి) ఎడ్వర్డ్స్ 10, జుయల్ నాటౌట్ 8, ఎక్స్‌ట్రాలు 13, మొత్తం (50 ఓవర్లలో 7 వికెట్లకు) 328
వికెట్ల పతనం: 1-180, 2-200, 3-249, 4-272, 5-282, 6-298, 7-320
బౌలింగ్: బార్ట్‌లెట్ 7-1-47-0, రాల్‌స్టన్ 5-0-26-0, సదర్లాండ్ 10-0-55-1, ఎడ్వర్డ్స్ 9-0-65-4, పోప్ 3-0-22-0, మెర్లో 2-0-13-0, ఉప్పల్ 8-0-35-1, వా 6-0-64-1.

ఆస్ట్రేలియా అండర్ 19: ఎడ్వర్డ్స్ (బి) రాయ్ 73, బ్రియాంట్ (సి) శివమ్ మావి (బి) నగర్‌కోటి 14, మెర్లో (బి) శివమ్ మావి 38, ఉప్పల్ రనౌట్ (శివమ్ మావి) 4, సదర్లాండ్ (బి) నగర్ కోటి 10, హాల్ట్ (ఎల్బీ) (బి) శివమ్ మావి 39, బార్ట్‌లెట్ (సి) జుయల్ (బి) శివమ్ మావి 7, రాల్‌స్టన్ రనౌట్ (రాణా) 3, పోప్ నాటౌట్ 0, ఎక్స్‌ట్రాలు 5, మొత్తం (42.5 ఓవర్లలో ఆలౌట్) 228
వికెట్ల పతనం: 1-57, 2-86, 3-145,, 4-157, 5-166, 6-168, 7-187, 8-205, 9-228, 10-228
బౌలింగ్: శివమ్ మావి 8.5-1-45-3, పొరేల్ 4.1-0-24-0, శివ్ సింగ్ 6.4-0-30-0, నగర్‌కోటి 7-1-29-3, అభిషేక్ శర్మ 7-0-33-1, రాణా 4-0-30-0, రాయ్ 5-036-1.



పీబీఎల్-3 విజేత హైదరాబాద్

హైదరాబాద్ : ప్రీమియర్ బ్యాడ్మిం టన్ లీగ్ సిరీస్-3ని హైదరాబాద్ హంటర్స్ కైవసం చేసుకుంది. ఆదివారం గచ్చిబౌలి స్టేడియంలో హంటర్స్, బెంగళూరు బ్లాస్టర్స్ జట్ల మధ్య టైటిల్‌పోరు ఉత్కంఠగా సాగింది. నువ్వా నేనా అన్నట్లు ఇరు జట్లు తలపడ్డాయి. తొలి మ్యాచ్ పురుషుల డబుల్స్ విభాగంలో జరిగింది. బెంగళూరు బ్లాస్టర్స్ మొదటి నుంచీ జోరు కొనసాగించింది. హైదరాబాద్ జోడీని నిలువరిస్తూ ముందుకు సాగింది. కిడొ, వైవై సెయాంగ్ జోడీని బొ, కేఎస్ ర్యాంగ్ జోడీ పైచేయి సాధించింది. 9-15, 10-15 పాయింట్లతో మ్యాచ్‌ను బ్లాస్టర్స్ తమవైపు తిప్పుకుంది. మూడు మ్యాచ్‌లలో బెంగళూరు రెండిట గెలిచి రేసులోకి వచ్చింది. ఈ దశలో నాలుగో మ్యాచ్ హంటర్స్‌కు కీలకంగామారింది. మహిళల సింగిల్స్ విభాగంలో జరిగిన ఈ మ్యాచ్‌లో కరొలినా మారిన్- కె గిల్‌మోర్ మధ్య సాగింది. ప్రపంచ చాంపియన్ మారిన్ దూకుడు ముందు బ్లాస్టర్స్ క్రీడాకారిణి వెనుకబడింది. 15-8, 15-14 స్కోరుతో మారిన్ విజయం సాధించింది. దీంతో నాలుగు మ్యాచ్‌లు పూర్తయ్యే సరికి ఇరు జట్లు మూడేసి పాయింట్లతో సమవుజ్జీలుగా నిలిచాయి. దీంతో మిక్స్‌డ్ డబుల్స్ మ్యాచ్ టైటిల్ నిర్ణాయకంగా మారింది. దీంతో మ్యాచ్ ఉత్కంఠగా మారింది. కానీ, పీజడ్ బెర్నాడెత్, రాంకిరెడ్డి జోడీ ఒత్తిడిని జయించింది. ప్రత్యర్థి జట్టు ఆటగాళ్లు ర్యాంగ్, ఎన్‌ఎల్ రెడ్డి జోడీపై 15-11, 15-12 స్కోరుతో జయభేరి మోగించింది.

తడబడి.. నిలబడి..

- కోహ్లీ కెప్టెన్ ఇన్నింగ్స్ - రాణించిన విజయ్
- ద.ఆఫ్రికా 335 - టీమిండియా 183/5
- వంద వికెట్ల క్లబ్‌లోకి మహ్మద్ షమి



తొలి ఇన్నింగ్స్‌లో దక్షిణాఫ్రికా మంచి స్కోరు సాధించింది. ఒక దశలో మూడు వందల్లోపే ఆలౌట్ అయ్యేలా కనిపించింది. అయితే, మన ఫీల్డర్ల పేలవ ప్రదర్శనతో ఆజట్టు 335 పరుగులు చేయగలిగింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన టీమిండియా తడబాటుకు గురైంది. విజయ్ ఫరవాలేదనిపించినా, రాహుల్, పుజారా వెంటవెంటనే అవుట్ కావడంతో కష్టాల్లో పడింది. ఈ దశలో కోహ్లీ కెప్టెన్ ఇన్నింగ్స్‌తో జట్టును ఆదుకున్నాడు. ఓపెనర్లు మురళీ విజయ్, కేఎల్ రాహుల్ ఆచితూచి ఆడారు. స్కోరు బోర్డును నెమ్మదిగా ముందుకు కదిలించారు. అయితే ఉన్నట్టుండి 28 పరుగుల జట్టు స్కోరు వద్ద వరుస బంతుల్లో రెండు వికెట్లు కోల్పోవడంతో కోహ్లీసేన కష్టాల్లో పడింది. 10వ ఓవర్‌లో రాహుల్‌ను మోర్కెల్ రిటర్న్ క్యాచ్‌గా అవుట్ చేశాడు. తర్వాతి బంతికి పుజారా రనౌట్ అయ్యాడు. ఈ దశలో మైదానంలోకి వచ్చిన కోహ్లీ, విజయ్‌తో కలిసి జాగ్రత్తగా ఆడాడు. రబడ ఓవర్‌లో కోహ్లీ ఏకంగా నాలుగు బౌండరీలు బాదాడు. వీరిద్దరు మూడో వికెట్‌కు 79 పరుగులు జోడించారు. ఈ క్రమంలో అర్ధసెంచరీకి చేరువవుతున్న విజయ్ (46)ని మహరాజ్ పెవిలియన్ చేర్చాడు. అప్పటికి జట్టు స్కోరు 36.5 ఓవర్లకు 107పరుగులు. కెప్టెన్‌కు జతకలిసిన రోహిత్ తడబడ్డాడు. నిలదొక్కునే ప్రయత్నం చేశాడు. కానీ, రబడ బౌలింగ్ లో వికెట్ల ముందు దొరికిపోయాడు. పార్థివ్ కాసేపు వికెట్ల పతనాన్ని నిలువరించినా, పరుగులు చేయలేక పోయాడు. అర్ధసెంచరీ పూర్తయ్యాక వేగం పెంచాడు. హార్దిక్ పాండ్యాతో కలిసి ఇన్నింగ్స్‌కు నిర్మించాడు. రెండో రోజు ఆటముగిసే సమయానికి కోహ్లీ (85), పాండ్యా (11) పరుగులతో క్రీజ్‌లో ఉన్నారు. 61 ఓవర్ల ఆడిన టీమిండియా 5 వికెట్లు కోల్పోయి 183 పరుగులు సాధించింది. మూడో రోజు ఈ జోడి భాగస్వామ్యం కీలకం కానుంది. సఫారీ బౌలర్లలో మహరాజ్, రబడ, మోర్కెల్, నిగిడి తలోవికెట్ తీశారు. అంతకుముందు ఆరు వికెట్ల నష్టానికి 269 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో రెండో రోజు బ్యాటింగ్ కొనసాగించిన సఫారీలను భారత బౌలర్లు కట్టడి చేశారు. మ్యాచ్ ప్రారంభమైన కొద్దిసేపటికే, కేశవ్ మహరాజ్‌ను షమి పెవిలియన్ బాట పట్టించాడు. స్పిన్‌తో ద.ఆఫ్రికా టెయిలెండర్లను అశ్విన్ హడలెత్తించాడు. ఈ క్రమంలో విదేశాల్లో ఇన్నింగ్స్‌లో ఐదు వికెట్ల మార్క్‌ను చేరుకునే అవకాశం లభించింది. అయితే పేలవ ఫీల్డింగ్ కారణంగా అవకాశం చేజారింది. నాలుగు వికెట్లకే పరిమితం అయ్యాడు. కెప్టెన్ కోహ్లీ, పార్థివ్ పటేల్, హార్దిక్ పాండ్యా-షమిలు క్యాచ్‌లను నేలపాలు చేశారు. రబడకు రెండు జీవనదానాలు లభించాయి. ఎనిమిదో వికెట్‌కు డుప్లెసిస్ 42 పరుగులు జోడించాడు. ఫీల్డింగ్ వైఫల్యం కార ణంగా 300 పరుగుల లోపే ఆతిథ్య జట్టును ఆలౌట్ చేయాలన్న భారత్ ప్రణాళికలు బెడిసికొట్టాయి. డుప్లెసిస్ (63), రబడ (11)ను ఇషాంత్ అవుట్ చేయగా, మోర్కెల్ (6)ను అశ్విన్ అవుట్ చేశాడు. దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్ 335 పరుగుల వద్ద ముగిసింది.

షమి - 100 వికెట్లు

ఓవర్‌నైట్ బ్యాట్స్‌మన్ కేశవ్ మహరాజ్‌ను ఔట్ చేయడం ద్వారా మహ్మద్ షమి అరుదైన రికార్డును చేరుకున్నాడు. టెస్టుల్లో వేగంగా వంద వికెట్లు తీసిన మూడో పేసర్‌గా నిలిచాడు. 29 టెస్టులోనే షమి ఈ ఘనత సాధించాడు.

స్కోరుబోర్డు

దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్: ఎల్గర్ (సి) విజయ్ (బి) అశ్విన్ 31, మర్‌క్రమ్ (సి) పటేల్ (బి) అశ్విన్ 94, ఆమ్లా రనౌట్ 82, డివిలియర్స్ (బి) ఇషాంత్ 20, డు ప్లెసిస్ (బి) ఇషాంత్ 63, డికాక్ (సి) కోహ్లి (బి) అశ్విన్ 0, ఫిలాండర్ రనౌట్ 0, మహరాజ్ (సి) పటేల్ (బి) షమి 18, రబాడ (సి) పాండ్య (బి) ఇషాంత్ 11, మోర్కెల్ (సి) విజయ్ (బి) అశ్విన్ 6, ఎన్‌గిడి నాటౌట్ 1, ఎక్స్‌ట్రాలు 9, మొత్తం (113.5 ఓవర్లలో ఆలౌట్) 335, **వికెట్లపతనం:** 1-85, 2-148, 3-199, 4-246, 5-250, 6-251, 7-282,, 8-324, 9-333, 10-335, **బౌలింగ్:** బుమ్రా 22-6-60-0, షమి 15-2-58-1, ఇషాంత్ 22-4-46-3, పాండ్య 16-4-50-0, అశ్విన్ 38.5-10-113-4.

ఇండియా: మురళీ విజయ్ (సి) డికాక్ (బి) మహరాజ్ 46, రాహుల్ (సి) (బి) మోర్కెల్ 10, పుజారా (రనౌట్) నిగిడి 0, కోహ్లి (నాటౌట్) 85, రోహిత్ శర్మ (ఎల్‌బీడబ్ల్యూ) రబడ 10, పార్థివ్ పటేల్ (సి) డికాక్ (బి) నిగిడి 19, హార్దిక్ పాండ్యా (నాటౌట్) 11, ఎక్స్‌ట్రాలు 2, మొత్తం 61 ఓవర్లకు 183/5, **బౌలింగ్:** కేశవ్ మహరాజ్ 16-1-53-1, మోర్కెల్ 15-3-47-1, ఫిలాండర్ 9-3-23-0, రబడ 12-0-33-1, లంగిసాని నిగిడి 9-2-26-1

Printed & Published by MOOTHA GOUTAM on behalf of Andhra Prabha Publications Ltd., and printed at Andhra Prabha Publications Ltd., 13-6-445/a/b1, Konejeti Enclave, Mehdhipatnam, Hyderabad-500028. Published from Andhra Prabha Publications Ltd., 8-2-293/82/A/75, Plot No.75, Road No.9, Jubilee Hills, Hyderabad-500033. Phones: 23559940/41/42/45, Fax No.23558812. Editor: Y S R Sarma, Responsible for News selection under PRB ACT. RNI Regd.No.32178/1977.